1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 3
పుటలు : 52
రు. 20 లు
తెనాలి


తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

మే 2019

అతి సామాన్య స్థితి నుంచి స్వయంకృషితో ఎదిగి అత్యున్నత స్థాయికి చేరిన జీవితం ఆయనది. ఆయన నిత్య శ్రామికుడు. కఠిన శిల నుండి పుట్టి ఎదిగిన మహావృక్షం ఎస్.పి.వై. రెడ్డి. కొన్నివేల కుటుంబాలకు జీవనాన్నిచ్చాడు. తానుగా కలలు గనడంతో పాటు, వాటిని నిజాలు చెయ్యడం కోసం పట్టుదలతో, అంకితమై చేసిన కృషి ఫలితంగానే ఒక పారిశ్రామిక వేత్తగా, వరుసగా మూడుసార్లు లోక్‌సభ సభ్యుడిగా, అనేక సంస్థలకు అండదండల నందించిన మహోన్నతుడుగా తెలుగువారి చరిత్రలో, ముఖ్యంగా రాయలసీమ చరిత్రలో తన స్థానాన్ని పదిలపరచుకొన్న ఎస్.పి.వై.రెడ్డి ఏప్రిల్ 30న కనుమరుగయ్యారు.







ఐఐటి మద్రాసువారి విచిత్ర ప్రయత్నం


లిపుల వైవిధ్యం భాషల, సంస్కృతుల వైవిధ్యానికి ప్రతీక. ఏకీకృత లిపి అనేది-బైట నుండి తెచ్చిన ఒక పరాయి సాంస్కృతిక చిహ్నాన్ని ప్రాంతీయ లిపులపై రుద్దడం. ఇది అనవసరం, పైగా దీనివలన జరిగే మేలుకన్నా కీడు ఎక్కువ.




ఉక్రెయిన్‌లో 2017లో వచ్చిన చట్టం ప్రకారం భాష అన్ని స్థాయిలలో విద్యామాధ్యమంగా ఉండాలి. ప్రాంతీయంగా ఇతర భాషల మూల వాసులకు, వారివారి మాతృభాషలో ప్రీ స్కూల్, ప్రాథమిక తరగతుల్లో విద్యను అభ్యసించేలా చర్యలను తీసుకునే వెసులుబాటును ఇచ్చింది.

మన మాతృభాషల్లో కథలు- 2


గత సంచికలో స్టోరీవీవర్ మన మాతృభాషల్లో చిన్నపిల్లలకు ఏ విధంగా వేలల్లో ఉచితంగా కథలను రంగురంగుల బొమ్మలతో ఉచితంగా అందిస్తుందో చూసాము. అలాగే ఎవరైనా కథలు రూపొందించవచ్చు లేదా రాయవచ్చు అని తెలుసుకున్నాం. కానీ ఎలా?.




మొదటగా storyweaver.org.in అనే చిరునామాకు వెళ్ళి, వలగూడులోపలికి ప్రవేశించాలి. అందుకు కావాల్సిన లంకెలు కుడివైపు పైన ఉంటాయి.



మీరు కొత్తగా ఖాతా సృష్టించుకోవచ్చు లేదా ఫేస్‌బుక్, గూగుల్ ఖాతాలతోనే ప్రవేశించవచ్చు.



ప్రవేశించాక, వలగూడు పైపట్టీలో Read, Readalong, Create, Translate, Images, Likes మొ. లంకెలు ఉంటాయి. వాటిలో Createపై నొక్కి కథను సృష్టించే పేజీకి వెళ్ళవచ్చు. అక్కడ ఏ భాషలో కథ రాస్తున్నదీ, కథశీర్షిక ఏమిటి, చదివే స్థాయి ఏమిటి, మొదలగు వివరాలు చొప్పించాలి.



(తరువాయి 3వ అట్టపై చూడండి...)

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...

◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...


◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



మే 2019

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు: **పావులూరి చిదంబరేశ్వరరావు**

వ్యంగ్యచిత్రాలు: **సరసి** కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (WhatsAp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు పరిశీలించము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులోగాని, లేదా editorammanudi @gmail. com కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

హెచ్చరిక

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

ముఖచిత్రం

ఉక్రెయిన్‌లో భాషా రాజకీయాలు
మాతృభాషలో విద్యాబోధనే ప్రధానాంశం!

ఉక్రెయిన్ సోవియట్ రష్యన్ సంఘంలో భాగంగా ఉండి, 1990 ఆగస్టులో స్వతంత్ర దేశంగా మనుగడలోకి వచ్చింది. ఉక్రెయిన్ చరిత్ర 6 వేల ఏళ్ళ నాటిది, రష్యన్ భూభాగానికీ, ఇస్లామీ దేశాలకూ, అలానే ఆసియా ఖండానికీ, ఐరోపా ఖండానికీ సరిహద్దుల్లో ఉండే ప్రాంతం గనుక ఆ అర్థం తెలిపేలా- ఉక్రెయిన్‌కు ఆ పేరు వచ్చింది. రాజకీయ సమీకరణాలు, దేశ స్వాతంత్ర్యం తరువాత ప్రస్తుతమున్న ఉక్రెయిన్ దేశంలో 78 శాతం ఉక్రేనియన్లు, 13 శాతం రష్యన్లు, 5 శాతం ఇతరులు నివసిస్తున్నారు.

13 శాతం ఉన్న రష్యన్లే ఉక్రెయిన్‌లో రాజకీయంగా కీలక పదవుల్లో ఉంటూ వచ్చారు. అధికార భాష ఉక్రేనియన్ ఐనప్పటికీ దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి రష్యన్‌లో మాట్లాడ్డం గమనార్హం. రష్యా రాజకీయ జోక్యం వలన అయితేనేమి, రష్యన్ ప్రజలొచ్చి ఉక్రెయిన్‌లో స్థిరపడటం వలన అయితేనేమి, మరే కారణాల వలన అయితేనేమి, నగర-పట్టణ ప్రాంతాలలో, ముఖ్యంగా యువతను ఆకర్షించే పాప్ సంగీత సాహిత్యానికి భాషగా, వాణిజ్య కార్యకలాపాలలో ప్రధాన భాషగా, అనధికార భాషగా రష్యన్ భాష స్థిరపడింది. ఎంతగా అంటే తూర్పు, దక్షిణ ఉక్రెయిన్ భాషలో ప్రజలు రష్యన్‌లను తమ మాతృభాషగా పరిగణించేంతగా. ఉక్రేనియన్ సమాజంలో భాష పట్ల ఉన్న ఈ అంతరాలు రాజకీయ ఉపద్రవాలకు దారితీస్తున్నాయి.

18, 19 శతాబ్దాల కాలంలో విపరీతంగా వచ్చి చేరుతున్న రష్యన్ సెటిలర్ల వలన తమ భాషకు ఆపద ఉందని తెలుసుకున్న ఉక్రెయిన్ రాజకీయ పెద్దలు 1863 లో తిరుగుబాటు చేసారు. ఇది గమనించిన రష్యన్ సామ్రాజ్యాధినేతలు నియంతృత్వ ధోరణిలో ఉక్రేనియన్ భాషలోని ధార్మిక, రాజకీయ ప్రచురణలపై నిషేధం విధించి, రష్యన్ భాషను అధికార భాషగా ఉక్రెయిన్ ప్రాంతాలలో అమలు చేసారు. 1918లో సోవియట్ ప్రభుత్వం జారీ చేసిన మాతృభాషలో విద్య చట్టం అమలులోకి రావటంతో ఉక్రేనియన్ భాష తిరిగి పుంజుకుంది. నిజానికి 1990 వరకు సోవియట్ రష్యాలో ఒక జాతీయ భాష అంటూ లేదు. అన్ని భాషల సమానత్వంతో నడిచినా, లోలోపల మాత్రం రష్యన్ కు ఉన్న ప్రాధాన్యత కొనసాగింది. 1990 దశకంలో సోవియట్ విడిపోయాక, రష్యా పెద్దలు సభ్య దేశాలను బాహ్యంగా తమ అధికార భాషలను ఎన్నుకోమని చెబుతూనే లోలోపల రష్యన్ భాషకు అధిక ప్రాధాన్యతను ఇచ్చాయి. ఆ విధంగా అధికార భాషగా గుర్తింపు ఉన్నప్పటికీ, ప్రభుత్వం నుండి ఆర్థిక సహకారం ఉన్నప్పటికీ ఉక్రేనియన్ భాష పరిస్థితి దిగజారుతూనే వచ్చింది. రాజకీయచైతన్యం ఉన్న పశ్చిమ ఉక్రేనియన్ లో ప్రజలు రష్యన్ ను తిరస్కరిస్తారు, కానీ మిగతా అన్ని ప్రాంతాలలో రష్యన్ కు అనధికారికంగా ఒక దర్జా ఉంది.

ఉక్రేనియన్ భాష పెంపుదలకై సాగుతున్న కృషి

ఉక్రేనియన్ భాషను పెంపొందించేందుకు ఉక్రెయిన్ ప్రభుత్వం ఎంతో కొంత చేస్తూనే ఉంది. రష్యన్ పుస్తకాలను నిషేధించి ఉక్రేనియన్ పుస్తకాలను పెంపొందించాలని చూస్తే, ఆ నిర్ణయం ప్రజాదరణ పొందలేక పోయింది. మీడియాలో, పుస్తకాలలో, విద్యలో ఉక్రేనియన్ భాష మెల్లిగా ప్రభుత్వ చర్యల వలన ఒక స్థానాన్ని ఏర్పరుచు కుంటోంది. దేశంలో అమ్ముడయ్యే సాహిత్యపు పుస్తకాలలో 60% వాటా రష్యన్ పుస్తకాలది, రష్యా నుండి ఈ పుస్తకాలను వాణిజ్యపరంగా దిగుమతి చేయడం పై నిషేధం ఇంకా అమలులో ఉంది. 75% జాతీయ, 50% ప్రాంతీయ టీవీ ప్రసారాలు, రేడియో ప్రసారాలు కచ్చితంగా ఉక్రేనియన్ భాషలో ఉండేలా 2017లో చట్టాలను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది.

అన్ని స్థాయిల్లో విద్యామాధ్యమంగా 'ఉక్రేనియన్'

2017 లోనే చదువుల మాధ్యమాల పై ఒక చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఉక్రేనియన్ భాష అన్ని స్థాయిలలో విద్యా మాధ్యమంగా ఉండాలి. ఇదే చట్టం, ప్రాంతీయంగా ఇతర భాషల మూలవాసులకు, వారి వారి మాతృభాషలలో ప్రీస్కూల్, ప్రాథమిక తరగతుల్లో విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకునే వెసులుబాటును ఇచ్చింది. అయితే మాతృభాషలలో విద్య అమలు ముసుగులో ఉక్రేనియన్ రుద్దబడుతోందని పలు స్వచ్ఛంద సంస్థలు ఆరోపణలు చేసాయి. జులై 2018 మొదలు పలు స్థానిక ప్రభుత్వాలు ప్రాంతీయ భాషగా రష్యన్ భాష గుర్తింపును ఉపసంహరించుకున్నాయి.

రాజ్యాంగ పరంగా ఉక్రేనియన్ భాష జాతీయ భాష అయినప్పటికీ రష్యన్ భాష ప్రాచుర్యం కాదనలేనిది. 2001 జనాభా లెక్కల ప్రకారం 67.5 % జనాభా తమ మాతృభాషగా ఉక్రేనియన్, 29.6% జనాభా తమ మాతృభాషగా రష్యన్ అని తెలిపారు. దాదాపుగా ఉక్రేనియన్ మాతృభాష ఉన్న జనాభా మొత్తం ద్వితీయ భాషగా రష్యన్ ను మాట్లాడగలదు.

ప్రాంతీయ పాలన ముఖ్యంగా ఉన్న ఉక్రెయిన్ లో 2012 లో వచ్చిన చట్టం ప్రకారం కనీసం 10% జనాభా మాట్లాడే మైనారిటీ భాషను ఆ ప్రాంతపు అధికార భాషగా గుర్తిస్తారు. ఆ విధంగా రాత్రికి రాత్రే రష్యన్ భాష చాలా ప్రాంతాలలో, నగరాలలో ప్రాంతీయ అధికార భాషగా గుర్తింపు పొందింది. అధికార పత్రాలలో, ఉత్తర ప్రత్యుత్తరాలలో రష్యన్ భాష వాడకం పూర్తిగా వచ్చి ఇతర చిన్న భాషల అస్తిత్వానికి ప్రశ్నార్థకం అయింది. పర్యవసానంగా 2014 లో వచ్చిన ఉక్రేనియన్ విప్లవంలో ప్రాంతీయ అధికార భాషగా రష్యన్ భాష గుర్తింపు రద్దయింది. 2019 లో ప్రాంతీయ అధికార భాషల గుర్తింపును రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే గత రాష్ట్రపతి, ప్రస్తుత రాష్ట్రపతి ఉక్రేనియన్ ను ఏకైక రాజభాషగా ఇప్పటివరకు గుర్తించలేదు. ఉక్రేనియన్ భాష ప్రధానంగా పశ్చిమ, మధ్య ఉక్రెయిన్ భూభాగంలోని ప్రజలు మాట్లాడతారు. గ్రామాలలో ఉక్రేనియన్ ప్రధాన భాష.

- రహ్మానుద్దీన్ షేక్ 94930 35658



నల్లూరి రుక్మిణిగారికి చిలుకూరి దేవపుత్ర సాహిత్య పురస్కారం

'చిలుకూరి దేవపుత్ర సాహిత్య పురస్కారం - 2019' ను ప్రముఖ రచయిత్రి నల్లూరి రుక్మిణిగారికి అనంతపురంలో 24-04-2019న ఎన్.జి.ఓ. హోమ్‌లో అందజేశారు. సభాధ్యక్షులు బండి నారాయణ స్వామి మాట్లాడుతూ "నల్లూరి రుక్మిణి గారికి చిలుకూరి దేవపుత్రగారితో సామీప్యతగా ఉండేవారని అన్నారు. 'రుక్మిణిగారు అవార్డులకై ఎప్పుడూ ఆశించే రచయిత్రి కాదు. హుందాగా ఉండే రచయిత్రి నల్లూరి రుక్మిణి' అని ప్రశంసించారు. ముఖ్య అతిథిగా రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు మాట్లాడుతూ నల్లూరి రుక్మిణిగారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నల్లూరి రుక్మిణిగారు నిజాయితీగల రచయిత్రిగా పేర్కొన్నారు. రాయలసీమ అంతటా పర్యటించి, కరువు మీద కథలు రాశారు అన్నారు. విశిష్ట అతిథి స.వెం.రమేశ్, ఆత్మీయ అతిథిగా శాంతినారాయణ, వక్తగా నాగేశ్వరాచారి మాట్లాడారు.



బళ్ళారిలో తెలుగు రచయితల సంఘం

బళ్ళారి జిల్లా పట్టణంలోని రాఘవ కళామందిర భవనంలో 25-4-2019 న తెలుగు రచయితల సమావేశం నిర్వహించారు. రాఘవ కళామందిరం అధ్యక్షులు కోటేశ్వరరావుగారు సభకు అధ్యక్షత వహించారు. తెలుగు భాషోద్యమకారులు స.వెం.రమేష్ ముఖ్య అథిదిగా మాట్లాడుతూ తమిళనాడు ప్రాంతంలో తెలుగుభాషా స్థితిగతుల గురించి ఆ ప్రాంతంలో సంఘాలు చేస్తున్న కృషి గురించి వివరించారు. వివిధ ప్రాంతాలలోని తెలుగు ప్రజలు తమ జీవితాలను, సంస్కృతిని రచనల ద్వారా రికార్డు చేయాలని కోరారు. బళ్ళారి ప్రాంతంలో కూడా తెలుగు రచయితలు క్రియాశీలకంగా రచనలు చేసి, పుస్తకాలుగా ప్రచురించాలన్నారు. సంఘంగా దీర్ఘకాలిక కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. తెలుగుభాషా కార్యకర్తలు హైదరాబాదు నుండి అడపాల సుబ్బారెడ్డి, అనంతపురం నుండి డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బళ్ళారి ప్రాంత రచయితలతో బళ్ళారి జిల్లా రచయితల సంఘం ప్రారంభించారు. సంఘం నిర్వహణకు ఆర్. దేవన్న గారిని ఎంపిక చేసారు. చెన్నప, బసవరాజు, రమేష్ పాటిల్, రామాంజినేయులు, సత్యనారాయణ రెడ్డి, సురేష్, రుద్రప్ప, మల్లికార్జున రెడ్డి, ప్రభాకర్, సిద్దరామ, నేతి రఘురామ్, పంపన గౌడ, వెంకటేషు తదితరులు పాల్గొన్నారు.

సంపాదక హృదయం

'నడుస్తున్న చరిత్ర'ను ఆదుకొన్న ఎస్.పి.వై.రెడ్డిగారు



రాత్రి 10.30కు మిత్రుడు శ్రీ బి.ఎస్.రాములు ఫోన్ చేసి 'ఎస్.పి.వై. రెడ్డిగారు చనిపోయారట, టీవీలో వార్త వస్తున్నది' అని చెప్పారు. నేను ఏదో కుదుపుకు లోనవుతున్నట్లు అనిపించింది.

1995 నాటి నుంచీ స్నేహం. 1993 డిసెంబరులో నడుస్తున్న చరిత్ర మొదటి సంచికను వెలువరించినా, ఆ తర్వాత అది ఆటుపోటుల్ని తట్టుకొని 2013 అక్టోబరు వరకూ కొనసాగుతుందని, ఒక చరిత్రను సృష్టిస్తుందనీ నేనెన్నడూ ఊహించలేదు. మిత్రుడు నౌరోజీరెడ్డిని తోడు తీసుకొని 'నంది పైపుల కంపెనీ' ప్రకటనలకోసం ఎస్.పి.వై.రెడ్డిగారిని నంద్యాలలో కలవడంతో మొదలైన స్నేహం ఇరవయ్యేళ్లపాటు నడుస్తుందని నేను అనుకోలేదు. తొలిసారి కలిసినపుడు నన్ను ఎస్.పి.వై.కి పరిచయం చేస్తూనే 1975లో ఎమెర్జెన్సీ చీకటి అధ్యాయం నాటి సంగతులనూ, నేను నిర్వహించిన పాత్రనూ నౌరోజీ ఆయనతో చెప్పారు. వైద్యుడుగా నా గురించి చెప్పి, ఇదిగో ఇప్పుడు ఈ పత్రికను పెట్టి, కష్టాల్లో పడ్డాడనీ మీ వంటి పారిశ్రామిక వేత్తలు ప్రకటనలు ఇచ్చి అండగా నిలబడాలనీ నౌరోజీ అనేశారు. అప్పుడాయన నా వంక చిరునవ్వుతో చూసిన చూపు నా కెందుకో కొంత శక్తి నిచ్చింది. అప్పటికి ఆయన ఒకసారి ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ అభ్యర్థిగా పోటీ చేసి వున్నారు. రాజకీయాల్లో కొనసాగాలా వద్దా అనే ఆలోచన ఆయనలో బాగా సాగుతూ ఉంది. ఈ సమాజానికేదైనా చేయాలనే తపన వారిలో ఉంది. అప్పటికే కొన్ని కార్యక్రమాల్ని స్థానికంగా చేపట్టారు. ఆ రోజున ఇంటికి భోజనానికి తీసుకువెళ్లారు. మితభాషి అయినా, క్లుప్తంగా ఆయన మాటల్లో భావాలు బయట పడుతూనే ఉన్నాయి. 'నెలకోసారి రా అన్నా', 'ప్రకటన' తీసుకొన్నట్లూ ఉంటుంది. సామాజిక అంశాలు, రాజకీయాలు మాట్లాడుకొంటూ ఉందాం అన్నారు. నెలనెలా కాకపోయినా తరచుగా ఆయనను కలవడం సాగింది. నేను ఆయన్ను కలువడానికి వెళ్లే ముందు ఆయనకు ఫోన్ చెయ్యడం, వెళ్లిన

తర్వాత ఆ ఒక్క రోజూ ఆయన ఎక్కడకు వెళ్లినా కలిసి తిరుగుతూ ఎన్నో సంగతులు మాట్లాడుకోవడం జరిగేది.

ఎస్.పి.వై.తో పరిచయం అయిన కొద్ది నెలల్లోనే పత్రిక ఆర్థిక కష్టాల్ని గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. మూడు నాలుగు విడతలుగా కొంత సహాయం చేశారు. 'అప్పులుండకూడదు, పత్రికకు నేను అండగా ఉంటాను కానీ దాన్ని తనను తాను పోషించుకొనేట్లు చూడు... రెండు మూడేళ్ల వ్యవధిలో' అన్నారాయన. అంటూనే 'ఇక పత్రికకు ఓనర్‌ను నేనే' అన్నారు – నవ్వుతూ. ఆ వెంటనే ఎస్.పి.వై. రెడ్డి గారి పేరు సారథిగా పత్రికలో ప్రకటించడం మొదలు పెట్టాను. తర్వాత నంద్యాలలోనో, మరొక ఊళ్లోనో మేము కలుస్తున్నప్పుడు ఆయన మిత్రులకు 'ఇదంతా రమేష్‌బాబు పనే. ఊరికే నా పేరు వేస్తాడు' అంటూనే నన్ను పొగుడ్తూ నాలుగు మంచి మాటలు చెప్పేవారు! ఆయనకు గుండెజబ్బు చేసింది. హైదరాబాదులో ఆపరేషన్ చేయించుకొన్నారని తెలిసి సి.ధర్మారావుగారూ నేనూ కలసి వెళ్లాం. అదే చిరునవ్వు. ఆత్మీయమైన పలకరింపూ. మాటల్లో వయస్సులు తిరిగేసుకొన్నాం. నా కంటే మూడు నాలుగేళ్లు చిన్నవారని తెలుసుకొన్నా. 'ఆయన గంభీరమైన మనిషి, హృదయమెంతో విశాలం. సమాజం పట్ల అవగాహన, సానుభూతీ గల మనిషి. ఆయన నూరేళ్లూ బ్రతకాలని' మాలో మేము కోరుకుంటూ వెనుదిరిగాము. తర్వాత కొన్ని వారాలకు నంద్యాల వెళ్లాను. షటిల్ కోర్టులో ఉత్సాహంగా ఆడుతూ కనిపించారు.

తర్వాత దశాబ్దం పైనే జరిగిపోయింది. అప్పుడప్పుడూ అనారోగ్యంగా ఉంటున్నట్లు తెలుస్తూనే ఉంది. పనిని పెంచుకొన్నారే తప్ప, తగ్గించుకోలేదు. ఎస్పివై గారి బలమంతా ఆయన అర్ధాంగే. నిత్య జీవితంలో నైతిక శక్తి అంతా ఆ తల్లిదే. ఇద్దరు కుమార్తెలు, ప్రాణంగా చూసుకునే పెద్దల్లుడూ. ఆయన కుటుంబం ఆయనకు కొండంత బలం.

రెడ్డిగారి గురించి వ్రాయాలంటే అది ఒక పెద్ద పుస్తకమే అవుతుంది. దానికి ఎవరైనా సమర్థులు పూనుకోవాలి. సరిగ్గా అక్షరబద్ధం చేస్తే – అది యువతకూ, ప్రజానీకం అంతటికీ మేలు చేసేది కాగలదు.

మూడుసార్లు వరుసగా లోక్‌సభకు ఎన్నికైన శక్తి ఆయనది. ప్రతిసారీ ఆ సందర్భాల్లో కలిసి శుభాకాంక్షలు తెలిపేవాణ్ణి. తెలుగుకు ప్రాచీన భాష హోదాకై పార్లమెంటులో పట్టుబట్టడమే కాదు, అది చేకూరేదాకా వెంటపడ్డారు. తెలుగు భాషోద్యమానికి గట్టి సమర్థకుడాయన. 1995లో 'నవ నిర్మాణ ఉద్యమ సమతి' ని ఆయనా నేనూ కలిసి ప్రారంభించాము. ఆ సందర్భంగా రాలేగాంవ్ సింధి కి నేను వెళ్లి అన్నా హజారేను కలిసి చర్చించేందుకు ప్రోత్సాహకులు రెడ్డిగారే.

ఒక్క రూపాయికి 'జొన్న రొట్టె – పప్పు' పథకం ఎంతో పేరు తెచ్చి పెట్టింది. రైతు సమస్యల పరిష్కారం ఆయనకు ఇష్టమైన విషయం. నాణ్యమైన విద్యుత్తునిచ్చి మోటార్లు కాలిపోకుండా కాపాడండి. గిట్టుబాటు ధర ఇచ్చి రైతును ఆదుకోండి, చాలు. ఈమాత్రం ప్రభుత్వాలు చేస్తే రైతు బంగారాన్ని పండిస్తాడు అనేవారు ఎస్.పి.వై. ప్రతి గ్రామానికీ 'మినరల్ వాటర్'ను ఎందుకివ్వలేం...అనేవారాయన. ఇలా ఎన్నో అంశాలు.

ఎస్.పి.వై.రెడ్డిగారు పరిచయమయ్యుండకపోతే 'నడుస్తున్న చరిత్ర' అన్నేళ్ళు కొనసాగి ఉండేది కాదేమో! తెలుగు భాషోద్యమానికి వెన్నుదన్నుగా ఆ పత్రిక నిలబడడమూ, నేను తెలుగు భాషోద్యమంలో ప్రముఖంగా పాలు పంచుకోవడమూ ఇదంతా జరిగి ఉండేదా?! ఏమో!

నా జీవితంలో ఎంతో కీలక భాగమైన – సోదరుడు 'ఎస్.పి.వై.రెడ్డి'గారి సహవాసాన్ని, సహకారాన్ని నేను మరువలేను. ఆయన కనుమరుగైన సంగతిని కూడా మరువలేను...

సామల రమేష్‌బాబు

తేదీ : 1-5-2019

రహ్మానుద్దీన్ షేక్
94930 35658


భారతి లిపి : ఐఐటి మద్రాసు వారి విచిత్ర ప్రయత్నం

ఐఐటి మద్రాసులోని శ్రీనివాస చక్రవర్తి అనే వ్యక్తి ఒకే దేశం, ఒకే లిపి అన్న నినాదంతో భారతి అనే లిపిని కనిపెట్టాడు. భారతదేశ భాషలన్నింటికీ ఏకీకృత లిపిని అందివ్వడం వీరి లక్ష్యం. లిపి అనేది భాషకు వెన్నుదన్ను. లిపిలో భాష భావన ఇమిడి ఉంటుంది. ఆ భూభాగపు లక్షణాలు లిపిలో ప్రతిబింబిస్తాయి. తెలుగు లిపి వందల ఏళ్ళుగా మెరుగుపడుతూ ప్రస్తుత స్థితికి చేరింది. మనిషి చేసే శబ్దాలు భాష అయితే, ఆ భాషకు అక్షర రూపం లిపి. తెలుగు లిపికి ఉన్న విశిష్టత, మిగతా భారతీయ భాషలతో పోల్చుకుంటే, మన వాడకంలో ఉన్న అన్ని శబ్దాలకు అక్షరాలు కలిగి ఉండటం. వాటిని పూర్తి స్థాయిలో మనం ఉపయోగించడం లేదు, అది వేరే విషయం.

తిరుమల రామచంద్రాచార్య మన లిపి పుట్టు పూర్వోత్తరాలు పుస్తకంలో తెలుగు లిపి పరిణామక్రమాన్ని ముఖ్యంగా చర్చిస్తూ మానవభాషల లిపుల ఆవిర్భావాన్ని గురించి చర్చిస్తారు. లిపుల **వైవిధ్యం భాషల, సంస్కృతుల వైవిధ్యానికి ప్రతీక. ఏకీకృత లిపి అనేది బయట నుండి తెచ్చిన ఒక పరాయి సాంస్కృతిక చిహ్నాన్ని ప్రాంతీయ లిపులపై రుద్దడం. ఇది అనవసరం, పైగా దీనివలన జరిగే మేలు కన్నా చేటు ఎక్కువ.**

ఇక ఈ ఐఐటి మద్రాసులో రూపొందిన లిపిని గమనిస్తే, ఇది కేవలం అచ్చు లేదా కంప్యూటర్ ప్రధానంగా రూపొందిందే తప్ప, చేతివ్రాతలో ఈ లిపి అక్షరాలను మలచటం కష్టం. ఒక అక్షరం, ఇంకొక అక్షరానికి ఉన్న తేడాను చేతివ్రాత తగ్గిస్తుంది, ఆ తగ్గింపు రెండు అక్షరాలను దాదాపు ఒకటే విధంగా చూపిస్తే, అనర్థాలు వస్తాయి. అలాంటి సమస్య ఈ లిపిలో దాదాపు అన్ని గుణింతాలలో కనిపిస్తోంది. లిపిని కనిపెట్టాక, ఆ లిపి వాడుకను పరిశీలించాలి. అందుకు కాస్త కాలం పడుతుంది. అంత సమయం వెచ్చించకుండా, **ప్రభుత్వ నిధులను ఖర్చు పెట్టి, ఒక అర్థం పర్థం లేని లిపిని తయారు చేసి, అక్కడితో ఆగకుండా ఆ లిపిలో భాష పనిముట్లని ఖర్చు చేసి, వాటి ఘనకార్యంగా ప్రకటించుకోవడం గమనించాలి.** ఇక్కడొక కథ చెప్పుకుందాం, పూర్వం చీకటి రాజ్యంలో తికమక రాజు ఉండేవాడట. అంతకు ముందు రాజ్యం చేస్తున్న రాజు, అతని సైన్యంతో యుద్ధానికి వెళ్ళి, అందరు విజ్ఞులను పోగొట్టుకొని వారందరిని యుద్ధంలో చంపుకున్నాడట.

రాజ్యంలో కేవలం మూర్ఖులే మిగిలారట. ఆ రాజు ఆత్మహత్య చేసుకుని మూర్ఖుడైన తన దాయాదికి ఆ రాజ్యాన్ని అప్పచెప్పి చనిపోయాడట. ఈ కొత్త తికమక రాజుకు రాజనీతిపై అస్సలు అవగాహన లేదు, అతని చుట్టూ చేరిన మూర్ఖ శిఖామణులు కలిసి రాగా చిత్ర విచిత్ర చట్టాలు రాజ్యంలో అమలు చేసాడట. ఏ వస్తువైనా వర్తకంలో ఒకే ధరకు అమ్మాలి, ఏ నేరానికైనా ఒకే శిక్ష అమలు పరచాలి, రాజ్యమంతటా ప్రజలు ఒకే రంగు దుస్తులు వేసుకోవాలి,





అందరూ ఒకే భాష మాట్లాడాలి, ఒకే దైవాన్ని పూజించాలి వగైరా. ఇక ఆ దేశ పరిస్థితి ఏమై ఉంటుంది? మిగిలిన తెలివి వాళ్ళంతా రాజ్యాన్ని మెల్లగా వదిలి వెళ్ళిపోతారు. రాజ్యానికి వచ్చిన ఒక తెలివైన గురువుగారు తమ ఇద్దరు శిష్యుల్లో ఒకడు మూర్ఖరాజు సభలో మరణశిక్ష పొందబోతుండగా, చొరబడి ఆ శిక్షను రాజుకు అమలయ్యేలా చేస్తాడు. ఆ కథ సుఖాంతమవుతుంది. కథ నుండి అర్థమయినది ఏమిటంటే, వస్తువుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని తన ఆలోచనకు మించిందనుకున్న రాజు, అతని మంత్రులు అన్ని వస్తువులను ఒక కాడుకి కట్టేస్తే సమస్య పరిష్కారమయిందనుకున్నారు. అన్ని నేరాలు పరిశీలించే ఓపిక లేక, అన్ని నేరాలకు ఒకే శిక్ష అన్నారు.ఇది భారతెందు హరిశ్చంద్ర రాసిన 'అంధేర్ నగరి, చౌపట్ రాజా'.

అలానే ఈ ఐఐటి మద్రాసు పెద్ద చేసిన పని ఏమిటంటే, భాషలు చాలా క్లిష్టమైనవి, వాటికి తగిన భాషా పనిముట్లు తయారు చేయడం అంతకన్నా కష్టమైన పని, దానికి బదులు నా ఆలోచనలకు,

నా బద్ధకానికి తగిన ఒక కొత్త లిపిని కనిపెట్టి ఆయా భాషల స్థాయిని నా లిపి స్థాయికి తెగ్గొట్టి నా లిపి మీద పని చేస్తున్నాయి గనుక ఈ పనిముట్లు విజయవంతం అయ్యాయి'. అనే భావనలో ఉన్నాడు అని అనిపిస్తోంది.

భారతీయ భాషల పై జరగాల్సిన పరిశోధనలకు, పని చేయాల్సిన సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వనంత వరకు ఇలాంటి నాణ్యతలేని పరిశోధనలే చలామణి అవుతాయి. భాషల పట్ల శ్రద్ధ ఉండి ఉంటే ప్రభుత్వాలు ఇలాంటి వృథా పనులలో డబ్బులు ఖర్చు చేయవు.

ఏప్రిల్ 27న వచ్చిన హిందూ పత్రిక వార్తలో, సరికొత్త పురోగతిగా ఈ ఐఐటి మద్రాసు భారతి లిపి జట్టు వారు తమ లిపిలో ఓసీఆర్ పని చేస్తుందన్నారు. తద్వారా తొమ్మిది భాషల్లో ఓసీఆర్ పని చేస్తోందని రాసుకున్నారు. అది భాషలను ఉద్ధరించే విధానంగా పలువురు ఈ వార్తను సోషల్ మీడియాల్లో పంచుకున్నారు.

హల్లులు –

తెలుగు లిపిలో					
క	ఖ	గ	ఘ	ఙ	
చ	ఛ	జ	ఝ	ఞ	
ట	ఠ	డ	ఢ	ణ	
త	థ	ద	ధ	న	
ప	ఫ	బ	భ	మ	
య	ర	ఱ	ల	ళ	వ
శ	ష	స	హ		




అచ్చులు –


తెలుగు లిపిలో			
అ	ఆ	ఇ	ఈ
ఉ	ఊ	ఋ	ౠ
ఎ	ఏ	ఐ	
ఒ	ఓ	ఔ	
అం	అః		



గుణింతం –

తెలుగు లిపిలో			
క	కా	కి	కీ
కు	కూ	కృ	కౄ
కె	కే	కై	
కొ	కో	కౌ	
కం	కః		





వెన్నెలకంటి రామారావు
95503 67536

ఆంగ్లారాధన అనర్థదాయకం!

పరభాషలను ఎలా నేర్చుకోవాలన్నదే కీలక సమస్య

ప్రపంచ పర్యావరణ సంక్షుభిత సందర్భంలో భాష-పర్యావరణాల పరస్పరపూరక స్వభావాన్ని గుర్తించకుండా, 'ఎదగడానికి ఇంగ్లీషే రాచబాట' (సాక్షి ఏప్రిల్ 24) అనే వ్యాసంలో – ఇంగ్లీషు భాష సామాన్య ప్రజలందరి భాషగా మారి, దాని ద్వారా జాతీయ స్థాయి సంబంధాల్లోకి వెనకబడిన వర్గాలు రాగలిగితేనే ఎదుగగలరని కంచ ఐలయ్యగారు రాశారు. అందుకు ఇంగ్లీషు భాష ఎన్నికల అంశంగా తప్పక మారి తీరాలని ఆయన రాజకీయ పక్షాలను డిమాండ్ చేశారు... ఇంగ్లీషు భాష, నుడికారం, కార్పొరేట్, మార్కెటింగ్, ఉత్పత్తి 5 కార్యకలాపాలు, సాఫ్ట్‌వేర్ సాంకేతికతల వినియోగంలో ధ్వంసమవుతోందని ఆంగ్లభాషా శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో దళిత, బహుజన వర్గాలు ఏ ఆంగ్ల భాషను నేర్చుకోవాలని ఐలయ్య డిమాండ్ చేస్తున్నట్లు!...భారతీయ మాతృభాషలు ప్రధానంగా అణగారిన కులాలు, వృత్తుల ప్రజానీకానివే. అలాంటిది వారి సామాజికార్థిక స్థితితో, అభివృద్ధి క్రమంతో సంబంధం లేకుండా ఆంగ్లాన్ని నేర్చుకోవాలని ప్రోత్సహిస్తూ ఐలయ్యగారు పిలుపు ఇవ్వడం ఆ ప్రజలకు చెడుపు చేస్తుంది... భాష (ఇంగ్లీషు) నేర్చుకోవడం వల్ల బహుజన ప్రజానీకం వారంతట వారే అభివృద్ధి చెందుతారనే ఐలయ్య వాదన – ఆ ప్రజానీకాన్ని తప్పుదారి పట్టిస్తోంది. ఈనాడు ప్రపంచమంతా స్థానిక భాషలు, స్థానిక సంస్కృతుల పునరుద్ధరణలోనే అభివృద్ధి ఉందనే ఎరుకతో ఆ వైపుగా అడుగులు వేస్తున్న విషయాన్ని ఆయన గుర్తించినట్లు లేదు.

'యుగ సంక్షోభం' (సామాజిక – ఆర్థిక, పర్యావరణ సంక్షోభాలు) లో కూరుకుపోయిన తరుణంలో అంతర్జాతీయ సమాజం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న జరుపుకునే మాతృభాషా దినోత్సవాన్ని ఈసారి అంతర్జాతీయ దేశీయ భాషల దినంగా జరుపుకోవడం విశేషం. పర్యావరణ పరిరక్షణలో దేశీయ భాషల అవసరాన్ని బలంగా గుర్తించింది. ప్రకృతి-సమాజాల మధ్య ఆదాన ప్రదాన క్రమానికి గండి పడి, అకస్మిక, పునరుద్ధరణకు వీలుకాని స్థితికి వాతావరణ మార్పులు చేరుకుంటున్న రూపంలో ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పు నుంచి బయటపడాలంటే దేశీయ భాషలు 'మాధ్యమం' (మీడియం)గా, సాధనంగా ఉపకరిస్తాయన్న విషయం అంతర్జాతీయ సమాజానికి క్రమంగా అనుభూతమవుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి మాతృభాషా దినోత్సవాన్ని 'దేశీయ భాషలతోనే అభివృద్ధి, శాంతిస్థాపన, సయోధ్య వంటివి సుసాధ్యం' అనే ఇతి వృత్తంతో, భాష-పర్యావరణం మధ్యగల పరస్పర ఆధారితను, పరస్పర పూరకత్వాన్ని సాధించే లక్ష్యంతో జరుపుకున్నారు. వాతావరణ మార్పును వేగవంతం చేసి, మానవజాతి మనుగడను ప్రశ్నార్థకంగా మార్చే పర్యావరణ విధ్వంసాన్ని యుద్ధ ప్రాతిపదికపై అరికట్టడంకోసం మాతృభాషలనే కాకుండా, అంతకు మించి స్థానిక, మూలవాసీల భాషలను అనివార్యంగా పరిరక్షించుకోవలసిన తరుణమిదని ప్రపంచ మేధావులు, భాషా – పర్యావరణ నిపుణులు వివిధ అధ్యయనాలు, పరిశోధనల ద్వారా గత కొంతకాలంగా హెచ్చరిస్తూనే ఉన్నారు. జాతి, మత – కుల, ప్రాంత, జెండర్ తదితర అస్తిత్వాల అణచివేతలు, ఆధిపత్యాలు, అసమానతలు, వివక్షలతో సంబంధం లేకుండా మాతృభాషలు – స్థానిక భాషల పరిరక్షణ చేపట్టాలని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సమాజానికి పిలుపు నిచ్చింది. ఇలాంటి చారిత్రక సంక్షుభితకాలంలో పాలకులైనా, పాలిత ప్రజలు, పాలిత అస్తిత్వాలైనా (మత(కుల), జాతి, ప్రాంత, భాష తదితర) మాతృభాషలు, స్థానిక-మూల భాషల పరిరక్షణను ఉమ్మడిగా చేపట్టవలసి ఉంది. తద్వారా అందులో ఆ భాషల్లో నిక్షిప్తమైన స్థానిక విజ్ఞానాన్ని వినియోగించుకొని స్థానిక ప్రజలు, మూల వాసుల చొరవతో పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టే అవకాశ ముంటుందని పర్యా వరణ శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రపంచ పర్యావరణ సంక్షుభిత సందర్భంలో భాష-పర్యావరణాల పరస్పర పూరక స్వభావాన్ని గుర్తించకుండా 'ఎదగడానికి ఇంగ్లీషే రాచబాట' అనే వ్యాసంలో ఇంగ్లీషు భాష ఎన్నికల అంశంగా మారితే తప్ప, సామాన్య ప్రజలందరి భాషగా ఇంగ్లీషు మారితేనే...వెనకబడిన వర్గాలు జాతీయ స్థాయి సంబంధాల్లోకి రాగలరని, అలా వారి ఎదుగుదల ఇంగ్లీషు ద్వారానే సాధ్యమవుతుందని కంచ ఐలయ్యగారు రాయడం దురదృష్టకరం.

ముడిసరుకులు, చౌక శ్రమశక్తి, సరుకుల మార్కెట్లు గల ప్రాంతాలను, రాజ్యాలను ఆంగ్లేయులు వలసలుగా మార్చుకున్నారు. వాటి నియంత్రణ కోసం వలసేకరణ ద్వారా తమను పోలిన ప్రపంచాన్ని సృష్టించుకొని అక్కడి స్థానిక నాగరికతల విధ్వంసానికి పాల్పడ్డారు. తమలాగే ఆలోచించే, ప్రవర్తించే, సంభాషించే, అనుభూతి పొందగలిగే కులీన సమూహాన్ని సృష్టించి వారి ద్వారా వలస పాలనను సమర్థంగా సాగించారు. ఆ క్రమంలో ఆంగ్లేయుల ఇంగ్లీషు భాషను, క్రైస్తవ మతాన్ని శక్తిమంతంగా వినియోగిస్తూ ప్రపంచవ్యాప్తంగా బ్రిటిష్ సామ్రాజ్యాన్ని విస్తరింపచేయడం తెలిసిందే.

మెకాలే విద్యా విధానమంటే తమలాగే ఆలోచించి, ప్రవర్తించే, బ్రిటీష్ రాణి ప్రయోజనాలను కాపాడే సంకల్పం గల కులీన వలస ప్రజలను (విభజించి పాలించే క్రమంలో అగ్రవర్ణాలు, వృత్తేతర బడుగు, బలహీన, అస్పృశ్య సమూహాల నుంచి) సృష్టించి, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని సుస్థిర పరచుకోవడమే. ఈ క్రమంలో కేవలం 5శతాబ్దంలో (ఇప్పటికీ 1400 ఏళ్ల క్రితం) పశ్చిమ జర్మనీకి చెందిన (ఆ దేశ ఉత్తర సముద్ర తీరంలో నివసించే 'ఇంగేవోన్స్' అనే తెగ (ప్రజలు) ఆంగ్లో శాక్సన్ వలస జనం మాట్లాడే ఆంగ్ల భాషను వలస ప్రాంతాల్లో పాలన భాషగా వినియోగించారు. అందుకోసం క్రీస్తుపూర్వం నాటి నుంచి కొనసాగుతున్న స్థానిక భాషాజాతీయుల సంస్కృతి, నుడి-నానుడి, సంప్రదాయాలను కాలరాచేందుకు విఫల ప్రయత్నం చేశారన్నది చరిత్ర. స్థానిక మత విశ్వాసాలు, ఆచారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలతో ఇబ్బందిపడుతున్న, అణచివేతకు గురయిన బడుగు బలహీన ప్రజలను మత, భాష, వ్యవహార శైలితో ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ చర్య వెనుక కుట్ర కోణం ఏమైనప్పటికీ, తమకు లాభం జరిగింది / జరుగుతోందన్న ఒకే ఒక కారణంగా స్థానిక బహుజనులు ఆంగీకరణను, మతాంతీకరణను అంది పుచ్చుకోవడాన్ని అర్థం చేసుకోగలం. స్థానికభాషలు, మూలవాసుల భాషలు, పాలకుల భాషలుగా పరిగణించేవి సైతం ప్రజలే సృష్టించారన్న సంగతి ఐలయ్యగారు గుర్తించకపోవడం దురదృష్టకరం. పెట్టుబడిదారీ పూర్వ సమాజాల్లో ప్రపంచవ్యాప్తంగా ఏ రాజ్యంలోనైనా పాలకుల భాష, ప్రజల భాష వేర్వేరుగా ఉండడం సర్వసాధారణ విషయం. వలసల సంపద సమీకరణ నుంచి ఇంగ్లాండ్‌లో పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించేంత వరకు, అక్కడా రెండు భాషా విధానాలు కొనసాగేవి. 15వ శతాబ్దం దాకా దాదాపు 600 ఏళ్ల పాటు ఇంగ్లాండ్లో అధికార భాషగా ఫ్రెంచ్ భాష కొనసాగడం విడ్డూరమేమీ కాదు. ఇంగ్లాండ్‌లో పెట్టుబడిదారీ విధానం ఆవిర్భ వించిన అనంతరమే మార్కెట్‌లోను, రాజ్య నిర్వహణలోనూ 'ఇంగ్లీష్' (అక్కడి ప్రజల భాష అయిన ఇంగ్లీష్) అధికార భాషగా అవతరిం చింది. ఆ తర్వాత వలస పాలనా క్రమంలో విశ్వభాషగా అవతరిం చింది. పెట్టుబడిదారీ వర్గం ముడి సరుకులు, చౌక శ్రమ శక్తి, సరుకుల మార్కెట్లో నిర్వహణ అవసరాలు, అంతర్జాతీయ ముక్కోణ వాణిజ్యం, అందుకు ఉపకరించే పాలనా అవసరాల నేపథ్యంలో ఇంగ్లీష్ విశ్వభాషగా అవతరించింది. వలసలు, వలసవాద దేశాల సంపదల సమీకరణతో ప్రపంచ, పెట్టుబడిదారీ విధానం ఆవిర్భ వించకుండా ఇంగ్లీష్ భాష విశ్వజనీనతను సాధించడం సాధ్యం కాదన్న విషయాన్ని ఐలయ్యగారు గుర్తించకుండా, 'ఆంగ్ల ఆరాధనను' అహేతుకంగా ప్రోత్సహిస్తున్నారు. ముడి సరుకులు, చౌక శ్రమ శక్తి, సరుకుల మార్కెట్లుగా ఉంటూ, పెట్టుబడిదారీ పూర్వ సామాజిక స్వభావాన్ని కోల్పోని ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లోని స్థానిక భాషలు, పెట్టుబడిదారీ విధానంలోకి అభివృద్ధి పాశ్చాత్య దేశాల భాషల వలె పరిపక్వతను, విశ్వజనీనతను సాధించలేక పోయాయి. ఆంగ్లేశాక్సన్ ప్రజలు మాట్లాడే ఆంగ్ల భాష పాలక భాషగా మారి, శతాబ్దాల కాలంనాటి స్థానిక భాషలను విధ్వంసం చేయడానికి కారణం ఆ ప్రజల సామాజిక ఆర్థిక స్వభావంలో ఉందిగానీ, వారి భాషాధిపత్య కాంక్షలో లేదనే విషయాన్ని ఐలయ్యగారు గుర్తించ లేదు. **ఇంగ్లీషు (రాజబాటలో ప్రయాణించడం) వల్ల ఆంగ్లేయులు ఎదగలేదు, వారి సామాజిక ఆర్థిక వికాసం వల్లనే ఇంగ్లీషు భాష విశ్వజనీనత సాధించిందనే సత్యాన్ని అయన గుర్తించలేదు.** అలాంటిది బడుగు, బలహీనవర్గ ప్రజానీకం ఇంగ్లీషును అందిపుచ్చుకోవడం వల్లనే అభివృద్ధి చెందుతారు (ఎదుగుతారు) అనే తలకిందులు వాదన ఐలయ్య తీసుకువస్తుండడం వల్ల ఆ ప్రజలకు హాని కలుగుతుంది.


మెకాలే విద్యావిధానం (1885) ఫలితంగా ఇంగ్లీషులో పట్టు సాధించిన మహాత్మా పూలే, అంబేద్కర్ వంటివారు ఇంగ్లీషు వల్లనే గొప్ప వారయ్యారనే ఐలయ్య సులభ సూత్రీకరణలు ఆ మహాత్ముల జీవితం, కృషి, తాత్వికతను కించపరుస్తున్నాయి. వారు స్థానిక భాషల్లోను, స్థానిక సామాజికాంశాల్లోను పట్టు సాధించడంతోనే, పరభాష అయిన ఇంగ్లీషుతో వారు సమర్థంగా వ్యవహరించ గలిగారన్నది ఒక వాస్తవం. ఈ నే పథ్యంలో ఇంగ్లీషు భాషను నేర్చుకోవడం వల్ల సామాజికార్థిక వెసలుబాటు ఉన్న పూలే, అంబేద్కర్ వంటి కొద్ది మంది బహుజనులు మాత్రమే ఉన్నత స్థాయికి పోగలిగారు. కానీ మెజారిటీ ప్రజలు ఇంగ్లీషును సవ్యంగా నేర్చుకోలేక రెండింటికీ చెడ్డ రేవడులుగా మారి, ఆత్మ విధ్వంసానికి గురవుతారు. అందువల్ల సరైన అవకాశాలు, మౌలిక సదుపాయాలు, తగిన వసతులు లేని విద్యా సంస్థలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ఆత్మహత్యాసదృశం. పాలకులు చేపడుతున్న ఆంగ్ల విద్యాబోధన విధాన నిర్ణయం అభివృద్ధి కరమైనదిగా కనపడుతుంది గానీ, అందుకు తగిన సామాజిక పరిస్థితులు, విద్యారంగ అవకాశాలు, విధానాలు లేకుండా అలాంటి చర్యలు చేపడితే అరకొరగా ఉన్న విద్యా రంగం కొడిగడుతుంది. మాతృభాషలను ఇంగ్లీషులాగా ఆదానప్రదానాలను చేపడుతూ విశ్వజనీన స్థాయికి వెళితే, యావత్తు సాధారణ ప్రజానీకానికి పూర్తి స్థాయిలో ఈ లబ్ది చేకూరుతుంది. పూలే,అంబేద్కర్ వంటి మహనీయులు మాతృభాషలను విశ్వజనీన స్థాయికి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేసి ఉండాల్సింది. కార్పొరేట్ ప్రపంచం ఇంగ్లీషు భాష, నుడికారం కార్పొరేట్ మార్కెటింగ్, ఉత్పత్తి కార్యకలాపాలు, సాఫ్ట్‌వేర్ సాంకేతికతల వినియోగానికి సరిపడే ఆంగ్ల విద్య కారణంగా ధ్వంసమవుతోందని ఆంగ్లభాషా శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో దళిత, బహుజన వర్గాలు ఏ ఆంగ్ల భాషను నేర్చుకోవాలని ఐలయ్య డిమాండ్ చేస్తున్నట్లు!

భాషా నిత్యత్వ నియమం:

ప్రతి భాష ఏకశిలాసదృశం కాదు. ప్రజలు దైనందిన ఉత్పత్తి, సామాజిక కార్యకలాపాల అనుసంధాన క్రమంలో రూపొందే 'సహజ' భాష నిర్దిష్ట భౌగోళిక సమాజం-ప్రకృతి సమతుల్యతకు అనుగుణంగా జరిగే ఆత్మిక అభివృద్ధి (వైజ్ఞానిక, సామాజిక శాస్త్రాలు, కళలు, సాహిత్యం, తత్వశాస్త్రం, రాజకీయాలు, రాజ్యాంగం తదితర) లో భాగంగా ఆయా రంగాలకు చెందిన కృత్రిమ భాషలు (నిర్దిష్ట సాంకేతిక పరిభాషలు) కలసి ఒక సామాజిక వ్యవస్థలోని భాషగా

ఓట్లు అడిగేది తెలుగులో...పరిపాలించేది ఉత్వర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?

ఏర్పడుతుంది. సామాజిక భాష సహజ భాష కృత్రిమ భాష. వివిధ వైజ్ఞానిక రంగాల్లోనూ, కళలు, సాహిత్యం, సంస్కృతి వగైరా ఆత్మిక రంగాల్లో ప్రత్యేకమైన పదజాలం, పరిభాషా పదజాలాన్ని కృత్రిమ భాషగా పరిగణించాలి. సహజ, కృత్రిమ భాషలు పరస్పర పూరకాలు, సహజ భాషల నుంచి కృత్రిమ భాషలు ఆవిర్భవించినప్పటికీ, కృత్రిమ భాషల కారణంగా సహజ భాషలు మరింత పరిపుష్టమవుతాయి. తామున్న పరిసరాలు, పర్యావరణం పునాదిగా సహజ భాషలు ఆవిర్భవిస్తే, ప్రజలు ప్రకృతిని మానవీకరించే క్రమంలో, ఉత్పత్తి కార్యకలాపాల వైవిధ్యతల, సంక్లిష్టతల క్రమాల్లో నుంచి సహజ భాషలు, కృత్రిమ భాషలు అభివృద్ధి చెందుతాయి. అందువల్ల సహజ భాషలను మాత్రమే (వ్యవహారిక భాషలను) ప్రజల భాషలుగా గుర్తిస్తూ, కృత్రిమ భాషలను పాలక వర్గాల భాషలుగా గుర్తిం చడం పొరపాటు. స హజ-కృత్రిమ భాషల అభివృద్ధికి అటు శారీరక శ్రమ చేసేవారు, ఇటు మేధా శ్రామికులు ఇద్దరూ కలసి కృషి చేస్తారు. గణితంలోని పరిభాష సాధారణ ప్రజలకు అర్థం కానంత మాత్రాన దాని అభివృద్ధిలో సాధారణ ప్రజల పాత్ర లేకపోలేదు. గణితం, అందులోని పరిభాష సాధారణ ప్రజల సొంతం కాకపోలేదు. అదే విధంగా ఆనాటి సమాజ ఆత్మిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన రంగాల అవసరాల నుంచి కృత్రిమ భాష సంస్కృతం ఆవిర్భవించింది. అది సహజ భాషల నుంచి ఆవిర్భవించి ఆనాటి వైజ్ఞానిక, సామాజిక శాస్త్రాల పరిభాషకు ప్రాతినిధ్యం వహిస్తూ జ్ఞానాభి వృద్ధికి దోహదం చేయడాన్ని కాదనడం అర్థరాహిత్యం మాత్రమే . సహజ భాషలైన పాళీ, ద్రవిడ భాషలు ప్రజల జీవిత కార్యకలాపాల నుంచి ఎలా అభివృద్ధి చెందాయో, అదే విధంగా కృత్రిమ భాషగా సంస్కృతం అభివృద్ధి చెందడమూ అంతే సహజం. ఇప్పటికీ ప్రపంచ భాషల్లో అత్యంత భాషా శాస్త్ర ప్రామాణికతను సంతరించుకున్నది సంస్కృతమేనని ప్రముఖ భాషా శాస్త్ర నిపుణులు నోమ్ చోమ్స్కీ పలు సందర్భాల్లో వివరించారు. పాలకులు సృష్టించిన లేదా ఇతరులపై రుద్దేందుకు ప్రయత్నించిన, వారి ప్రయోజనాలను నెరవేర్చిన భాష లను పాలక భాషలుగా పరిగణించడం కద్దు. పర్షియన్, ఇంగ్లీషులు వారి ప్రాంతాల్లో ప్రజల భాషలే. సంస్కృతం పాలక భాష కంటే భారత సమాజ ఆత్మిక జీవన రంగాల నుంచి ఆవిర్భవించిన కృత్రిమ భాష. అంతేకానీ, ఫలానా ప్రజలను అణచేందుకు ఉద్దేశించిన భాషగా దాన్ని పరిగణించడం అమాయకత్వమే అవుతుంది. అదీకాక, స్థానిక భాషల నుంచి, మరీ ముఖ్యంగా వ్యవసాయం, చేతివృత్తులు తదితర ఉత్పత్తి రంగాలలో జరుగుతున్న అభివృద్ధి నుంచి ఆయా ప్రాంతీయ ప్రజల దైనందిన వ్యవహారాల నుంచి పుట్టకొస్తున్న పదజాలంతో సంస్కృతం ఆవిర్భవించింది. ఆ స్థానిక భాషలు లేకుండా సంస్కృతం లేదు. అదే సమయంలో వైజ్ఞానిక, సామాజిక శాస్త్రాల పరిభాషగా సంస్కృత భాష మాధ్యమంలో పుట్టుకొస్తున్న కృత్రిమ భాషాజాలం తిరిగి స్థానిక భాషలను క్రియాశీలంగా ప్రభావితం చేస్తుంది. **ఇంగ్లీషు కూడా ఆంగ్లోశాక్సన్ల భాష పునాదిగా, ఫ్రెంచ్, గ్రీక్, రోమన్ తదితర యూరోపియన్ భాషల నుంచి కీలకంగాను, వలస ప్రాంతాల్లోని**



స్థానిక భాషల నుంచి పాక్షికంగానూ అభివృద్ధి చెందిందనేది విదితమే. ఈ నేపథ్యంలో ప్రతి భాషా నిర్దిష్ట సమాజ చారిత్రక అవసరాలనుంచి పుడుతుంది, గిడుతుంది. అంతేగానీ సామాజిక ఆర్థికాభివృద్ధి క్రమంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా తనకు తానుగా ఏ భాషా పుట్టదు, గిట్టదు.

ఒక భాషాజాతీయుల సొంత భాషను వారి సామాజి కార్థిభివృద్ధితో నిమిత్తం లేకుండా ధ్వంసం చేసి పరభాషను చొప్పిం చడం సాధ్యం కాదు. అయితే ఒక సామాజిక వ్యవస్థకు చెందిన భాషలోని సహజ భాష మాత్రమే మిగిలి, ఆ సమాజానికి చెందిన కృత్రిమ భాష నశిస్తే, కొంతకాలానికి దాని సహజ భాష కూడా అంతరించిపోగలదు. ప్రస్తుత భాషోద్యమకారులు డిమాండ్ చేస్తున్నట్లు కేవలం సహజ భాష మాత్రమే కొనసాగితే చాలని తృప్తి పడటం అమాయకత్వమే అవుతుంది. ఇంగ్లీష్ దాడికి (ఆ భాష చేసే దాడి కాదు. ఆ (పీడిత/ పీడక భాషాజాతీయుల్లోని పాలకుల విధానంగా మాత్రమే అర్థం చేసుకోవాలి) స్థానిక కృత్రిమ భాష మృగ్యమై, కేవలం సహజ భాషగా కొనసాగుతున్న తెలుగు భాష కొడిగడుతున్న దీపంలా రెపరెపలాడుతోంది. సహజ, కృత్రిమ భాషలు రెండూ ప్రజలకు సొంతమే. ముఖ్యంగా వ్యవసాయం, చేతివృత్తుల్లో జీవిస్తున్న సువిశాల బడుగు, బలహీన వర్గాల ప్రజానీకానికి చెందినవి. ఈ నేపథ్యంలో భారతీయ మాతృభాషలు-ప్రధానంగా అణగారిన కులాలు, కుల వృత్తుల ప్రజానీకానివే. అలాంటిది వారి సామాజికార్థిక స్థితితో, అభివృద్ధి క్రమంతో సంబంధం లేకుండా ఐలయ్యగారు విశ్వ భాష ఆంగ్లాన్ని నేర్చుకోవాలని ప్రోత్సహించడం ఆ ప్రజ లకు చెడుపు చేస్తుంది. ఇంగ్లీషును నేర్చుకోవడం వల్లనే పూలే, అంబేద్కర్లు అభివృద్ధి

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే

చెందారని చెప్పడం తప్పు. సంప్రదాయక వ్యవసాయ శ్రమ సంబంధాల రూపంలోని కులవృత్తులకు దూరమైన చిరు వ్యాపార వర్గ సామాజిక నేపథ్యం గల మహాత్మా పూలే, అలాగే రాజవంశీయుల సాన్నిహిత్యంలో ఉన్న సైనిక కుటుంబ నేపథ్యంగల అంబేడ్కర్ తదితర వృత్తేతర కుటుంబ సాంస్కృతిక నేపథ్యం నుంచి విద్యావంతులుగా ఎదిగి వచ్చిన వారిని చూపించి, దళితులందరూ (వ్యవసాయ శ్రమ సంబంధాల్లో ఉన్నవారు) వారిలాగే ఇంగ్లీషు నేర్చుకుంటే జీవితంలో ఎదుగుతారు అని ఐలయ్య సూచించడం దురదృష్టకరం. **సామాజికంగా, ఆర్థికంగా ఈ అభివృద్ధి చెందుతున్న ప్రజానీకం తమ విజయాలను సుస్థిరం చేసుకునేందుకు సాధనంగా భాష ఉపకరిస్తుందే గానీ, ఫలానా భాష నేర్చుకోవడం వల్లనే అభివృద్ధి దానికదే సాకారం కాదు.**

20వ శతాబ్దం ఆరంభం నాటి కల్లా ప్రపంచ, పెట్టుబడిదారీ విధానం మరింత ఉన్నతస్థాయికి చేరుకుని, సంక్లిష్టంగా మారింది. అది ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజాల నిర్దిష్ట కార్యకలాపాల అనుభవాల నుంచి ఆవిర్భవించి వైవిధ్య భరిత వైజ్ఞానిక సంపదను, నైపుణ్యాలను నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేసి పాశ్చాత్య సంస్కృతి (ఉత్పత్తి విధానాలు, నైపుణ్యాలు, సరకుల వినియోగం, వైజ్ఞానిక సంప్రదాయాలు వగైరా) ని ప్రవేశ పెట్టింది. దాంతో స్థానిక విజ్ఞానాన్ని నిక్షిప్తం చేసిన కృత్రిమ భాషా సంపద అభివృద్ధి క్రమానికి గండి పడింది. స్థానిక పర్యావరణ అనుభవాల సారంగా వెలువడుతున్న వైజ్ఞానికాభివృద్ధి పక్కదారి పట్టింది. పాశ్చాత్య ఉత్పత్తి విధానాలు, నైపుణ్యాలు, యంత్ర సంస్కృతులే ప్రజా జీవనానికి ఏకైక ప్రత్యామ్నాయంగా నిలవడంతో, సంబంధిత కృత్రిమ భాషను ఇతర ప్రాంత ప్రజలు సైతం ఆకళింపు చేసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

దాంతో ఇంగ్లీషు వలసల్లో కృత్రిమ భాషగా, ఉపాధి భాషగా ఆంగ్లాన్ని నేర్చుకోవడం తప్పనిసరి అయింది స్థానిక ప్రజల ఉత్పత్తి కార్యకలాపాల అనుభవాల సారంగా అభివృద్ధి చెందుతూ వచ్చిన స్థానిక కృత్రిమ భాష అభివృద్ధి స్తంభించింది. ఆ కారణంగా స్థానిక విజ్ఞానాభివృద్ధి నిలిచిపోవడమే కాకుండా ధ్వంసమవుతుండడం దురదృష్టకరం. పెట్టుబడిదారీ విధానం ప్రపంచీకరణ క్రమం ద్వారా సంఘటితమవుతున్న కొద్దీ, స్థానిక విజ్ఞానాన్ని నిక్షిప్తం చేసుకున్న స్థానిక కృత్రిమ భాషలు పూర్తిగా అంతర్ధానమవుతాయి. దాంతో కృత్రిమ కాషాభివృద్ధి క్రమానికి సమాంతరంగా అభివృద్ధి చెందుతున్న సహజ భాషలు క్రమంగా సారహీనంగా, సమకాలీన అవసరాలు తీర్చలేని విధంగా మారతాయి. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే సదరు భాషలు అంతరించి పోవడమో, సమాజంలో ఏదో ఒక మూల ప్రాభవాన్ని, జీవాన్ని కోల్పోయి ఒక శిలాజంగా, మృత భాషగా మిగలడమో జరుగుతుంది. పర్యవసానంగా భూగోళంపై ఆ భాషా జాతి అస్తిత్వం అంతరిస్తుంది. ప్రస్తుతం తెలుగు భాషలో కృత్రిమ భాషాభివృద్ధి కుంటుపడి, దాని ప్రతికూల ప్రభావం సహజ భాషపై తీవ్రంగా ఉండడం గుర్తించగలం. స్థానిక సహజ, కృత్రిమ భాషల్లో నిక్షిప్తమై ఉన్న స్థానిక ప్రజల అనుభవం, విజ్ఞాన సంపదలను విశ్వజనీన స్థాయికి తీసుకువెళ్ళే విశ్వమానవ భాష రూపొందే క్రమం సదరు భాషాజాతి అస్తిత్వ సమానత్వ ప్రాతిపదికన పరిఢవిల్లుతుంది. అలా గాక స్థానిక భాషలను ధ్వంసం చేస్తూ, ఆ భాషకు ప్రత్యామ్నాయంగా పరాయి భాషను స్వీకరించడం సాధ్యమూ కాదు, అణగారిన అస్తిత్వాలకు ఆత్మహత్యాసదృశ్యంగా మారుతుంది.

స్వపక్ష ప్రయోజనాలకు గండి:

భాష (ఇంగ్లీషు) నేర్చుకోవడం వల్ల బహుజన ప్రజానీకం వారంతట వారే అభివృద్ధి చెందుతారనే ఐలయ్య వాదన – ఆ ప్రజానీకాన్ని తప్పుదారి పట్టిస్తోంది. ఈనాడు ప్రపంచమంతా స్థానిక భాషలు, స్థానిక సంస్కృతుల పునరుద్ధరణతోనే అభివృద్ధిలో ఉన్నట్లు గుర్తించి ఆ వైపు అడుగులు వేస్తున్న విషయాన్ని ఆయన గుర్తించినట్లు లేదు. గూగుల్, ఇంటర్నెట్ వంటి అత్యాధునిక సాంకేతికతలు నేడు తెలుగు సహా అనేక స్థానిక భాషల్లో విజ్ఞానాన్ని నిక్షిప్తంచేసేందుకు, సేకరించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇంగ్లీషు మాధ్యమాన్ని, భాషను ప్రాథమిక విద్య నుంచి ప్రవేశపెట్టాలనే ఎన్నికల హామీలను గుప్పిస్తూ, అలాంటి ప్రయత్నాలను అరకొరగా ప్రారంభిస్తున్న రెండు రాష్ట్రాల పాలకులను, అధికార, ప్రతిపక్షాలను ఒప్పించడంలో ఐలయ్య కృత కృత్యులయ్యారు. **కులం, మతం అస్తిత్వ కోణాల నుంచి భాషా సమ స్యను, విధానాన్ని ముందుకుతెస్తున్న ఐలయ్య వాదన ఆ ప్రజానీకానికి తీవ్ర నష్టం కలిగిస్తుందనడంలో సందేహంలేదు.** ఇంగ్లీషు భాషను నేర్చు కోవడం, వ్యవహర్తలుగా శిక్షణ పొందడాన్ని ఎవరూ వ్యతి రేకించవలసిన అవసరం లేదు. అయితే దాన్ని ఏ పద్ధతిలో సాధిం చాలనడంలోనే పేచీ ఉంది. ప్రజల అవసరాలను, ఎరుగమిని సొమ్ము చేసుకుంటున్న కార్పొరేట్/విద్యాపార సంస్థల స్వార్థానికి వాస్తవ గణాంకాలపై కాక, నమ్మకాలు, ఉద్వేగాలపై ఆధారపడి రూపొందుతున్న (రూపొందిస్తున్న) ప్రజాభిప్రాయాన్ని తమ స్వార్థ ప్రయోజ నలకు వినియోగించుకునే పోస్ట్ ట్రూత్ (సత్యానంతర) రాజకీయ నాయకులు, పార్టీలు ఇంగ్లీషు విద్యను ఎన్నికల ఎజెండాగా ముందుకు తీసుకువస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను, దాన్ని పటిష్టం చేసి లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్న ఈ దేశ కార్పొరేట్ శక్తులు, వారికి అనుకూలమైన విధానాలు రూపొందించే రాజకీయ శక్తుల కారణంగానే బడుగుల బతుకుల తో రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతున్నాయి. ఎక్కడ పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలి గానీ, భాష (ఇంగ్లీషు విద్యను పొందడం) ద్వారా అభివృద్ధి దానికదే సాకారమవుతుందనే ఐలయ్య వాదన బడుగు బలహీన వర్గాల విముక్తి వీక్షణాన్ని మసకబారుస్తుంది.

భాష లేకపోతే భావం లేదు
నీ భావాల్ని నీ భాషలో
చెప్పడమే సరైనది

'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' ముందడుగు

తెలుగుకు ప్రాచీన భాష హోదా ప్రభుత్వం వైపు నుండి లభించిన తర్వాత – కారణాలు ఏమి ఉన్నా, తర్వాత జరగాల్సిన పనులేవీ సాగకుండా నిలిచిపోయిన సంగతి తెలుగు ప్రజానీకాన్ని వ్యాకుల పరచుతున్నది. కేంద్రాన్ని మైసూరులోని భారతీయ భాషల సంస్థ ప్రాంగణంలోనే నెలకొల్పి పని సాగించనున్న సందర్భంలో – దానిని నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే స్థాపించాలనే బలమైన వత్తిడి రావడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. కాని అప్పటి సమైక్య రాష్ట్రంలోనూ, ఆ తర్వాత రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత గడచిపోయిన అయిదేళ్ళలోనూ అదే పట్టని తనంతో పాలకులు వ్యవహరించడంతో కేంద్ర నిధులు మురిగిపోయే పరిస్థితుల్లో – ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని మైసూరులోనే కొలకొల్పి కొన్ని పనులు చేపట్టడం జరుగుతున్నది. ప్రాజెక్టు డైరెక్టరుగా ఆచార్య డి. మునిరత్నం నాయుడుగారిని ఇటీవల నియమించడంతో పనుల్లో కదలిక వచ్చింది. ఆ తర్వాత ఇప్పటి వరకు జరిగిన పురోగతిని గురించి 'అమ్మనుడి' పాఠకుల కోసం తెలియజేయాలని కోరగా, వచ్చిన నివేదికను క్రింద ప్రచురిస్తున్నాము – సంపాదకుడు.

భారతీయ భాషాసంస్థ, మానసగంగోత్రి మైసూరువారు పత్రికా ప్రకటన ద్వారా ఔత్సాహికులైన అభ్యర్థుల నుంచి దరాఖాస్తులు ఆహ్వానించి ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో పనిచేయడానికి ముగ్గురు సీనియర్ ఫెలోస్, నలుగురు అసోసియేట్ ఫెలోస్ ఒక ప్రాజెక్టు డైరెక్టర్, ఇద్దరు దిగువస్థాయి కార్యాలయ సిబ్బందిని నియమించడమైంది. 2018 నవంబర్ 28 తేదీన సదరు సిబ్బంది తమ విధులలో చేరారు. అప్పటి నుండి ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం పనులను ప్రారంభించడమైంది.

మార్గనిర్దేశక కార్యగోష్ఠి:

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం స్వల్ప వ్యవధిలోనే అంటే 2018 డిసెంబర్ 26 నుండి 28 వరకు మూడురోజులపాటు మైసూరులో భారతీయ భాషా సంస్థలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం 'మార్గనిర్దేశక కార్యగోష్ఠి' ఉభయ తెలుగు రాష్ట్రాల లోని, సరిహద్దు రాష్ట్రాలలోని 28మంది విషయనిపుణులను ఆహ్వానించి నిర్వహించడమైంది. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం తెలుగుభాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతులలో, చేపట్టవలసిన కార్యక్రమాలను, ప్రణాళికలను ఈ కార్యగోష్ఠిలో ప్రతిపాదించడ మైంది. దీనికి సంబంధించిన ప్రతిని దీనితోపాటు జతచేయడమైంది. ఇందులో కేంద్రంలోని విద్యాత్మక సిబ్బంది ప్రాచీన తెలుగు భాషకు సంబంధించిన ఒక సంవత్సర వ్యవధితో ఏడుగురికి ఏడు ప్రాజెక్టులను అప్పగించడమైనది. ఆ మేరకు సదరు సిబ్బంది తమతమ ప్రాజెక్టులను ప్రారంభించడం జరిగింది.

మనసు ఫౌండేషన్ సందర్శన:

2019 జనవరి 12, 13 తేదీలలో శ్రీ రాయుడుగారు నెల్లూరు జిల్లా ఉదయగిరి సమీపంలోని వరికుంటపాడులో నిర్వహిస్తున్న మనసు ఫౌండేషన్ కార్యాలయాన్ని వారి ఆహ్వానం మేరకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు, మైసూరు విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య ఆర్వీయస్. సుందరం గారితో కలిసి సందర్శించడం జరిగింది. మనసు ఫౌండేషన్ సంస్థ శ్రీ రాయుడు గారు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సాహితీ సంస్థ. వారు తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన ప్రాచీనకాలం నుండి ఇటీవలి కాలం వరకు వెలువడిన గ్రంథాలను సేకరించి డిజిటలైజ్ చేసి వారి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వారు ఇప్పటివరకు 50వేల పుస్తకాలను, ప్రాచీన తెలుగు పత్రికలకు సంబంధించి 15 లక్షల పుటలను స్కానింగ్ చేసి డిజిటలైజ్ చేశారు. వారు చేసిన కృషి చాలా విలువైనది. వారితో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యనయ కేంద్రం ఒప్పందం కుదుర్చుకొని ముఖ్యమైన సమాచారాన్నంతా కేంద్రం వెబ్‌సైట్‌లోకి తెచ్చుకుంటే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

హైదరాబాద్‌లో జాతీయ సదస్సు:

2019 జనవరి 28, 29 తేదీలలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, భారతీయ భాషా సంస్థ మరియు ఉస్మానియా విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర విభాగం, తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక హైదరాబాద్ సంయుక్తంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా భారతీయ భాషా సంస్థ సంచాలకులు ఆచార్య డి. జి. రావు, ప్రాచీన భాషల శాఖాధిపతి ఆచార్య ఫెర్నాండేజ్ మరియు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా పరిశోధకులు, ఆచార్యులు మొత్తం 42 మంది పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించారు. ఇందులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నుండి డా. ఎన్. రాంబాబు, డా. కె. రమేశ్ అనే ఇద్దరు తమ పరిశోధన పత్రాలను సమర్పించడమైనది.

వివిధ కార్యక్రమాలు:

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వెబ్‌సైట్‌ను రూపొందించడానికి అవసరమైన సమాచారాన్ని కేంద్రంలోని సిబ్బంది



కొత్త ధారావాహిక
జూన్ నెల సంచిక నుండి

నంద్యాల నారాయణరెడ్డి రచన
'సౌతంత్రకాలం సదువులు'

'అమ్మనుడి' చదువరులకు నంద్యాల నారాయణరెడ్డిగారి గురించి, ప్రత్యేక పరిచయం అవసరం లేదు. హోసూరు ప్రాంత తెలుగు భాషోద్యమంలో వారిది పెద్ద పాత్ర. కృ.ష్ణ.రసం (కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం' లో వారిది ముందు నడక. కతలను, కవితలను, వ్యాసాలను, వ్యంగ్య బాణాలుగా భాషోద్యమంలో గురిపెట్టడంలో అందెవేసిన చేయి. ఎనిమిదేళ్ల క్రితం 'నడుస్తున్న చరిత్ర' లో వీరు వ్రాసిన 'ఇరుల దొడ్డి బతుకులు' ధారావాహికగా వెలువడి, చదువరుల మన్ననలను అందుకొన్నాయి. అటువంటి మరొక రచన 'సౌతంత్రకాల సదువులు' జూన్ 2019 నుండి మన 'అమ్మనుడి' లో ధారావాహికగా రాబోతున్నది. పొరుగు తెలుగు బతుకులలోని ఒక సాంఘిక చరిత్ర ఈ రచన. ఇది కూడ అమ్మనుడి చదువరులను అలరింపజేసి, ఆలోచింపజేస్తుందని మా నమ్మకం.

తమ ప్రాజెక్టులను చేస్తూనే సేకరిస్తున్నారు. కేంద్రం పక్షాన ఒక ప్రామాణికమైన గ్రంథాలయాన్ని ప్రారంభించడానికి చర్యలు చేపట్టడమైంది. 2018 - 2019 ఆర్థిక సంవత్సరంలో 570 ముఖ్యమైన తెలుగు గ్రంథాలను కొనుగోలు చేయడమైంది. వాటిని

భద్రపరచడానికి అవసరమైన 6 అరలను (6 Book Racks) కొనుగోలు చేయడమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో ఉన్న తాళపత్ర గ్రంథాలయాల్లోని తెలుగు తాళపత్ర గ్రంథాలను డిజిటలైజ్ చేసి తెచ్చుకొని కేంద్రం వెబ్‌సైట్‌లో పొందు పర్చాలని నిర్ణయించడమైంది. ఆ మేరకు ఆయా గ్రంథాలయాలకు లేఖలు రాయడం జరిగింది.

ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పరిశోధనాలయం - హైదరాబాద్‌లో కార్యశాల:

2019 ఫిబ్రవరి 11 నుండి 17 తేదీ వరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారం మరియు పరిశోధనాలయంలో 'శాసనాలు, లిపి, తాళపత్ర గ్రంథాల పరిష్కరణపై కార్యశాల నిర్వహించడమైంది. ఇందులో తెలంగాణలోని పూర్వ 10 జిల్లాలలోని పరిశోధక విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, జూనియర్ & డిగ్రీ కళాశాల అధ్యాపకులకు, విశ్వవిద్యాలయాల సహాయాచార్యుల వరకు అవకాశం కల్పించడమైంది. ఆయా అంశాలలో నిష్ణాతులైన వారి చేత ప్రయోగాత్మక శిక్షణ ఇవ్వడమైంది.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య లిఖిత పరిశోధనాలయం తిరుపతిలో కార్యశాల:

2019 మార్చి 25 నుండి 31 తేదీ వరకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనాలయంలో 'శాసనాలు, లిపి, తాళపత్ర గ్రంథాల పరిష్కరణపై కార్యశాల నిర్వహించడమైంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలోని పరిశోధక విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, జూనియర్ & డిగ్రీ కళాశాల అధ్యాపకులకు, విశ్వ విద్యాలయాల సహాయాచార్యుల వరకు అవకాశం కల్పించడమైంది. ఆయా అంశాలలో నిష్ణాతులైన వారిచేత ప్రయోగాత్మక శిక్షణ ఇవ్వడమైంది. ఏడు రోజుల శిక్షణ కార్యక్రమాలన్నింటిని వీడియో రీకార్డింగ్ చేయడమైంది.


భవిష్యత్ ప్రణాళిక:

ఈ కేంద్రం తెలుగు భాషా సాహిత్యం చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన ముఖ్యమైన, విలువైన సమాచారంతో ఒక సంగ్రహాలయాన్ని (మ్యూజియం) ఏర్పాటు చేయాలని భావించడమైంది. త్వరలోనే దీనికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడం జరుగుతుంది. ప్రాచీన తెలుగు సాహిత్యం మీద పరిశోధనాత్మక వ్యాసాలను ఆహ్వానించి కేంద్రం పక్షాన 'తెలుగు సిరి' అనే పేరుతో త్రైమాసిక పత్రికను (మొదట అంతర్జాలంలో, ఆ తర్వాత ముద్రణ రూపంలో కూడా) తీసుకరావాలని భావించడమైనది. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి సంబంధించిన లోగో నమూనా (logo Model) రూపొందించడం జరిగింది.

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

మధురాంతకం నరేంద్ర
98662 43659

తెలుగువాళ్ళ తమిళ నవలలు రెండు



తాను పుట్టిన వూరుపైన మక్కువ వుండడం మనిషికెంత సహజమో, అనేక కారణాల వల్ల అతను మరో ప్రాంతానికి వలస పోవడం గూడా అంతే సహజం. యే కుటుంబంగానీ అయిదు తరాల పాటూ వొకే వూరిలో వుండడం అసాధ్యమని మానవ పరిణామ శాస్త్రజ్ఞులు (ఆంథ్రపాలజిస్ట్స్) అంటారట!! రామాయణంలో రాముడు అడవికెళ్ళడం, మహాభారతంలో పాండవులు హస్తినాపురం నుంచీ వారణావతం పోవడం గూడా వలస వెళ్ళడమేగదా! జీవిక కోసం అనుకూలమైన ప్రదేశాన్ని వెతుక్కుంటూ వెళ్ళడం మానవ స్వభావం. 'వుద్యోగికి దూరభూమిలేదు' అంటుందో సామెత. జీవితానికి వుపనదిలా సాగే సాహిత్యంలో మానవుల వలసలను వస్తువులుగా తీసుకున్న రచనలు చాలానే వున్నాయి. జీవిక కోసం కాలిఫోర్నియాకు వలస వెళ్ళిన కుటుంబం గురించి జాన్ స్టెయిన్ బెక్ అనే అమెరికన్ రచయిత రాసిన "గ్రేప్స్ ఆఫ్ ది రాత్" పుస్తకానికి నోబులు బహుమతి వచ్చింది. అమెరికా వంటి దేశాల్లో వలసలు పోవడమన్నది చాలా సాధారణంగా జరిగే పని. అలా వలస పోవడం వల్ల వాళ్ళకు జరిగే మార్పు కేవలం భౌగోళికమైనదిగానే వుంటోంది. అదే భారతదేశంలో జరిగినప్పుడు వలసలు వెళ్ళిన వాళ్ళు కోల్పోయేది భాష, సంస్కృతి గూడా! యెనిమిది తొమ్మిది శతాబ్దాల క్రితం, ముస్లిములబారి నుంచీ తప్పించుకోవడం కోసం తెలుగు ప్రాంతం నుంచీ దక్షిణాదికి చేరుకున్న వాళ్ళు చాలామంది తమిళనాడులో, కన్యాకుమారికి వందమైళ్ళ దూరంలో, తూత్తుకుడి జిల్లాలో కుదురుకున్నారు. వాళ్ళల్లో నాయుళ్ళు, రెడ్లు, మాదిగలూ వున్నారు. నాయుళ్ళు కొందరు అక్కడే వొక గ్రామం కట్టుకున్నారు. ఆ వూరిలో పుట్టిన రచయిత వొకరు తెలుగు ప్రాంతాల నుంచీ వలస వెళ్ళిన ఆ గాధను రెండు నవలలుగా సాహిత్యీకరించాడు. ఆ నవలకు 1991 లోనే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. యిప్పుడా రచయితకు 96 సంవత్సరాల వయస్సు. ఆ నవల పేరు "గోపల్లె జనాలు" ఆ రచయిత పేరు కి.రాజనారాయణన్.

1923 సెప్టెంబరు 16వ తేదీన తూత్తుకుడిజిల్లా, కోయిలు పట్టి తాలూకాలోని ఇడైచేవలో అనే పల్లెలో పుట్టిన రాయంగల శ్రీ కృష్ణరాజనారాయణ పెరుమాళ్ రామానుజం నాయకర్, చదువు కున్నది యెనిమిదవ తరగతి వరకు మాత్రమే. కి.రాజనారాయణన్ అనే పేరుతో ఆయన ఏడు కథా సంకలనాలు, నాలుగు నవలలు, మూడు వ్యాస సంకలనాలు రాశారు. మాండలిక భాషలో రచనలు చేసే కీ.రా.(కి.రాజనారాయణన్ 'కీరా'గా తమిళ సాహిత్యంలో ప్రసిద్ధులు. తమ మాండలిక నిఘంటువును గూడా తయారు చేశారు. పాండి చ్చేరి విశ్వవిద్యాలయంవాళ్ళు "ఫోక్ టేల్స్ డాక్యుమెంటేషన్ అండ్ సర్వే సెంటర్" కు కీరా గారిని సంచాలకుడుగా నియమించి గౌరవించి నారు. ఆయన అనేక తమిళ జానపద కథల్నీ, సాహిత్యాన్నీ సేకరిం చారు. యిప్పుడాయన పాండుచ్చేరిలోనే వుంటున్నారు.

తన వాళ్ళు తెలుగునాడు నుంచీ తూత్తుకుడి ప్రాంతం వరకూ వలసవెళ్ళిన గాధను కీరాగారు 'గోపల్లె', 'గోపల్లె జనాలు' అనే రెండు నవలలుగా రాశారు. 'గోపల్లె' తమిళంలో వచ్చిన తొలి మాండలిక నవల. దీన్ని హోసూరువాసి నంద్యాల నారాయణరెడ్డిగారు 2012లో తెలుగులోకి అనువాదం చేశారు. "గోపల్లె జనాలు" నవలను చిత్తూరు జిల్లా వాసి (మధురై విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేసినవారు) ఆచార్య శ్రీపాద జయప్రకాష్ 2016లో తెలుగులో అనువాదం చేశారు. యీ రెండు పుస్తకాలనూ తెలుగు సాహిత్యాభిమాని చెన్నూరు ఆంజనేయరెడ్డిగారు 'ఆర్ట్స్ అండ్ లెటర్స్' అనే సంస్థ తరపున ప్రచురించారు. వీటికి జానపద సాహిత్యంపైన పరిశోధన చేసిన సగిలి సుధారాణిగారు ఆర్థికంగా, హార్దికంగా సహాయం చేశారు.

కీరాగారిది మౌఖిక ధోరణి. పల్లెటూళ్లల్లో కథలు చెప్పే అమ్మమ్మల, నాన్నమ్మల కథన పద్ధతి. వొక జానపదుడు భుక్తాయాసం తీర్చుకుంటూ, తన ముందు కూర్చున్న వాళ్ళకు నెమ్మదిగా, ఆశక్తికరంగా కథ చెప్పినట్టుగా ఆయన నవలలు కొనసాగుతాయి. యెక్కడో మొదలై, తర్వాత రకరకాల పిట్ట కథల్ని చెబుతూ, మరెక్కడో మళ్లీ మొదటికొచ్చి నేర్పుగా కథలనంతా వొకటిగా ముడివేసే జానపద ధోరణిలో కీరాగారు నవలను రాస్తారు (చెప్తారు!) రెండు నవలల్లో భారత స్వాతంత్ర్యోద్యమం గురించి రాసిన 75 పేజీలను మినహాయిస్తే మిగిలిన యీ రెండు నవలలు దాదాపు 250 పేజీలలో 'కాలమూ, స్థలమూ' యిదమిద్దంగా చెప్పడం సాధ్యం గాదు. దాదాపు యేడు శతాబ్దాల్లో జరిగిన కథ ముందుకూ, వెనక్కూ, అప్పుడప్పుడూ పక్కకు గూడా జరుగుతూ పాఠకుడ్ని మనదిగాని వొక పాత కాలానికి, మనకు తెలియని వొక పాత లోకానికి తీసుకెళ్తుంది.

రాజులూ, రాజ్యాలూ లేని, ప్రజలను రక్షించే ప్రభుత్వమంటూ యేదీలేని వొక అరాజక కాలంలో 'గోపల్లె' నవల ప్రారంభమవుతుంది. పాళెగాళ్ళ పాలన యింకా కొనసాగుతూనే వుంది. కుంపిణీ వాళ్ళ రాజ్యం యింకా మొదలుగాని కాలం అది. యే గ్రామానికా గ్రామం చిన్న రాజ్యంగా మారి, తమను తాము దొంగల బారి నుంచీ కాపాడుకోవల్సిన రోజుల్లో గోపల్లె గ్రామ సమీపంలో వొంటరిగా కనబడిన అభాగ్యురాల్ని చెరువులో తొక్కిపట్టి, ఆమె చెవులకున్న కాసిన్ని బంగారు నగలను దోచుకుంటాడో దుర్మార్గుడైన దొంగ. ఆమె ముఖాన్ని కాలితో నీటి అడుగుకు తొక్కుతున్నప్పుడు, వాడి కుడి కాలి బొటన వేలిని నోటితో గట్టిగా కొరికి పట్టుకుంటుందా ఆడ మనిషి. అలా తప్పించుకోలేక ఆవూరి రైతు చేతికి దొరికిపోతాడా దొంగ. ఆడమనిషి శవంతో బాటూ, ఆవిడ భర్త, హంతకుడూ ఆ వూర్లో జరిగే పంచాయితీకి హాజరు కావడంతో "గోపల్లె" నవల మొదలవుతుంది.

పంచాయితీని నడిపే కోట కుటుంబాన్నంతా పరిచయం చేశాక, ఆ కుటుంబానికున్న మూల స్థంభం. 'జేజ' అనుభవాల పాతరనంతా కథకుడు తవ్వడం మొదలు పెడతాడు. 'చెన్నాదేవి' అనే తన వేలు విడిచిన తోడబుట్టును రాణిగా చేసుకోవాలన్న తురక దొరనుంచీ తప్పించడం కోసం వొక గుంపు దక్షిణాదికీ పారిపో సాగింది. తురకరాజు సైన్యం వెంబడించ సాగింది. దారిలో యిలాగే తురక దొరల బారిన పడిన స్త్రీల గాథలు వినబడతాయి. (చిత్తూరు జిల్లా గుర్రం కొండ దగ్గర రెడ్డెమ్మ కొండ దగ్గర యిటువంటి కథే ప్రచారంలో వుంది. నవాబు బారి నుంచీ తప్పించుకోవడం కోసం రెడ్డెమ్మ అనే పల్లె పడతి రెండుగా చీలినరాతి లోపలికి దూరి మాయమై పోతుంది. ఆవిడ దేవతై పోయిందని అక్కడ గుడి కట్టారు. పిల్లలు పుట్టని వాళ్ళు అక్కడికెళ్ళి మొక్కు కుంటారు. చిత్తూరుజిల్లాలో రెడ్డెమ్మ, రెడ్డెప్ప, రెడ్డిరాణి, యిలా మొక్కుతో పుట్టిన వాళ్ళు పేర్లు పెడతారు. యీ కథ ఆధారంగా ప్రసిద్ధ రచయిత్రి ఆర్. వసుంధరాదేవిగారు "రెడ్డెమ్మ గుండు" అనే నవలిక రాశారు)

అలా మైళ్ళకొద్దీ పారిపోయి వచ్చిన వాళ్ళు శ్రీరంగం దాటి వొకచోట ఆగి, అడవిని తీర్చి, వూరుగట్టుకున్నారు. ప్రకృతిలో జీవిస్తూ, దొరికిన చెట్లనుంచీ, దగ్గర వున్న పశు పక్షుల నుంచీ బతకడానికి కావల్సిన వస్తువులనూ, దినుసులనూ సమకూర్చుకోసాగారు. "యీ నిడుపు వేటలో వాళ్ళందరూ ఎలమీ, తనివీ (తృప్తి) పొందినారని చెప్పలేము. కొందరు తాము పుట్టిన తావును తలచి వగచేవారు. వరుసగా చాలా నాళ్ళు నడుస్తూ రావడం వలన ఇది తెలియలేదు. ఇక ఇక్కడే మనకు అని ఎరుక పడిన ఆ తలపు దగ్గర (భూతము) అయి పట్టి పీడించింది కొందరిని" అంటాడు కథకుడు. అతరి నుంచీ పారిపోయివచ్చి, ఆ గ్రామాన్ని చేరుకున్న 'గోవు' పేరుతో ఆ వూరిని "గోపల్లె' అని పిలవ సాగారు. మొదట్లో వీళ్ళలాగే తెలుగునాడు నుంచి వచ్చి అక్కడ స్థిరపడిన వాళ్లను కలిసి, వియ్యాలను యేర్పరచుకున్నారు.

యీ వలసల అనుభవాలనంతా చెప్పాక మళ్లీ కంసాలి భార్యను చంపిన హంతకుడికి సబళము యెక్కించే శిక్షను విధించే దగ్గరికి చేరుతుంది కథ. తమ పంటనంతా మిడతలు నాశనం చేయడంతో, భారతదేశానికి తెల్లవాళ్ళు రావడంతో మొదటి నవల "గోపల్లె" ముగుస్తుంది. కథ చెబుతూనే కీరా ఆనాటి సామాజిక పరిస్థితులనూ, ఆచార వ్యవహారాలను పరిచయం చేస్తారు. కరెంటు, రహదారులూ, యంత్రాలూ లేని వొక ఆదిమ కాలంలో మనుషులు ప్రకృతిలో మమేకమై జీవిస్తూ, పశువులతో జంతువులతో సహజీవనం చేస్తూ, ఆనాటి పితృస్వామిక వ్యవస్థ తాలూకూ విలువల కోసం పరితపిస్తూ జీవించిన వైనమంతా కథలో భాగంగా పాఠకుడ్ని చేరుకుంటుంది. పెళ్లయిన తర్వాతే వక్కాకు వేసుకునే సంప్రదాయమూ, కోడి యీకలతో చెవిని శుభ్రపరుచుకునే పద్ధతీ, పెళ్ళాం కడుపుతో వున్నప్పుడు మొగుడు గడ్డం పెంచే ఆ భారమూ, తెలుగు నాడుకు దూరమైనా "రామ నామము కలకండా!" అని భజనలు చేసుకునే మనుషులూ, యిలా తమిళ – తెలుగు కలయిక వున్న ప్రాంతాల్లో (ఉదాహరణకు చిత్తూరు జిల్లాలో) యిప్పటికీ వున్న సంప్రదాయాలనంతా తూత్తుకుడి జిల్లా తెలుగు వాళ్ళల్లోనూ గమనించవచ్చు.

"గోపల్లె జనాలు" నవల రెండు భాగాలుగా విభజించబడింది. మొదటి భాగం దాదాపుగా "గోపల్లె" నవలకు పొడిగింపుగానే కనబడుతుంది. దేశానికి తెల్లవాడు చాలా మార్పుల్ని తీసుకొచ్చాడు. మట్టి నూనెతో వెలిగే హరికేన్‌లాంతర్లు వచ్చాయి. పిల్లల చదువుల కోసం వూరి పెద్ద వొక అయ్యోరును తీసుకొచ్చి బడిని పెట్టాడు. ఆ అయ్యవారికి పల్లెలోని జనాలు తనతో మాటాడిన అరవమూ, తమతో తాము మాట్లాడుకునే తెలుగూ – రెండూ యిబ్బందినీ, విస్మయాన్నీ కలిగించాయి. గోపల్లెలో చివరగా వో సతీ సహగమనం గూడా జరుగుతుంది. చనిపోయిన భర్తపైన అంతులేని అనురాగంతో, అతడు చనిపోయాక తన అస్తిత్వపు అవసరమే లేదనుకున్న వో భార్యను సతీ సహగమనం చేయించిన పద్ధతులు బీభత్సంగానూ, విస్మయంగానూ కనిపిస్తాయి.

యిప్పటికీ రాయలసీమ ప్రాంతంలో వాడుకగా వుండే "దేవ రెద్దు" సంప్రదాయం గోపల్లెలోనూ వాడుకలో వుండేది. మనుషుల్లాగే పశువులు గూడా కొత్త ప్రదేశానికి అంత త్వరగా యిష్టపడవు. అవి గూడా మనుషుల్లాగే వాసనలకూ కట్టుబడి వుంటాయి.

వ్రతం వుండేవాడు మరుపూటే వొక గంగాళం తిండిని తింటే కన్నతల్లి గూడా "నువ్వు వ్రతం వుండే అందం చాల్లేరా!" అనక తప్పదు. యింటినీ, వూరినీ కాపాడే కుక్కలను దారి మళ్లించడం కోసం దొంగలు చిత్రమైన వశీకరణ మార్గాలు వెతుక్కుంటారు. అగ్గిపెట్టె అన్న వస్తువు రాగానే ఆనాటి జనాలు భూమ్యాకాశాలు తలకిందులైనట్టుగా వాపోతారు. పెద్ద ఇళ్ళలో నిప్పును ఆరిపోకుండా కాపాడుకోవడం, లేనివాళ్ళు వెళ్ళి తెచ్చుకోవడమే గొప్పని వాళ్ళ ప్రగాఢ విశ్వాసం.

"గోపల్లె జనాలు" రెండవ భాగం ఆధునిక కాలానికి తీసుకొస్తుంది. యేదయినా పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకుని తాంబూలాలు మార్చుకునే సమయంలో అమ్మాయి మేనమామ రోకలిని తీసుకెళ్ళి, ప్రధాన వాకిలి ముందు నిలబడి "తురక వాడు వస్తున్నాడు" అని మూడుసార్లు చెప్పడం వొక ఆచారంగా మారిపోయింది. పిల్లలు

పిలక జుట్టులు కత్తిరించుకుని క్రాపులు జేసుకున్నప్పుడు ముసలివాళ్ళు బాధతో కన్నీళ్లు పెట్టుకోసాగారు. పాత పద్ధతిలో రాగం తీయకుండా వచనం లాగా పాఠాలు చదివే విద్యార్థులను జూసి పాతకాలం వాళ్ళు 'వీళ్ళ చదువూ, చట్టు బండలూ!" అని విసుక్కో సాగారు. నోటి లెక్కలకు బదులు నోటు పుస్తకాలనంతా లెక్కలతో నింపేసి పిల్లల్ని చూసినప్పుడు "అమ్మ విద్యకు సాటి వస్తుందా?" అని నిట్టూర్చ సాగారు. యింగ్లీషు కలెక్టర్లూ, దేశీయ తాసిల్దార్లూ, గ్రామీణ కరణాలూ, వూరి మునసబులూ దర్బారు చేయసాగారు. చాక్కాలూ, గడియారాలూ, అగ్గిపెట్టెలూ, రైల్లూ, ఫౌంటెన్ పేనాలూ, దిక్సూచులూ, బేటరీ లైట్లూ, తుపాకులూ, కల్లూ సారా అంగళ్లూ-మొదలైన ఆధునిక సాధనాలు వచ్చినప్పుడంతా, గోపల్లెజనాలు ప్రపంచంలోకి వుపద్రవాలు ముంచుకొస్తున్నాయనీ, కలియుగం అంతమైపోతోందనీ వాపో సాగారు.

మొదటి ప్రపంచయుద్ధంకాలంలో తెల్లవాళ్ళు గ్రామీణుల్ని సైన్యంలోకి చేర్చుకుని, వాళ్లను యుద్ధంలో మొదటి వరసలో నిల్చోబెట్టి తాము వెనకుండి మోసం చేస్తున్నారని గ్రామీణులు బయపడసాగారు. చాపకింద నీళ్లలా యీ లోగా స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమై పోయింది. గాంధీ బొమ్మను పచ్చ పొడిపించుకునే వాళ్ళూ, జాతీయ పతాకాన్ని వూరేగించేవాళ్ళూ పుట్టుకొచ్చేశారు. రూపాయనోట్లను చూసి వాళ్ళు నోళ్లు తెరిచేశారు. క్రమంగా మానవుల్లోని నైతిక విలువలు గూడా మారిపోసాగాయి.

గోపల్లెలో వోనాటి వుదయాన రావి చెట్టుకు మూడు రంగుల జెండా కట్టబడి వుండడం చూసిన మునసబు తన వుద్యోగం పోతుందన్న భయంతో గొల్లుమంటాడు. ప్రభుత్వానికి భయపడే వాళ్ళు "వందేమాతరం" అనే నినాదానికే భయపడి పో సాగారు. తపాలాఫీసు రావడమొక గొప్ప విప్లవం. దిన పత్రిక అన్నది గొప్ప సంరంభం. పాత బడుల స్థానంలోకి బోర్డు బడులు వచ్చేశాయి. బడుల్లో అన్ని కులాల వాళ్ళూ పక్క పక్కనే కూచోడం చాలా మందికి గిట్టలేదు.

యీ విషయాలనంతా వీరా తనదైన విశిష్టమైన మౌఖిక ధోరణిలో పాత్రల మూలంగా కథలాగే చెప్పుకుంటూ పోతారు. 1911 వ సంవత్సరం జూన్ 17వ తేదీ శనివారం నాడు కొడైకెనాల్ కెళ్ళే రైలెక్కిన జిల్లా కలెక్టరు ఆష్ దొరను మణియాచ్చి జంక్షనులో సెంగోట్టై రఘుపతి అయ్యర్ కొడుకు వాంచినాదన్ అయ్యర్ కాల్చి చంపి, తానూ ఆత్మహత్య చేసుకున్నాడు" అని 30వ అధ్యాయంలో తొలిసారిగా ఖచ్చితమైన తారీఖునూ, వాస్తవమైన వార్తనూ పేర్కొంటాడు రచయిత. తరువాత స్వాతంత్ర్యోద్యమంలో జరిగిన అనేక చర్యలకూ, పాల్గొన్న అనేక మంది నాయకుల విధానాలకూ గోపల్లెలోని జనాలంతా యెలా స్పందించారో చెబుతూ పోతాడు. కొన్ని అధ్యాయాలు ఆనాటి స్వాతంత్ర్యోద్యమ చరిత్రగా మాత్రమే తయారయ్యాయి. తెల్లవాళ్లు దేశాన్ని వదలిపెట్టి వెళ్ళడానికి సిద్ధమవడంతో, దేశానికి స్వాతంత్ర్యం రావడంతో నవల ముగుస్తుంది. స్వాతంత్ర్యోదయవేళ దేశమంతా సంబరాలు చేసుకుంటున్న సమయంలో గాంధీ మౌనంగా రాట్నం వడుక్కుంటూ, తనను చూడవచ్చిన పత్రికా విలేఖరులతో "యేమీలేదు" అని మాత్రమే అంటాడు.

"అన్ని నవలలూ ముగింపులో బలహీనమైపోతాయి". అంటాడు ప్రఖ్యాత ఆంగ్ల రచయితా, విమర్శకుడూ, యి.యం.ఫాస్టర్. "ప్లాట్" కూ పాత్రలకూ మధ్య జరిగే సంఘర్షణే యిందుకు కారణం. అయితే స్వాతంత్రోద్యమకాలం వచ్చే సరికి కీ రా గోపల్లె గ్రామ జీవన చిత్రణ కంటే యెక్కువగా ఆనాటి అహింసా పోరాటాన్నే ముఖ్యంగా భావించడంతో నవల చివర్లో కథగా కంటే చరిత్రగానే రూపొందింది. స్వాతంత్రోద్యమంలో స్వయంగా పాల్గొన్నవాడు గావడంతో కీ రా నవలకు కావలసిన తాటస్థ్యతను పొందలేక పోయివుండవచ్చు.

తమిళంలో రాసిన తెలుగువాళ్ళ నవలలు యీ రెండూ. గోపల్లె గ్రామ వాసులందరూ "పెరుమాళ్ళ" భక్తులు. తిరుపతి యేడు కొండల వాడు వాళ్ళ దైవం. యింట్లోంచీ బయటకెళ్ళబోతున్న శ్రీదేవితో తాను వచ్చే వరకూ అక్కడే కూర్చుని వుండమని చెప్పి, బయటకెళ్ళి బావిలోకి దూకేసే యింటి యజమాని వుదంతం తెలుగు వాళ్ళకు బాగా పరిచయమైన "ఉండమ్మా ! బొట్టు పెడతా!" కథను గుర్తు చేస్తుంది.

ఏ ఒళము పైకెక్కి చనిపోవడానికి సిద్ధంగా వుండే నేరస్థుడు తనను చూడవచ్చిన పిల్లలతో పాట పాడమంటాడు. అప్పుడు వాళ్ళు పెద్ద "గొబ్బియాలో" అంటూ తెలుగు పాట పాడతారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో గూడా గోపల్లె గ్రామస్థుల పాటలు తెలుగులోనే వుంటాయి.

స్వాతంత్ర్యానికి ముందుకాలంలో తమిళులతో కలిసి జీవిస్తూనే తమ తల్లిభాషను అంటి పెట్టుకోడానికి ప్రయత్నించిన తెలుగువాళ్ళు, స్వాతంత్రం వచ్చాక, భాషా ప్రయుక్త రాష్ట్రాలు వచ్చాక క్రమంగా తమిళంలోకి మారిపోయారు. యీ మార్పుకంతా నిలువెత్తు నిదర్శనంగా యీ రెండు నవలలూ నిలబడతాయి. వొక కన్నడ మహాసభల సమయంలో ప్రసిద్ధ కన్నడ నవలా రచయిత వొకరు "యీ సభలకంటే దోసెలే నాకు ముఖ్యం" అన్నాడు. బతకడానికి తిండే ప్రధానం. ఆ తరువాతే భాషయినా, సంస్కృతి అయినా! కాల ప్రవాహంలో అనేక మార్పులు వస్తూనే వుంటాయి. కానీ మనుషులు జననినీ, జన్మభూమినీ, మాతృభాషనూ వదులుకోడానికి సిద్ధంగా వుండరు. పరిస్థితులూ, ప్రభుత్వాలూ మనుషుల జీవితాలతో చెలగాటమాడుతూనే వుంటాయి. అటువంటి సమయాల్లో మానవజాతి నిజంగా నాగరికంగా యెదుగుతోందా – అన్న ప్రశ్న యదురౌతుంది.

తమిళంలో లబ్ధప్రతిష్ఠుడై, అనేక గొప్ప పురస్కారాలు పొందిన కీరా రైల్లో వొక తెలుగువాళ్ళ స్టేషనుకు వచ్చినప్పుడు తెలుగు మాటలు చెవినబడగానే యేదో దేవలోకానికి వచ్చానని మురిసి పోయాడు. "మనమంతా తెలుగుతల్లి బిడ్డలం. ఏదో కాలవశాన ఎప్పుడో మేము ఈ పక్కలో వుండి పోతిమి. మీరు ఆ పక్కలో వుండి పోతిరి. మనం ఉండేది యెక్కడైనా మనం మాట్లాడే తెలుగుభాషనువీడ కూడదు" అంటాడు నిష్కర్షగా.

"గోపల్లె", "గోపల్లె జనాలు" నవలలు చదివాక, కీరా గారి ఘోష విన్నాక. మనమంతా వోరకమైన నిర్వేదంలో మునిగిపోతాం. అనేక ప్రశ్నలు మనముందు సవాళ్ళుగా నిలబడతాయి. వాటికేమని సమాధానాలు చెప్పాలో మనకు తోచదు.

మాటామంతీ

– అడపాల సుబ్బారెడ్డి
93468 14601

జోళదరాశి (గుత్తి) చంద్రశేఖరరెడ్డి గారితో ....



మేరలకు ఆవల, అంటే తెలుగు రాష్ట్రాలుగా ఇప్పుడు మనం చెప్పుకొనే తెలంగాణాంధ్రలకు బయట సగంమంది తెలుగువారున్నారు, వారిని గురించి పట్టించుకొన్నవారే లేరు, అని స.వెం.రమేశ్ అంటుంటారు. ఆ మాటలు నన్ను వెంటాడుతూనే ఉండేవి. రమేశ్‌తో కలిసి అటువంటి బయటి తెలుగుతావులలో కొన్నింటిలో తిరిగినాను. కొందరు బయటి తెలుగువారితో మాట్లాడినాను. వాళ్లతో మాట్లాడుతుంటే ఆవేశంతో మన పిడికిళ్లు బిగుసుకొంటాయి. ఆవేదనతో గుండెలు బరువెక్కుతాయి. అటువంటి మాటామంతులను కొన్నిటిని అమ్మనుడి చదువరులతో పంచుకొన్నాను. ఇది కూడా అట్లాంటిదే మరొకటి. జోళదరాశి (గుత్తి) చంద్రశేఖరరెడ్డిగారితో మాటామంతి ఇది. వీరిని రెండు సందర్భాలలో కదిలించినప్పుడు, వెలికి వచ్చిన మాటలు ఇవి. ఒకసారి రచయిత్రి సింధుమాధురిగారు; మరొకసారి స.వెం.రమేశ్, కొండా లక్ష్మీకాంతరెడ్డిగార్లు కూడా నాతోపాటు ఈ మాటల్ని పంచుకొన్నారు. – అడపాల సుబ్బారెడ్డి

సుబ్బారెడ్డి : మీ పుట్టుక, చిన్నతనం, చదువు, కుటుంబం ఈ వివరాలను చెప్పండి.

జోళద : ఇప్పటి కర్నాటక, ఒకప్పటి మదరాసు మాగాణంలోని బళ్ళారి జిల్లాలో ఉండే జోళదరాశి అనే పల్లెటూరు మాది. నా పుట్టుక, చిన్నతనం అంతా ఆ ఊరిలోనే. అమ్మపేరు పార్వతమ్మ. నాయనపేరు గుత్తి నారాయణరెడ్డి. నా నాలుగవ ఏటనే మా అమ్మ చనిపోయింది. మా నాయనకు రెండవ ఇల్లాలిగా వచ్చిన లక్ష్మమ్మ నన్ను కన్నతల్లికంటే ఎక్కువగా సాకింది. జోళదరాశి, చాగనారు, బళ్ళారిలలో నా చదువు పి.యు.సి. వరకూ సాగింది. పై చదువులకోసం మాత్రమే బళ్ళారిని దాటినాను నేను.

సు : తెలుగువారికి నిజమైన ఎల్లలు ఏమిటి?

జో : ఒక్క తెలుగువారికే కాదు, నాగరిక సమాజంగా ఎదిగిన ఏ భాష వారికైనా వారి నిజమైన ఎల్లలను వెతుక్కోవడం సమస్యే. కానీ మనదేశంలో తెలుగువారిది ప్రత్యేకమైన సమస్య. ఈ సమస్యను సృష్టించుకొనింది తెలుగువాళ్లమే. భాషపేరుతో మాకు ఈ ఎల్లలు కావాలి అని మొదలు పెట్టింది మనమే కదా, మొదలు పెట్టడమే కాదు పోరాటాలు చేసినాము, బలిదానాలు చేసినాము. చివరకు సగంమంది తెలుగువాళ్లు మాత్రమే ఉంటున్న ప్రాంతాన్ని తెలుగు రాష్ట్రం చేసుకొన్నాం. **నిజానికి వింధ్య పర్వతాలకు దిగువ కన్యాకుమారి వరకూ తెలుగువాళ్లు లేని ప్రాంతం ఎక్కడుంది?**

సు : ఇప్పటి కర్నాటకలో ఎంతమంది తెలుగువాళ్లు ఉండవచ్చు?

జో : ఈ శాతాలూ లెక్కలూ నేను సరిగ్గా చెప్పలేను. ఇప్పటి కర్నాటకలో ప్రతి ముగ్గురిలోనూ ఒకడు తెలుగువాడే అని ఒక అంచనా. ఇది నిజమేనా దీనికి ఆధారాలేమిటి అంటే నేను చెప్పలేను. అయితే ఇక్కడ తెలుగుదనం ఎంతుంది అని చూస్తే, చాలా ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. అచ్చకన్నడ ప్రాంతాలుగా కన్నడిగులు పిలుచుకొనే మైసూరు, మండ్య ప్రాంతాలలోనే తెలుగు జానపదాలు కోకొల్లలు. తెలుగు చలనచిత్ర ప్రదర్శన జరగని పట్టణాలూ నగరాలూ పదిశాతం కూడా ఉండవు. కోలారు నుంచి బీదరు వరకూ ఉన్న సరిహద్దు జిల్లాలయితే తెలుగువాళ్లతో నిండిపోయి ఉంటాయి.

సు : ఇప్పటి కర్నాటకలో ఉంటున్న తెలుగువాళ్లకు తెలుగుపైన అభిమానం ఉందంటారా?

జో : అభిమానం ఉందనే నా అభిప్రాయం. ఎవరికైనా అమ్మమీద అమ్మభాషమీద అమ్మ నేలమీద అభిమానం లేకుండా ఎందుకుంటుంది? వీధుల్లోకి వచ్చి జేజేజే అని తెలుగులో అరవకపోవచ్చు. మనసు అట్టడుగు పొరల్లో ఆ అభిమానం గూడు కట్టుకొనే ఉంటుంది. దీనికి ఒక ఉదాహరణ చెప్తాను. ఆమధ్య అంటే కొన్ని నెలల క్రిందట బెంగుళూరులో ఒక తెలుగు కార్యక్రమం జరిగింది. నేను పోతన భాగవతాన్ని కన్నడం చేసిన సందర్భమది. చాగంటి కోటేశ్వరరావుగారు వచ్చి భాగవత ప్రవచనం చేసినారు. మూడు నాలుగు వేలమంది ఆ కార్యక్రమంలో పాల్గొని ఉంటారు. అందులో యువతీయువకులు కూడా చాలామంది ఉన్నారు. తెలుగులో భాగవత ప్రవచనాన్ని వింటున్న వారందరి మొకాలు వెలిగిపోతున్నాయి. ఒక్క మాటను కూడా వదిలిపెట్టకుండా జుర్రుకొని వింటున్నారు. చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దం. నేను ఒకరిద్దరు కుర్రవాళ్లని 'ఏమిటి మీరు చాలా ఆనందంగా ఉన్నట్లున్నారే' అని పలుకరించినాను. 'తెలుగు మాటలు వినడం ఆనందం కాదా' అని బదులిచ్చినారు వాళ్లు. ఇదంతా అభిమానం కాదంటారా!

సు : బెంగుళూరు నగరం సరే. ఇతర ప్రాంతాలలో కూడా తెలుగుపట్ల ఇంతే స్పందన ఉందా? ముఖ్యంగా బళ్ళారిలో?

జో : అభిమానం ఉంది కానీ, స్పందన లేదు. ముఖ్యంగా

బళ్ళారి ప్రాంతంలోని తెలుగువాళ్లు తెలుగువాళ్లుగా చూపించు కొనేందుకు కూడా జంకుతున్నారు. మీకొక విషయం చెప్తాను. మా మేనల్లుడు బళ్ళారిలో వకీలు. అతని పేరు మల్లికార్జున రెడ్డి. ఈమధ్యన అతనొక ఉద్యమం చేసినాడు. ప్రైవేటు భాగస్వామ్యంలో ఒక విమానా శ్రయం కట్టాలని వచ్చి, ఒక సంస్థవారు బళ్ళారి దగ్గర 2400 ఎకరాలను కొనాలనుకొన్నారు. అప్పటి మార్కెట్ ధర ప్రకారం రెట్టింపు ఇస్తామన్నారు. దాని చెడు ప్రభావం తెలియని కొందరు రైతులు తమ భూములను అమ్ముకొన్నారు. అప్పుడు మావాడు రంగంలోకి దిగి, భూముల్ని అమ్మొద్దంటూ ఊరూరూ ఇల్లిల్లూ తిరిగి ప్రచారం చేసినాడు. ఐదురోజులు నిరాహారదీక్ష చేసినాడు. సిపిఐ (ఎంఎల్) పార్టీ వాడి ఉద్యమానికి అండగా నిలిచింది. ఐదారువందల మంది కలిసి, బళ్ళారి జిల్లా సరిహద్దుల్లోని చేళ్ళగురికి గ్రామం నుండి బళ్ళారి వరకు 30 కి.మీ. పొర్లుదండాల పోరాటం చేసినారు. 350 కి.మీ. బెంగుళూరుకు పాదయాత్ర చేసినారు. వాడిని రెండుసార్లు అక్రమంగా ఖైదుచేసి హింసించినారు. అయినా వాడు ఉద్యమాన్ని ఆపలేదు. చివరికి హైకోర్టు స్టే ఇచ్చింది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే ఇంత పోరాటపటిమ, తెగువ ఉన్నవాడు కూడా తెలుగువాడిగా చెప్పుకోవడానికి ఇష్టపడడు. కన్నడంలోనే ఉపన్యాసాలు ఇస్తాడు. 'మామా ఇది కన్నడ నేల కదా, తెలుగు ఎందుకు' అంటాడు. 'నువ్వు కన్నడంలో మాట్లాడడం తప్పుకాదు, కానీ తెలుగులో కూడా మాట్లాడితే ఏమయింది' అంటే ధైర్యం చేయడు. వాళ్లే ఒకసారి బళ్ళారిలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసినారు. అందరూ కన్నడంలోనే మాట్లాడుతున్నారు. నేను తెలుగులో మాట్లాడినాను. ఒక విలేకరి 'మీరు కన్నడంలో మాట్లాడలేరా' అని అడిగినాడు. 'మీ అందరి కంటే బాగా మాట్లాడగలను. మీ కన్నడ మాటను రుచి చూడాలని ఉంది అని అడగండి, మాట్లాడతాను. అంతేగాని కన్నడంలోనే మాట్లాడి తీరాలి అంటే మాట్లాడను' అని తెగేసి చెప్పినాను. ఇట్ల అడిగేవారే లేకుండా పోయినారు బళ్ళారిలో.

సు : బళ్ళారిలో తెలుగు సంఘాలు లేవా? వాళ్లెవరూ ప్రశ్నించడం లేదా?

జో : ఎందుకు లేవు, ఉన్నాయి. వాళ్లందరితో నాకు మంచి సంబంధాలే ఉన్నాయి. కఠిన వాస్తవం ఏమిటంటే వాళ్లు కూడా చాలామట్టుకు కార్యక్రమాలను కన్నడంలోనే చేస్తున్నారు. ఆమధ్య ఒక తెలుగుసంఘం వారు ధర్మవరపు రామకృష్ణమాచార్యులవారి జయంతిని జరిపినారు. ఉపన్యాసాలన్నీ కన్నడంలోనే జరిగినాయి. రామకృష్ణమాచార్యులవారి వారసులు ఆ సభలో ఆంగ్లంలో మాట్లాడినారు. ఒక్క జోళదరాశి చంద్రశేఖరరెడ్డిది తప్ప ఇంకొక్క తెలుగుగొంతు ఆ సభలో వినబడలేదు. ఒక తెలుగు మహనీయుడికి సంబంధించిన కార్యక్రమాన్ని, ఆయన బతికి నడయాడిన ఊర్లో, ఆయన కుటుంబ సభ్యులూ అనేకమంది తెలుగువారూ పాల్గొన్న సభలో, కన్నడంలో ఆంగ్లంలో జరిపించినారు. 'తెలుగులో ఉపన్యసిస్తే మీకేమవుతుంది' అని అడిగితే, 'ఎందుకండీ, కన్నడ రక్షణ వేదిక వాళ్లు ఉంటారు కదా, వచ్చి గలాట చేస్తారు. మన ఇళ్లల్లో మాట్లాడుకొంటాము చాలదా, తెలుగెక్కడకు పోతుంది' అనేసినారు. ఇదీ బళ్ళారిలో తెలుగు సంఘాల, తెలుగు ప్రజల పరిస్థితి. వాళ్ల భయానికి కూడా అర్థం ఉంది. ఒకసారి బళ్ళారిలో కర్నాటక తెలుగు అకాడెమీ అనే సంస్థవారు తెలుగు సభను నడుపుకొంటుంటే కన్నడ సంఘం వాళ్లు వేదిక మీదకు ఎక్కి రసాబాస చేసినారు. ఆ సభలో నేను కూడా ఉన్నాను.

సు : తెలుగుపట్ల కన్నడ సంఘాల వారు తీవ్ర వ్యతిరేకతను చూపడం బళ్ళారి ప్రాంతంలో మాత్రమేనా, కర్నాటక అంతటా ఈ పరిస్థితి ఉందా?

జో : నా పరిశీలనలో బళ్ళారి ప్రాంతంలోనే ఈ వివక్ష ఎక్కువగా ఉందనిపిస్తుంది. తెలుగువాళ్లు బాగా ఎక్కువగా ఉన్న కోలారు జిల్లాలో ఇంత వివక్ష కనిపించదు. దీనికి కారణాలుగా నేను అనుకొనేవి ఏమిటంటే, కోలారు జిల్లా తెలుగువాళ్లు మొదటి నుండీ, అంటే 'పాఠశాల విద్య' అనేది మొదలయిన తొలినాళ్ల నుండీ కన్నడమే చదువుతున్నారు. అక్కడ కేవలం నాలుగయిదు తెలుగు బడులు మాత్రమే ఉండేవి. బళ్ళారి అట్ల కాదు. ఇక్కడ మొదటి నుండీ 90% పైగా తెలుగుబడులే ఉండేవి. కన్నడబడులు తక్కువగా ఉండేవి. కోలారు లాంటి చోట్ల తీవ్రమైన కన్నడ అభిమానం కలిగి ఉండే వీర శైవులు తక్కువ. బళ్ళారిలో వీరశైవులు ఎక్కువ. బళ్ళారి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండినందువలన, ఇక్కడి తెలుగువారికి ఆంధ్రరాష్ట్రంలో కలవాలనే కోరిక బాగా ఉండేది. ఆ విషయంలో ఈ ప్రాంతంలో తెలుగు కన్నడిగుల మధ్య మనఃస్పర్థలు ఎక్కువయినాయి. కోలారు తెలుగువాళ్లు తొలి నుండీ మైసూరు రాజ్యంలో భాగంగా ఉంటూ కన్నడమే చదువుకొంటూ పాత రాజధాని మైసూరుకూ కొత్త రాజధాని బెంగుళూరుకు దగ్గరగా ఉండడం వలన ఆంధ్రరాష్ట్రంలో కలవాలనే కోరికను చూపించలేదు. ఇన్ని కారణాలు ఉన్నా ఇప్పుడిప్పుడే అక్కడ కూడా వివక్ష మొదలయింది. తెలుగు చలనచిత్ర ప్రదర్శనను అడ్డుకోవడం, ఎన్నికల సమయంలో తెలుగులో ప్రచారం చేసే నాయకులను నిలదీయడం వంటివి జరుగుతున్నాయి.

సు : బళ్ళారి చరిత్రను గురించి చెప్పగలరా?

జో : బళ్ళారి ప్రాంతం రెండువేల ఏండ్ల కిందట ఆంధ్ర శాతవాహనుల రాజ్యంలో భాగంగా ఉండేది. క్రీ.శ. 4 లేదా 5 శతాబ్దాల నాటి గాంగరాజుల శాసనాలలో ఈ ప్రాంతానికి సిందవాడి అని పేరు. చాళుక్యులు, రాష్ట్రకూటులు, హొయసలులు వంటి రాజ్యాల పరిధిలో బళ్ళారి ఉండినా, చరిత్రలో ఈ ప్రాంతం ఒక్క వెలుగు వెలిగింది విజయనగర రాజుల కాలంలో. సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశాల పాలనలో ఇక్కడ తెలుగు వెల్లివిరిసింది. కృష్ణదేవరాయలవారి పాలనలో అయితే చెప్పనవసరం లేదు. దేశ భాషలందు తెలుగు లెస్స అని రాయలవారే స్వయంగా అన్నారు. కానీ రాయలవారితో సహా విజయనగర రాజులు ఎవరూ ఇతర భాషలను, ముఖ్యంగా కన్నడాన్ని తక్కువగా చూడలేదు. 16వ

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!



శతాబ్దంలో బీదర్, బిజాపూర్, అహమ్మద్ నగర్, గోల్కొండ వంటి ముస్లిం రాజ్యాలన్నీ ఒక్కటై విజయనగరం మీద దాడి చేసినాయి. విజయనగర సామ్రాజ్యం కూలిపోయింది. అప్పుడు హంపి, బళ్ళారి ప్రాంతాలలోని తెలుగువాళ్లు చాలామంది, కూడబెట్టుకొన్న సంపదను మూటగట్టుకొని, కాలినడకనా ఏనుగులూ గుర్రాల మీదా పొలోమంటూ వలసపోయినారు. పెనుగొండ, చంద్రగిరి, తంజావూరు, మదుర ప్రాంతాలకు ఆ వలస జరిగింది. బళ్ళారి ప్రాంత పల్లెలన్నీ ఇంచుమించుగా నిర్మానుష్యమై పోయినాయి. అప్పుడు ముస్లింరాజుల సైన్యంలో ఉద్యోగం చేస్తుండిన ఉత్తర కర్నాటక ప్రాంతపు వీరశైవ గ్రామీణులు, వాళ్ల రైతులు కూడా కావడం వలన, ఖాళీ అయిన బళ్ళారి ప్రాంతంలో కుదురుకొన్నారు. బళ్ళారి సేద్యపు భూములు బంగారం దొరికినట్లు దొరికినాయి వాళ్లకు. కుదురుకొన్న వీరశైవ కన్నడిగులు మెల్లమెల్లగా తమ బంధువర్గాన్ని కూడా ఉత్తరం వైపు నుండి రప్పించుకొన్నారు. ఎందుకంటే ఉత్తర కర్నాటక అప్పుడూ ఇప్పుడూ కూడా తీవ్రమైన కరువు ప్రాంతం. అక్కడి గ్రామీణులకు సైన్యంలో ఉద్యోగమే అప్పటికి ఆధారం. వాళ్ల వలసవల్లనే బళ్ళారి ప్రాంతంలో కన్నడం పెరిగింది. బళ్ళారి తావున ఉండిన తెలుగుదనమంతా పారిపోయింది. కొత్తగా కన్నడదనం వచ్చి కుదురుకొనింది.

సు :మీ మాటకు అడ్డు తగులుతున్నందుకు మన్నించండి. తెలుగువాళ్లు అంత పిరికితనంగా పారిపోయారు అంటే నమ్మశక్యంగా లేదు.

జో : నిజమే. నా మాటలు వింటే ఎవరికైనా అట్లే అనిపిస్తుంది. నిశిత పరిశీలనలో మాత్రమే నిజమైన చరిత్ర దొరుకుతుంది. హరిహర, బుక్కరాయల కాలం వరకూ ఉండిన నానుడి ఏమిటంటే పదిమంది హిందూ సైనికులకు ఒక్క ముస్లిం సైనికుడు సాటి అని. అందుకే ప్రౌఢ దేవరాయలు కొందరు ముస్లింలను తన సైన్యంలో చేర్చుకొని, తన హిందూ సైనికులకు కూడా వారిచేత శిక్షణనిప్పించినాడు. ఆయన కాలానికి 3 :1 అయింది. కృష్ణదేవరాయల కాలానికి హిందూ ముస్లిం సైనికుల పోరాట పటిమ 1 : 1 అయింది. అయినా కూడా ముస్లిం సైనికుల క్రౌర్యం హిందూ సైనికులకు లేదు. దానికి కారణం వారి వారి పాలకులే. ముస్లిం పాలకులకు అప్పుడు ఒక యుద్ధనీతి లేదు. యుద్ధ నీతే కాదు, ఏ నీతీ లేదు. ఖిల్జీ, దేవగిరి పాలకుడైన రామచంద్రరావుని చంపేసి, అతని భార్యనూ కూతుర్నీ ఇద్దరినీ పెండ్లి చేసుకొన్నాడు. ఇట్లాంటి ఉదాహరణలు కోకొల్లలు. వాళ్లతో పాటు సైన్యంలో పనిచేస్తుండిన వీర శైవులు కూడా ఈ క్రౌర్యాన్ని ఒంట పట్టించుకొన్నారు. కులం లేదు గోత్రం లేదు, పేదా గొప్పా తేడా లేదు, మనుషులంతా సమానమే అని బోధించిన మహనీయుడు బసవేశ్వరుడు. కానీ తరువాతి కాలంలో ఆయన అనుయాయులు, పరమత ద్వేషాన్నే కాదు, పరభాషా ద్వేషాన్నీ గుండెల నిండుగా నింపుకొన్నారు. కృష్ణదేవరాయలు వైష్ణవాన్నీ తెలుగునీ ఆదరించడం వాళ్లకు కంటగింపు అయింది. వీరశైవుల మతభాష కన్నడం. శివుడే దేవుడు, కన్నడమే భాష అనేది వాళ్ల మతం. అట్లాంటి వీరశైవులూ ముస్లింలు కలిసి దాడి చేసినప్పుడు, తమ రాజు యుద్ధరంగంలో కనుమూసినప్పుడు, పారిపోవడమో బలికావడమో రెండే దారులు అప్పుడు బళ్ళారి తెలుగు ప్రజలకు.

సు : మీరు చెప్తున్న ఉత్తర కర్నాటకలో అప్పుడు కానీ ఇప్పుడు కానీ తెలుగువాళ్లు లేరా?

జో : ఎందుకు లేరు, అప్పుడూ ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు. కానీ వాళ్లంతా కన్నడిగులైన తెలుగువాళ్ళు. పాటిల్, గౌడ అనే పట్టాలను పెట్టుకొనిన వాళ్లంతా ఒకప్పటి రెడ్లు. వీరశైవం తీసుకున్న రెడ్లు, బలిజలు కన్నడిగులైనారు. ఎంత కన్నడిగులైనా వాళ్ల శాఖల పేర్లను గమనిస్తే వాళ్లు తెలుగువాళ్లని తెలిసిపోతుంది. పాకనాటి, మోటాటి, వెలనాటి, మున్నూటి శాఖల రెడ్లు ; కొండవీటి, రాజమహేంద్రి శాఖల బలిజలు కన్నడిగులైనారు. ఇప్పటి ఉత్తర కర్నాటకలో వీళ్ల జనాభా మాత్రమే 40 శాతం వరకూ ఉంటుంది. తెలుగులోలాగా కన్నడంలో 'టి' అనే ఉపవిభక్తి లేదు. పాకనాడు = పాకనాటి; కొండవీడు = కొండవీటి వంటి మార్పులు కన్నడంలో జరగవు. ఉపవిభక్తితో సహా తెలుగుపేర్లను తమ శాఖల్లో నింపుకొన్న కన్నడిగులు వీళ్లు. 16వ శతాబ్దంలో బళ్ళారికి వచ్చింది వీళ్లే. మా సొంతవూరైన జోళదరాశిలో, దొడ్డనగౌడ అనే ఆయన ఉండేవారు. నాటకరంగంలో పేరుమోసినవారు. కన్నడిగులు వారి కన్నడ నాటకరంగం గొప్పతనం గురించి మాట్లాడేటప్పుడు, దొడ్డనగౌడగారి పేరు లేకుండా ఉండదు. ఆయన, లింగదీక్ష తీసుకొని వీరశైవులుగా మారిన మోటాటి శాఖకు చెందిన రెడ్డి. ఇటువంటి వారు ఎందరో ఉన్నారు. (ఇంకా ఇంటిస్థాయిలో తెలుగును నిలబెట్టుకొన్న వాళ్లు కూడా నాకు తెలిసి పదిహేను ఇరవై శాతం వరకూ ఉన్నారు.

సు : భాషను వద్దనుకొన్నా కులాన్ని గుర్తుంచుకోవడం వింతగా ఉంది కదండీ!

జో : వింత కాదు దౌర్భాగ్యం. వాళ్లకు వేమన కావాలి. హేమారెడ్డి మల్లమ్మ కావాలి. వేమన పేరుతో సభలు జరుపుతారు. హేమారెడ్డి మల్లమ్మకు పూజలు కొలువులు చేస్తారు. మల్లమ్మపండుగ రోజును ఉత్తర కర్నాటకలో అధికారిక సెలవు రోజుగా ప్రభుత్వం ప్రకటించింది. కన్నడంలో వేమన, మల్లమ్మ పుస్తకాలను అచ్చువేసి, ఊరూరా ఇంటింటా పంచుతారు. ఇదంతా వాళ్ల రెడ్డి ఉనికిని నిలబెట్టుకోడానికి చేస్తున్నారు. మంచిదే, ఉనికికోసం, ఉనికిని నిలబెట్టుకోవడం కోసం పాటుపడడం మంచిదే. 'అయితే మీకు

రెడ్డితనం గుర్తున్నట్లు తెలుగుతనం ఎందుకు గుర్తులేదు' అని అడుగుతుంటాను నేను. బదులు మాట్లాడరు.

సు : బసవేశ్వరుని కాలం నాటికే వీరశైవులకు కన్నడ వీరాభిమానం ఉండేదంటారా?

జో : ఆయన మహనీయుడు. సమాజంలోని అసమానతలను కూలదోయాలని బతుకంతా పాటుపడినవాడు. వీరశైవులకు ఈ కన్నడ వీరాభిమానం తరువాతి కాలంలో ఎప్పుడో మొదలయి ఉండాలి. అసలు బసవేశ్వరుని పెద్దలు ఆంధ్ర ప్రాంతంలోని కమ్మనాటి నుండి వలస వచ్చిన వారుగా చెప్తారు. బసవేశ్వరుని బోధలను తలకెత్తుకొని ఆయన అనుయాయులు నాలుగు మూలలూ తిరిగినారు. ఇప్పటి తమిళనాడులోని (ఒక్క హోసూరు ప్రాంతం తప్ప) వీరశైవులు అందరూ తెలుగువారే. మహారాష్ట్రలో కూడా తెలుగు వీరశైవులు ఉన్నారు. బసవని కాలంలో అంటే 12వ శతాబ్దంలోనే వీర శైవాన్ని ప్రచారం చేసింది తెలుగువారే అనడానికి ఈ ఆనవాళ్లు చాలు అనుకొంటాను. అట్లాంటప్పుడు ఇప్పటి ఉత్తర కర్నాటకలో తెలుగు వీర శైవులు లేకుండడం ఏమిటి? **బసవేశ్వరుడు తన వచనాలను కన్నడంలో నుడివినారు. దాంతో అది వీరశైవులకు మత భాష అయింది. తరువాతి కాలంలో కర్నాటకలోని వీర శైవులకు కన్నడమే ఇంటి నుడిగా మారి ఉంటుంది. వీరశైవులు తమ మత వీరత్వాన్ని ఇతర భాషల మీద చూపడం అనేది బసవని తరువాత కొన్ని వందల ఏండ్లకు మొదలయి ఉండవచ్చు.**

సు : మనం బళ్ళారి చరిత్ర దగ్గరకు వద్దామండి. విజయనగర సామ్రాజ్య పతనం, వీరశైవుల వలసల తరువాత ఏం జరిగింది ?

జో: తరువాత హండే వంశపు బోయ (వాల్మీకి) నాయకుల పాలన కిందకు వచ్చింది బళ్ళారి ప్రాంతం. ఇప్పటి కర్నాటక ప్రాంతాన్ని ఏలిన బోయ నాయకులు అందరూ తెలుగువాళ్లే. కానీ ఒక్క సురపురం వాళ్లు తప్ప మిగిలిన వాళ్లంతా కన్నడిగులుగానే నడుచుకొన్నారు. వీరి కాలంలో వీరశైవులూ మాధ్యులూ వ్యాపార ఉద్యోగ రంగాలలో కుదురుకొంటూ వచ్చినారు. ఆ తరువాత బళ్ళారి నిజాం పాలన క్రిందకు పోయి, వారి నుంచి దత్త మండలం పేరిట ఆంగ్లేయుల చేతికి వచ్చింది. తెల్లవారి పాలనలో కూడా కన్నడిగులైన వీరశైవులూ మాధ్వులూ ఉద్యోగ వ్యాపారాల్లో బలపడినారు. కరణీకం మొత్తం కన్నడిగుల పరమైంది. దాంతో వాళ్లు ఏది రాస్తే అదే నమోదు అయింది. తెలుగు పల్లెల పేర్లన్నీ కన్నడంలోనికి మారినాయి. పెంచలపాడు హంచన హాళు అయింది, జొన్నలరాశి జోళదరాశి అయింది. ఇట్లా ఎన్నో తెలుగు పేర్లు కన్నడ పేర్లుగానే రికార్డులకు ఎక్కినాయి. 19వ శతాబ్దపు చివర అంటే 1870 లేదా 80 వ దశకంలో బళ్ళారి జిల్లాలో 27 తాలూకాలు ఉండేవి. రాయలసీమలో అప్పుడు కడప, బళ్ళారి రెండే జిల్లాలు. 1900 ప్రాంతంలో జిల్లాలను పునర్విభజించినారు ఆంగ్లేయులు. అప్పుడు తూర్పు తాలూకాలన్నీ అనంతపురం జిల్లాగా మారి, బళ్ళారి 17 తాలూకాలతో మిగిలింది. 1930ల నాటికి 12 తాలూకాలూ, స్వతంత్రం వచ్చేటప్పటికి 9 తాలూకాల బళ్ళారి జిల్లా నిలిచింది. తూరుపు వైపునున్న పూర్తి తెలుగుతో నిండిన తాలూకాల్ని అన్నిటినీ బళ్ళారి చేజార్చుకొనింది. మిగిలిన 9 తాలూకాలలో ఆదోని, ఆలూరు, రాయదుర్గంలలో 80 శాతం తెలుగువారుంటే, బళ్లారి, సిరుగుప్ప, హొసపేట తాలూకాలలో 60శాతం ఉండేవారు. మిగిలిన కూడ్లిగి, కొట్టూరు, హరపన హళ్ళి తాలూకాలలో కన్నడిగులు ఎక్కువ. బళ్ళారి నుంచి తూర్పు తాలూకాలు విడిపోవడం తెలుగుకు పెద్ద దెబ్బ. మరో పెద్ద దెబ్బ టేకూరు సుబ్రహ్మణ్యం వలన తగిలింది. ఈయన తెలుగు స్మార్త బ్రాహ్మణుడు. బాగా చదువుకొన్నవాడు. నెహ్రూకు దగ్గరి స్నేహితుడు. ఆ రోజుల్లో రాజకీయంగా బలమైన నాయకుడు. 1930ల నాటికి ఈయనను ఎదిరిస్తూ హాలరివి సీతారామరెడ్డివంటి నాయకులు ఎదిగినారు. వాళ్లంతా కన్నడిగులైన వీరశైవరెడ్లు. సీతారామరెడ్డి కూడా వీర శైవరెడ్డే. నిజానికి ఆయన పాకనాటి రెడ్డి. అంటే ఏ కాలంలోనో నెల్లూరు ప్రాంతం నుంచి వలస వచ్చిన రెడ్లు. వీళ్ల తాకిడిని ఎదురుకోవడం కోసం సుబ్రహ్మణ్యంగారు కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడి ఒప్పించి, బళ్ళారి కాంగ్రెస్‌ను విభజింపజేసినారు. ఆలూరు, ఆదోని, రాయదుర్గం తాలూకాలను మాత్రం ఆంధ్ర కాంగ్రెస్ పరిధిలో ఉంచి, మిగిలిన ఆరు తాలూకాలనూ కర్నాటక కాంగ్రెస్ పరిధి కిందకు చేర్చేసినారు. తెలుగువాళ్లు ఎక్కువగా ఉన్న బళ్ళారి, సిరుగుప్ప, హొసపేట తాలూకాలు కూడా కర్నాటక కాంగ్రెస్ పరిధిలోకి వెళ్లిపోయినాయి. తెలుగువాళ్లు ఎవరూ ఇది అన్యాయమని గొంతులు ఎత్తలేదు. అందుకు కూడా కారణముంది. అప్పుడు బళ్ళారి ప్రాంతంలోని తెలుగువారికి చదువు తక్కువ. తెలుగు బ్రాహ్మణులు తప్ప మిగిలినవారు చదువుకు దూరం. కన్నడం వాళ్లలో అట్ల కాదు, మాధ్వ బ్రాహ్మణులూ వీరశైవ రెడ్లూ కూడా చదువుకొన్నవారే. పైగా వారంతా హండేరాజుల కాలంనుండీ కరణాలుగా మంత్రులుగా ఉంటూ రాజకీయాలను బాగా ఎరిగినవారు.

సు : కరణీకాలు కూడా కన్నడిగులు చేతుల్లో ఉండినాయి అంటే, పరిపాలనా భాషగా కూడా కన్నడం చోటు దక్కించుకొన్నట్లే కదా!

జో : అవును. విజయనగర పతనం తరువాత, వీరశైవుల ప్రాపుతో బళ్ళారిలో కన్నడానికి పాలనాభాష, మతభాష హోదా దక్కింది. కన్నడ భాషాభిమానము వీరశైవుల నరనరాల్లోనూ నిండి ఉంటుంది. మా చిన్నప్పుడు మా పల్లెలో తెలుగువాళ్లమంతా కూడా భజనపాటలను కన్నడంలోనే పాడేవాళ్లం. బళ్ళారి ప్రాంతంలో కన్నడం పల్లెపల్లెకూ దూరింది. అయినా తెలుగు ప్రాభవం తగ్గలేదు. బళ్ళారి పల్లెలలో కూడా సర్కారు బడులు మొదలయినాక, ఈ ప్రాంతంలో నూటికి తొంభై తెలుగుబడులూ పది కన్నడం బడులూ ఉండేవి. అంటే తెలుగువాళ్ల సంఖ్య అంత పెద్దది.

సు : మళ్లా చరిత్రలోకి వెళదామా ?

జో : మొదటి రెండు దెబ్బలకు మించిన మరొక దెబ్బ బళ్ళారికి తగిలింది. అదే ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమం. నా దృష్టిలో, నాలాంటి

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పులే



చాలామంది దృష్టిలో అదొక తప్పు ఉద్యమం. తెలుగువాళ్లు చేయకూడని ఉద్యమం. దక్షిణ భారతమంతా పరచుకొని ఉన్న తెలుగువాళ్లకు ఒక మూలనున్న కొంత ప్రాంతమే మాతృభూమి ఎట్లా అవుతుంది? అప్పటి ఆంధ్రోద్యమాన్ని రాయలసీమ వాళ్ళు, ముఖ్యంగా బళ్ళారిప్రాంత తెలుగువాళ్లు వ్యతిరేకించినారు. ఆంధ్రనాయకుల చెవులకు ఇవి ఎక్కలేదు. ఉద్యమం చేసినారు. ఒక అమాయకపు మహనీయుడు పొట్టి శ్రీరాములుగారు చెన్నపట్నం కోసం నిరాహారదీక్ష చేసి చనిపోయినారు. ఆంధ్రరాష్ట్రం వచ్చేసింది. ఏ ఆంధ్ర వచ్చింది? వివాదాలున్నాయి అన్న సాకుతో బళ్ళారి, చెన్నపట్నం, హోసూరు తావులు లేని ఆంధ్ర వచ్చింది. ఆంధ్ర కాంగ్రెస్ పరిధిలో ఉండిన ఆలూరు, ఆదోని, రాయదుర్గం తాలూకాలు మాత్రమే ఆంధ్రకు చేరినాయి. తెలుగువాళ్లే అధిక సంఖ్యాకులుగా ఉన్న బళ్ళారి, సిరుగుప్ప, హొసపేట తాలూకాలు. మైసూరు రాష్ట్రంలోకి చేరి పోయినాయి.

సు : బళ్ళారి ఏ రాష్ట్ర పరిధిలో ఉండాలనే దాని మీద ఎన్నికలు కూడా జరిగినాయంట కదా?

జో : జరిగినాయి. ఎన్నికల్లో ఆంధ్ర తరపున పోటీ చేసింది ఒక కమ్మకులం ఆయన. కర్నాటక తరపున పోటీ చేసింది రెడ్డి కులం ఆయన. ఇప్పటికీ ఆంధ్ర ప్రాంతంలో దీనిని కమ్మా రెడ్డి తగవుగా చెప్పుకొంటారు. అది నిజం కాదు. హేలరివి సీతారామరెడ్డి, నీలం సంజీవరెడ్డి కన్నా పలుకుబడిగల నాయకుడు. బళ్ళారి ఆంధ్రలో చేరితే సీతారామరెడ్డి పెద్ద నాయకుడు అవుతాడని సంజీవరెడ్డికి జంకు. అందుకే లోపాయికారిగా ఎన్నికల్లో కర్నాటక వాదనకి మద్దతు ఇచ్చాడని అంటారు. బళ్ళారి కావాలా కోలారు కావాలా అని నెహ్రూ అడిగితే సంజీవరెడ్డి కోలారును అడిగినాడు. మృత్యుంజయశాస్త్రి బళ్ళారిని అడిగినాడు. ఎన్నికలకు ముందు జరిగింది ఇది. తరిమెల నాగిరెడ్డి మదరాసు శాసనసభలో కోలారుతోపాటు బెంగుళూరు కూడా ఆంధ్రలో కలవాలని గొంతెత్తినాడు. బ్రిటిష్ ఇండియాలో కాకుండా మైసూరురాజ్య పరిధిలో ఉండేది కోలారు. మైసూరు రాజుకు కోలారును ఆంధ్రకు ఇవ్వడం ఇష్టం లేదు. కోలారులోని కాంగ్రెస్ నాయకుడు కేశంపల్లి చెంగలరాయరెడ్డిని దువ్వినాడు. మైసూరు రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేస్తానన్నాడు. దాంతో చెంగలరాయరెడ్డి రంగంలోకి దిగి కోలారు మైసూరు రాష్ట్రంలోనే ఉండాలని పట్టుబట్టి సాధించుకొన్నారు. ఆ రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రి అయినాడు. కర్ణుడి చావుకి కారణాలు ఎన్నో అన్నట్లు, తెలుగువాళ్లు ఎక్కువగా ఉండిన, బళ్ళారి, సిరుగుప్ప, హొసపేట తాలూకాలలో కన్నడ అభ్యర్థికి కొన్ని వందల ఓట్లు మాత్రం ఆధిక్యత వచ్చింది. ముస్లింలు కూడా తెలుగువాళ్లే ఉండిన బళ్ళారిలో తెలుగు అభ్యర్థికి తక్కువ ఓట్లు రావడానికి కారణాలు ఉన్నాయి. పల్లెల్లోని చదువురాని బడుగు తెలుగువారంతా, మా రెడ్డిగారు చెప్పినమాట వినాల కదా అనుకొని, వీరశైవులు చెప్పిన ప్రకారం ఓట్లు వేసినారు. బళ్ళారి నగరంలోని ఒడ్డెర బస్తీలోని ఓట్లు గల్లంతయినాయి. ఒడ్డెరలంతా తెలుగువాళ్లే. ఆ బ్యాలెట్ పేపర్లు కొంతకాలం తరువాత చెత్తకుప్పలో బయటపడినాయి అని చూసినవారు చెప్పుకొంటారు. ఇన్ని ఎత్తుగడలూ ఇంత అరాచకమూ చేసినా, ఆ అరాచకానికి కొందరు తెలుగునాయకులు సహకరించినా, కన్నడిగులకు వచ్చిన ఆధిక్యత మూడు నాలుగు వందల ఓట్లు అంతే.

సు : మీ తండ్రిగారైన గుత్తి నారాయణరెడ్డిగారు కూడా అప్పుడు ఉద్యమాలలో పాల్గొన్నారట కదా, ఆ వివరాలను చెప్పండి.

జో : మా నాయన పుట్టి పెరిగింది జోళదరాశిలోనే. ఆయనకు తెలుగంటే వల్లమాలిన అభిమానం. అట్లని ఆయన కన్నడం ద్వేషికాదు. ఆయనకు నాటకాలంటే కూడా ప్రీతి ఎక్కువ. మావూరు నాటకరంగానికి పేరు పొందినది కదా. కన్నడ నాటకరంగ ప్రముఖులలో ఒకరైన దొడ్డనగౌడది మా వూరే. వాళ్లు కన్నడం మాట్లాడే మోటాటి రెడ్లు. మేము తెలుగు మాట్లాడే మోటాటి రెడ్లము. వాళ్లు మా నాయనను ఒకసారి అవమానించినారు. వాళ్ల జట్టుకు దూరంగా పెట్టినారు. కన్నడ రెడ్ల దగ్గర నుంచి ఇటువంటి ఒకటి రెండు అవమానాలను ఎదుర్కొన్న మా నాయనకు తెలుగుమీద మరింత అభిమానం పెరిగింది. అదే సమయంలో ఆంధ్రోద్యమం సాగుతూ ఉంది. ఆంధ్రనాయకులు ఎవరైనా బళ్ళారివైపుకు వస్తే చాలు, కన్నడిగులు పెద్ద ఎత్తున వాళ్లను అడ్డగించి గోల చేస్తుండేవారు. మా నాయన జోళదరాశిలోనూ చుట్టుపక్కల గ్రామాలలోనూ ఆంధ్రోద్యమాన్ని చాటుతుండేవారు. ఒకసారి సంజీవరెడ్డిగారు రైలులో బళ్ళారికి వస్తున్నారన్న విషయం బళ్ళారివాళ్లకు తెలిసింది. కన్నడిగులంతా రైలు నిలయానికి వెళ్లి పెద్ద ఎత్తున సంజీవరెడ్డికి నిరసన తెలియచేయాలనుకొన్నారు. ఈ సంగతి, పొలంల

పనిచేసుకొంటూ ఉండిన మా నాయనకు తెలిసింది. పనిని అక్కడనే వదిలేసి పై గుడ్డను భుజం మీద వేసుకొని ఒక్క పరుగున బళ్ళారి రైలు నిలయానికి చేరుకొన్నాడు. ఆ స్టేషను మాస్టరు ఒక ముస్లిం. తెలుగు అభిమాని మాత్రమే కాదు, మా నాయనకు మిత్రుడు కూడా. ఆయన మా నాయనను చూసి 'రెడ్డీ ఎందుకొచ్చినావయ్యా, వాళ్లది పెద్ద గుంపు, నువ్వు ఒక్కడివి, వాళ్ళతో గొడవపడి ఏమి చేయగలవు, తిరిగిపో' అన్నాడు. మా నాయన ఒప్పుకోలేదు. ఆంధ్రనాయకులకు జై కొట్టి తీరుతాను అని పట్టు పట్టినాడు. ఆ స్టేషనుమాస్టరు తెలివిగా, సంజీవరెడ్డి ఎక్కిన పెట్టె చివరలో ఉందని కన్నడంవాళ్లకు చెప్పి, వాళ్లను చివరకు పోయేటట్లు చేసినాడు. నిజానికి సంజీవరెడ్డి ఎక్కున్న పెట్టె ముందువైపు ఉంటుంది. రైలు రావడం, ముందున్న మా నాయన సంజీవరెడ్డిని కలిసి, పెద్ద గొంతుతో తెలుగులో జై కొట్టడం, కన్నడిగులు కలమేలుకొనే సరికే బండి కదిలి పోవడం జరిగిపోయింది. బతికినంత కాలమూ తెలుగును కలవరించి ఆ తెలుగు ప్రేమను నాకు అందించి పోయినాడు మా నాయన.

సు : ములకా గోవిందరెడ్డిగారు కూడా బళ్ళారి ఆంధ్రలో కలవాలని పోరాడినారంట కదా?

జో : గోవిందరెడ్డిగారిది బళ్ళారి కాదు. చిత్రదుర్గం జిల్లా వారిది. వెలనాటి రెడ్ల శాఖకు చెందినవారు. తెలుగు అభిమాని. చిత్రదుర్గం జిల్లా కూడా కోలారు లాగా మైసూరు రాజ్యంలో భాగంగా ఉండేది. గోవిందరెడ్డిగారు మొదట చిత్రదుర్గం జిల్లాను ఆంధ్రలో కలపాలని ఉద్యమించినారు. అయితే మైసూరు రాజ్యంలో ఉండిపోయి, కన్నడాన్నే చదువుకొంటూ ఉండి పోవడం వలన, స్థానిక తెలుగువారి నుండి ఆయనకు మద్దతు కరువయింది. స్థానికంగా ఆ జిల్లాలో రైతులు మూడువంతుల మంది తెలుగువాళ్లే. కమ్మరెడ్లు ఎక్కువగా ఉన్న ప్రాంతం చిత్రదుర్గం జిల్లా. అంటే కమ్మవాళ్లు అక్కడ రెడ్డి అనే పట్టం పెట్టుకొంటారు. వాళ్లను కమ్మరెడ్లు అంటారు, మిగిలిన మోటాటి, వెలనాటి, పాకనాటి, కొణిదె రెడ్లను కాపురెడ్లు అంటారు. ఈ రైతులంతా పట్టనట్లు ఉండిపోయినారు. బళ్ళారి గురించో కోలారు గురించో అప్పుడప్పుడూ అన్నా గొంతులను ఎత్తే ఆంధ్రనాయకులకు చిత్రదుర్గం ఊసే పట్టలేదు. దాంతో గోవిందరెడ్డిగారు తమ ఉద్యమాన్ని బళ్ళారికి మార్చినారు. వట్టి భాష ఆధారంగా పోరాడితే లాభం లేదని, 'మైసూరు రాజ్యం తీవ్ర కరువు ప్రాంతం, అభివృద్ధి తక్కువ, ఆంధ్రలో చేరితే బళ్ళారి వాళ్లం విద్య, ఉద్యోగ, వ్యవసాయ రంగాలలో ముందడుగులు వేస్తాం' అని ప్రచారం చేసేవాడు. ఆయనదీ విఫలయత్నమే అయింది. ఇటువంటివారు ఎందరో ఉన్నారు. ఆంధ్రోద్యమ చరిత్ర పుటలలో వీళ్ల త్యాగానికి రవంత కూడా చోటు దక్కలేదు. గోవిందరెడ్డిగారు పదేళ్ల క్రితం వరకూ బ్రతికే ఉండినారు. అప్పుడే మీవంటివారు ఎవరైనా ఆయనను కదిలించి ఉండే అప్పటి ఉద్యమ వివరాలను మరిన్ని చెప్పుండేవారేమో! గోవిందరెడ్డిగారి మనుమరాలు సంధ్యారెడ్డి, ఇప్పుడు కన్నడంలో పేరు గడించిన రచయిత్రి. గోవిందరెడ్డిగారి మాట నిజమయింది. కర్నాటకలో చేరిన బళ్ళారి ఎంతో వెనకబడింది. ఇక్కడ కన్నడం వాళ్లే ఎదగలేదు, పైగా తెలివి తేటలతో నెట్టుకొస్తున్న తెలుగువారిపైన జులుం. 'మేము పైకి రావడం లేదు, మీరెట్లా వస్తారు' అంటూ వివక్ష చూపించడం. ఎవడో ఒక దొంగ అన్నాడంట 'దేశానికి స్వతంత్రం వచ్చింది. నా దేశంలో నేను దొంగిలించుకొంటే అడగడానికి నువ్వెవడివోయ్' అని. అట్ల కన్నడరాజ్యం అయిపోయిన బళ్ళారిలో తెలుగుగొంతులు మూగపోయినాయి.

సు : అవునండీ, తెలంగాణాంధ్రలకు బయటి తెలుగువారిని పట్టించుకోకపోవడం దారుణమే.

జో : అప్పుడే కాదు. ఇప్పటికీ అంతే. రాజకీయనాయకులను పక్కన పెడదాం. మేధావులూ మీడియావాళ్లు కూడా అంతే. తెలుగు, తెలుగుదనం, తెలుగువాళ్లు అంటే తెలంగాణా ఆంధ్ర అనే రెండు రాష్ట్రాలే. ఇటీవల కోలాచలం శ్రీనివాస్ అనే వకీలు ఒకరు బళ్ళారి విషయాన్నంతా సేకరించి 89 పుటల పుస్తకంగా వేసినారు. విపరీతమైన తెలుగు అభిమానం ఆయనకు. ఇంతకీ ఈయన ఎవరో కాదు. కోలాచలం వెంకటరామన్నగారి మునిమనుమడు. వెంకటరామన్న పేరు ఇప్పుడు దాదాపు ఎవరికీ తెలియక పోవచ్చు. 19వ శతాబ్దపు చివర లండన్ మహానగరంలో హ్యూమ్ అధ్యక్షతన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌ను స్థాపించినప్పుడు, తెలుగు ప్రాంతాన్ని ప్రతినిధిస్తూ ఇద్దరు లండన్‌కు పోయినారు. ఒకరు గుత్తి కేశవ పిళ్ళై, ఇంకొకరు కోలాచలం వెంకట్రామన్న. ఇద్దరూ రాయలసీమ వాసులే. ఇద్దరూ అప్పటి బళ్ళారి జిల్లా వారే. కోలాచలం వారిది బళ్ళారి జిల్లాలోని పందిపాడు అనే ఊరు. అదే సంస్కృతంలో కోలాచలం అయింది. తరువాత దానిని హందిహాళుగా మార్చినారు. మొన్నటివరకూ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా గా ఉండేవారు చూడండి, లక్ష్మీనారాయణ దత్తుగారు, ఆయనది కూడా పందిపాడే. మేము ఈడిగవాళ్లము, తెలుగువాళ్లము అని వారే చాలా సభలలో చెప్పుకొన్నారు ఆయన. అట్లాంటివారిని కూడా తెలుగువాళ్లగా గుర్తించలేదు తెలుగు మేధావులు.

సు : బళ్ళారి కర్నాటకలో చేరడం వలన తెలుగుజాతి కోల్పోయింది ఏమిటి?

జో : రెండు వైపులా పెద్ద నష్టం జరిగింది. మా వైపు అంటే బళ్ళారిలో ఒకప్పుడు వందల తెలుగుబడులు ఉండేవి. ఇప్పుడు పదికిమించి లేవు. తెలుగుసభలు నడుపుకోవాలన్నా, తెలుగులో ఉపన్యసించాలన్నా, తెలుగు బోర్డులు బేనర్లు పెట్టుకోవాలన్నా తెలుగువాళ్లు భయంతో పంచెలు తడుపుకొనే పరిస్థితి. అందరూ అనుకొనేది ఏమిటంటే కన్నడిగులూ మరాఠీలూ కొట్టుకొంటారు, కానీ కన్నడ – తెలుగు ప్రజలు సఖ్యంగా ఉంటారు అని. మాది దొర – తొత్తు సంబంధం. ఊరకుండక ఊరేగుతామా! బళ్ళారి కర్నాటకకు పోవడం వలన, అటువైపు అంటే రాయలసీమకు తీరని అన్యాయం జరిగింది. వాళ్లకు బతుకే పోయింది. రాయలసీమకు తల బళ్ళారి అయితే ; అనంతపురం, కడప, కర్నూలులు మొండెం. తలలేని మొండెం అయింది రాయలసీమ. బళ్ళారి రాయలసీమలో భాగంగా ఉండి ఉంటే, రాయలసీమలో – ముఖ్యంగా అనంతపురంలో కరువు ఇంతగా విలయతాండవం చేసి ఉండేది కాదు. తుంగభద్ర జలాలు పారి ఆరుతడి పంటలన్నా పండి ఉండేవి. బళ్ళారి పోవడంతో రాయలసీమకు ఒక సాంస్కృతిక రాజధాని

పోయింది. తెలుగుభాషను తలకెత్తుకొని మోసి ఉద్దీపించిన మహాసామ్రాజ్యపు రాజధాని నగరం హంపి, కన్నడ వైభవానికి ప్రతీక అయిపోయింది. ఇంతకన్నా ఇంకేమి కోల్పోవాలి చెప్పండి.

సు : బళ్ళారిలో తెలుగుకు పూర్వవైభవం వస్తుందంటారా? సాధ్యమేనా?

జో: మనిషికి సాధ్యం కాని పని ఉందా? చిత్తశుద్ధితో పూనుకోవాలి అంతే. తెలుగుబడులు పెరగాలి. ఒక పాఠ్యాంశంగా అయినా తెలుగును ప్రతి తెలుగువాడూ చదవాలి. తెలంగాణా ఆంధ్ర ప్రభుత్వాలు బళ్ళారి తెలుగువెలుగు కోసం నడుము కట్టుకోవాలి. కన్నడ ప్రభుత్వాలతో గట్టిగా మాట్లాడాలి. పాలమూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలలో ఎన్నో కన్నడ బడులను మేము నడుపుతున్నాము, మీరెందుకు తెలుగుభాషను చిన్నచూపు చూస్తున్నారు అని నిలదీయాలి. తెలుగు మేధావులూ మీడియావారూ మా తెలుగు సమస్యలను ఎలుగెత్తి చాటాలి. తెలుగు ప్రభుత్వాలు ఏడాదికొక సాంస్కృతిక కార్యక్రమాన్ని బళ్ళారిలో జరపాలి. ఇటువంటి పనులు జరుగుతూ ఉంటే మరలా పూర్వ వైభవం వచ్చి తీరుతుంది.

సు : మీకు కృష్ణదేవరాయలు అంటే పిచ్చి అభిమానం. ఏటేటా రాయలవారి పేరిట సాహితీ కార్యక్రమాలు చేస్తుంటారు. ఇంటి గోడమీద నిలువెత్తు రాయలవారి బొమ్మను నిలుపుకొన్నారు. మీరే ఈ ప్రశ్నకు సరైన జవాబును ఇవ్వగలరు. చెప్పండి, రాయలవారు కన్నడిగుడా తుళువాడా?

జో : నూటికి నూరుపాళ్లు తెలుగువాడు. ఆంధ్రరాష్ట్రంలోని కొందరు పెద్దలు రాయలవారి మూలం గురించి మాట్లాడుతూ, ఆయన కన్నడిగుడో తౌలవుడో అయి ఉండాలని చెప్పడం ఆనవాయితీ అయింది. ఆయన పాలననూ సాహిత్యాన్నీ పొగుడుతూనే, 'ఆయన తెలుగువాడు కాకపోయినా' అనే సన్నాయి నొక్కులు నొక్కుతుంటారు. రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రులూ మంత్రులూ, జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకొన్న మహాపండితులూ కూడా ఇట్లాంటి అపోహను వెదజల్లుతూనే ఉన్నారు. రాయలవారి ఇంటి పేరు 'సంపెట'. ఇది అచ్చమైన తెలుగు పదం. రాయలవారి ఆస్థానంలో ఎవరికీ దక్కనంత గౌరవం తెలుగు కవులకు దక్కింది. రాయల తెలుగు భాషాభిమానం జగమెరిగిన సత్యం. ఆయన తెలుగులో ఆముక్తమాల్యద కృతిని రాయడం, పెద్దనను గౌరవించి పల్లకి బోయిగా మారడం, ఆయన ప్రతినిధులుగా రాజ్యమంతటా తెలుగువారినే నియమించడం, ఆయన సామంతులూ వారసులూ తెలుగు సాహిత్యాన్నే అభిమానించి పోషించడం, వీటన్నిటిలోను రాయలవారి తెలుగుతనం గోచరిస్తుంది. ఇతర భాషీయుడు అనడానికి సాక్ష్యమే లేదు. స్నానసమయంలో తిక్కనభారతంలోని విదురనీతి, చాణుక్యనీతి మొదలైన తెలుగు పద్యాలను వినిపించుకొనేవాడనీ, యుద్ధ సమయాలలో కూడా సాయంకాలాలు కవులతో తెలుగు సాహిత్యగోష్టిలో పాల్గొనే వాడనీ తెలుస్తున్నది కదా! కొలువు కూటంలోనూ రెండు అంతఃపురాలలోనూ తెలుగే వినిపించేదనీ, ఒక అంతఃపురంలో మాత్రం కన్నడం ఎక్కువగా వినిపించేదనీ పోర్చుగీసు యాత్రికుడు డోన్ ఎరియస్ రాసినారంటే, ఇంకా రాయలవారి మాతృభాష తెలుగే అనడానికి ఎందుకు సంకోచించాలి.

సు : మీ రచనల గురించి చెప్పండి. అట్లాగే వృత్తి ప్రవృత్తుల గురించి కూడా.

జో :శ్రీకృష్ణరాయము, వరమాల – జయమాల, రైతు రాయలు, సిరి సునీత అనే నాలుగు పద్యకావ్యాలూ శరణుడు బసవడు అనే వ్యాససంపుటి నా స్వీయ రచనలు. ఇవి కాక తెలుగు నుండి కన్నడానికి ఆరు అనువాదాలూ కన్నడం నుండి తెలుగుకు పదిహేను అనువాదాలనూ చేసినాను. శ్రీకృష్ణ దేవరాయల వ్యక్తిత్వం గురించి ఇరవైకి పైగా, బసవతత్వం మీద పదిహేను వరకూ ప్రసంగాలూ పత్ర సమర్పణలూ చేసినాను. నటించడం నాకు ఇష్టమైన మరొక వ్యాపకం. పౌరాణిక, చారిత్రక పాత్రల ఏకపాత్రాభినయాలలో పాల్గొన్న ప్రతిసారి (11సార్లు) మొదటి బహుమతిని అందుకొన్నాను. కన్నడ సాహిత్య నాటక అకాడెమీ వారి తెలుగు బసవన్న నాటకంలో బసవన్న పాత్రకు నటనా పురస్కారాన్ని అందుకొన్నాను. పేరు కలిగిన తెలుగు కన్నడ సంస్థల వారి నుండి కొన్ని పురస్కారాలను అందుకొన్నాను. తెలుగు రాష్ట్రాలకు ఆవలి తెలుగు ప్రతిభావంతులకు ప్రతిభా పురస్కారాన్ని ప్రతి ఏటా మార్చి / ఏప్రిల్ నెలల్లో ఇస్తుంటాను. ఆగస్టు 7న శ్రీకృష్ణదేవరాయుల పట్టాభిషేక ఉత్సవాన్ని జరుపుతుంటాను. తెలుగు, కన్నడ, తమిళ, సంస్కృత భాషలలో రాయల గురించి కృషి చేసిన వారిని సత్కరిస్తుంటాను. ఇవన్నీ గుత్తి నారాయణరెడ్డి సాహితీ పీఠం తరపున చేస్తుంటాను. ఇక వృత్తి అంటారా, మెకానికల్ ఇంజనీరింగ్ చదివి, అనేక పరిశ్రమలలో ఇంజనీరుగా, జనరల్ మేనేజరుగా పనిచేసినాను.

సు : బళ్ళారి జిల్లా రచయితల సంఘం (బ.రసం.) ప్రారంభం అవుతున్న సందర్భంగా మీ స్పందనను తెలియచేయండి.

జో : చాలా సంతోషంగా ఉంది. ఈ విషయంగా స.వెం.రమేశ్ చాన్నాళ్లుగా నా వెంట పడుతూ వచ్చినాడు. ఇప్పటికి ఒక కొలిక్కి వచ్చింది. చదువు అనేది తెలుగులో లేకపోతే తెలుగు నిలబడదు. చదువు అంటే ఊరికే అక్షరాలను నేర్చుకోవడం కాదు. కన్నడాన్నే చదివినవాళ్ళు కూడా కూడుకొని కూడుకొని తెలుగును చదివేస్తారు. సినిమాపోస్టర్ల మీదనో బస్సుల మీదనో ఉన్న నాలుగు అక్షరాలను చదివేయడం కాదు చదువంటే. తెలుగు నాగరికభాష. దీనికి వెయ్యేండ్లకు పైబడిన సాహితీ చరిత్ర ఉంది. దానిని చదవడం, అర్థం చేసుకోవడం, అనుభవించడం, సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఆధునికతను అందిపుచ్చుకోవడం ఇదే నాగరిక సమాజపు చదువంటే. బళ్ళారిలో పద్యకావ్యాలను రాస్తున్న కవులు చాలామందే ఉన్నారు. కానీ కథ, నవల, వ్యాసం వంటి ఆధునిక సాహితీ ప్రక్రియలలో రచనలు చేస్తున్నవారు ఒకరిద్దరికంటే ఎక్కువమంది లేరు. బ.ర.సం. వారు తయారు చేసుకోవాలి. తమ ఉనికిని ఆధునిక ప్రక్రియలలో రచించి చాటే కొత్తతరం రచయితలను వెలికి తేవాలి. ఈ పనిని ఇప్పటి తమిళనాటి తెలుగువారు మొదలు పెట్టి విజయవంతంగా చేస్తున్నారు. బళ్ళారిలో కూడా మొదలవుతుందని ఆశిద్దాం. సెలవు.

డా॥పి. శివరామకృష్ణ (శక్తి)
94414 27977

తలోదారిలో సాహిత్యం–సమాజం–సంఘాలు–సాధికారిత

నూతన ప్రజాస్వామిక విప్లవం, పీడిత జన విముక్తి, రాజ్యాధికారం, సాహిత్యం– సామాజిక స్పృహ, శాస్త్ర విజ్ఞానాల ఆధునికీకరణ అంటూ 'ఎవరికి తెలియని ఏవో పాటలు పాడే' బుద్ధిజీవులు తమ పాత్రను నిర్వచించుకోవలసిన అవసరం వచ్చింది.

1. పండిట్స్ ట్రైనింగ్‌కు వచ్చిన నాటినుండి రాజమహేంద్రి సాంస్కృతిక వాతావరణంతో నాకు పరిచయం.కానీ జిల్లాలో మన్య ప్రాంతానికి ఉపాధ్యాయుడుగా వెళ్ళిన తరువాత, ఆ గిరిజన పిల్లల మీద మనచదువులు రుద్దటం, నగర వాసులకు ఆ అదోజగత్ సహోదరులమీద ఏమి ఆసక్తి లేకపోగా అవాకులు చెవాకులు వాగడం ...వీటినిగూర్చి అలోచిస్తున్నకొద్దీ, ఆ నగర వాతావరణంలో డొల్లతనం అర్థం కాసాగింది.

2. తెల్లవాళ్ళు ప్రవేశపెట్టిన సార్వత్రిక విద్యకు ఉద్యోగం పరమావధి అయింది. ఆ ఉద్యోగ భద్రత రకరకాల వ్యాపకాలలో మునిగి తేలటానికి భద్రలోకానికి అవకాశమిచ్చింది. పాఠశాల స్థాయి నుండి వక్తృత్వం, వ్యాసరచనలలో తర్ఫీదు, పెరుగుతున్న అక్షరాస్యత, విస్తరిస్తున్న పత్రికారంగం – రచయితలు, సాహిత్యగాళ్ళుగా గుర్తింపు తెచ్చుకునే అవకాశం కలిగించింది. తొండ ముదిరితే ఊసరవెల్లి అయినట్లు శిష్టసాహిత్యం రసానందం వైపు, నవ్యసాహిత్యం పలాయనం వైపు, ఉద్యమ సాహిత్యం ఉన్మాదం వైపు, సామాజిక స్పృహ పిడి వాదంగా వెర్రితలలు వేస్తూ ఎవరి దుకాణం వారిదిగా గుంపులను పెంచుకోసాగాయి.

3. వీరేశలింగం సంఘసంస్కరణ గతచరిత్ర అయింది. తెల్లవాళ్ళు ప్రవేశ పెట్టిన విద్యను,ఉద్యోగాలను ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు తన ఆత్మకథ 'నా జీవితయాత్ర'లో 'ఆ కాలంలో రాజమహేంద్రవరంలో విద్యాసంస్థల గురించి, విద్యావిధానాన్ని గురించి విపులంగా వ్రాస్తాను. ఉత్తరోత్తరా ఈ విద్యావిధానం మన జాతినెట్లా నిర్వీర్యం చేసిందో తెలుసుకోవాలంటే – ఆనాటి మన జాతీయ విద్యావిధానం, దాన్ని ఇంగ్లిష్ వాళ్ళు వచ్చి ధ్వంసం చేసిన విధము, అందువల్ల మనజాతి అవిద్యలో మునిగి పోవడము బాగా అవగాహన చేసు కోవాలి. ఈ నూతన విద్యావిధానానికి దాసుడైన నాబోటి వారి వర్ణన, ఈ విషయంలో మరీ సమంజసంగా ఉంటుందనుకుంటాను. మెకాలే సలహా మీద ఈ దేశంలో ఇంగ్లీష్ చదువు స్థాపించడానికి నిర్ణ యించారు. ఆనాటి పాలకుల విద్యాదర్శం:ఆనాడన్న మాటేమిటి, ఈనాటికి అదే. తమ పరిపాలనకు కావలసిన గుమస్తాలను దుబాషిలను తయారు చెయ్యటమే. ఆ జాతీయ విద్యావిధానపు ఆదర్శం జాతీయమైనది, విశాలమైనది.ఈ నూతనవిద్యకు ఆదర్శం నౌకరీ, ధన సంపాదనా, స్వార్థమూను. ఎప్పుడైతే మిడిల్ స్కూళ్ళ చదువు పూర్తిచేసిన వాళ్ళు, మెట్రికులేషన్ పాసయిన వాళ్ళుకూడా పెద్ద పెద్ద ఉద్యోగస్థులై అమితంగా ధన సంపాదనలో పడ్డారో, అప్పుడే దేశంలో విద్యాదర్శాలు క్షీణించాయి. జనం ఇంగ్లిష్ చదువులకు తియ్య నీటికీ చేపలెక్కినట్లు ఎక్కారు. అప్పట్లో ఈ చదువులలోకి వెళ్లిన వారంతా ఉద్యోగస్థులై ధనార్జన బాగా చేయడం వల్ల దేశస్థుల వ్యామోహం అటు తిరిగింది'. అంటూ దుయ్యబట్టిన తీరును గాని,' నీవేమన్నా కరణానివా మునసబువా కనిస్టేబువా, నీకు దడిచేందుకు' అంటూ ఉద్యోగుల దాష్టికాన్ని ఎత్తిపొడిచిన చిలకమర్తి లేవదీసిన ప్రశ్నలను చర్చించే వారు కరువయ్యారు. చరిత్ర వేత్త రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం, దామెర్ల ఆర్ట్ గాలరీలమీద ఎవరికీ పెద్దగా ఆసక్తి లేదు. నేదునూరి గంగాధరం గారి జానపద సాహిత్యం 'మున్నీరు', 'మిన్నేరు' అద్దేపల్లివారు ప్రచురించారుగాని, వాటిని పట్టించుకునేవారు లేరు. మధిర సుబ్బన్న దీక్షితులు సంప్రదాయంగా చెప్పు కునే కాశీ మజిలీ కథలను ప్రచురించి గడించారు. నవభారత గురుకులం, భూపతిపాలెం పాఠశాలలు వి'శిష్ట' విద్యాలయాలుగా వెలుగొందుతుండేవి.

4. మార్క్సిస్ట్ విమర్శకుడు త్రిపురనేని మధుసూదనరావు మాటల్లో 'వెన్నెముక లేని మధ్యతరగతి జీవితం సాహిత్యంలోకి ప్రవేశించింది'. 'తెలుగు సాహిత్యాన్ని జానపదసాహిత్యం అని ముద్దుపేరో మొరటు పేరో పెట్టి విస్మరిస్తున్నారు. తెలుగు సాహిత్యం అంటే అనువాద సాహిత్యమే అని బహుళ ప్రచారం చేస్తున్నారు'. (సాహిత్యంలో వస్తు శిల్పాలు పెర్స్పెక్టివ్ ప్రచురణ 19.పు 117,109.) ఇలా లిఖిత సాహిత్యాన్ని,కళలను రుద్దటాన్ని ప్రపంచవ్యాప్తంగా గమనించే 'క్లబ్ ఆఫ్ రోమ్' ఈ పోకడలను 'టెక్నో ట్రానిక్ ఎత్నోసైడ్' అంటే జంత్రబలంతో జాతుల సృజనాత్మకతమీద చేసే మారణ కాండగా నిరసించింది.

5. అవ్వాకావాలి, బువ్వాకావాలి అంటూ స్వేచ్ఛా కావాలి – భద్రతా కావాలంటూ ఊగిసలాడే మధ్యతరగతి పలాయన వాదులను తెన్నేటి సూరి చెంగిజ్ ఖాన్ నవలలో మన్యం వంటి గోబీ ఎడారులకు పోరాదా అంటూ ఎత్తి పొడిచినా – పాపికొండలలో కొండరెడ్డి తెగను 1943లో అధ్యయనం చేసిన మానవ శాస్త్రవేత్త హైమెండర్ఫ్ , రెండు గంటల ప్రయాణం దూరంలోఉన్న గిరిజన ప్రాంతాల గూర్చి ఈ నగర వాసుల అజ్ఞానాన్ని, పిరికితనాన్ని దెప్పిపొడిచినా ఈ భద్రలోకానికి చీమకుట్టినట్టన్నా ఉండేదికాదు. అటు మన్యం వైపు చూస్తే అడవుల నరికివేత ముమ్మరంగా సాగుతున్న రోజులవి. గిరిజన ప్రాంతంలో రైతుకూలి సంఘాల సాయుధ దళాలు గిరిజనులను వేధించే కింది స్థాయి అధికారులను మందలిస్తూ, కూలి రేట్లు పెంచుతూ, కలప సారా వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుంటూ తమపట్టు కోసం ఎత్తుగడలు వేస్తుండేవి.

6. జీవితం దశ దిశలను వెతుక్కుంటూ ఆందోళనతో రగిలి పోయే ఈ తరుణంలో, 1976 లో గిరిజనగీతాల సేకరణ, పరిశోధన కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరాను. ఇక్కడ అన్నిరకాల రాజకీయ / వామపక్షాలకు విద్యార్ధి సంఘాలుండేవి. వారిమధ్య ఘర్షణలతో ప్రాంగణం మొత్తం ఉద్రిక్తంగా ఉండేది.

జానపద సాహిత్యం అధ్యయనానికి తెలుగు శాఖ కేంద్రం. జానపద కళాకారులు చుక్క సత్తెయ్య, చిందు ఎల్లమ్మలకు సభాగౌరవం తేవటానికి నటరాజ రామకృష్ణ, రామరాజు, నాగభూషణ శర్మలు కృషి చేస్తుండేవారు. పరిశోధన విషయాన్నిబట్టి నా దృష్టి సాంఘిక శాస్త్రాలు, ముఖ్యంగా మానవ శాస్త్రం వైపు మళ్ళింది." Nothing human is alien to me" అన్న మార్క్స్ సూక్తికి తగ్గట్లు, మానవశాస్త్రం సర్వశాస్త్రాల సమాహారం. తెగలకు సంబంధించిన భాష, సాహిత్యం, కర్మకాండ, పర్యావరణం, సంజ్ఞానం, భౌతిక ప్రాక్చారిత్రక విశేషాలను ఎందరో శాస్త్రజ్ఞులు తరతరాలుగా అధ్యయనం చేసి, వాటిలో క్రమాన్ని స్పష్టపరచారు. సంస్కృతి గతిశీలం అని నిరూపించారు. సంస్కృతి అంటే నమ్మకాల దొంతర, పురాగాథలు అంటే పుక్కిటి పురాణాలు అని నిరసించే హేతువాద, 'శాస్త్రీయ' వ్యాఖ్యానాలను పటాపంచలు చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మానవశాస్త్రం లేక పోవడంవల్ల, ఏదో వాళ్ళు చెప్పిన ఒరవడిలో కాకుండా, స్వేచ్ఛగా చదువుకోడానికి, ఆలోచించుకోటానికి, తోచిన సమాచారం సేకరించు కోటానికి అవకాశం కలిగింది. భారతీయుల తాత్విక చింతన విశ్లేషణ విధానాన్ని, మానవశాస్త్ర విచారధారతో సమన్వయిస్తూ నేను సేకరించిన సమాచారం వ్యాఖ్యానించిన తీరు, తెలుగుశాఖ పత్రిక 'వివేచన' పంచకన్యల వృత్తాంతాన్ని 'దేశకాలాలు- వివాహ పద్ధతులు', 'వార్త యందు జగము వర్ధిలు చున్నది' (1982) అనే శీర్షికలతో ప్రచురించింది. మూల్యాంకనం చేసిన వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మానవ శాస్త్రవేత్త మునిరత్నంరెడ్డి గారిప్రశంసన, కొత్త పరిచయాలను సమకూర్చింది.

7. ఇదే సమయంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాటం, నక్సలైట్ ఉద్యమాల మీద వచ్చిన సాహిత్యం మీద మార్క్సిస్ట్ దృక్పథంతో పరిశోధనలు జరుగుతుండేవి. ఉద్యమ కళాకారులు గద్దర్ వగైరాలు ఎదగసాగారు. అయితే కథలు, ఉద్యమ సాహిత్యం ఒక మాధ్యమం మాత్రమే నని 'నూరేళ్లకు పైగా తెలుగు కథ వస్తు నిర్దేశంగా పయనించింది...గత ముప్ఫైఏండ్లుగా తెలుగు ప్రజాసంస్కృతిలో ప్రాణం పోసుకున్న పాటకు జన్మనిచ్చింది ఉద్యమం...కథయే పరమార్ధంగా, వాహికగా కాకుండా లక్ష్యంగా, సాహిత్య ప్రక్రియగా కాకుండా, ఉద్యమంగా ప్రచారం చేసి , ఆ ప్రచారం ఒక సత్యంగా నమ్మే ప్రమాద సూచిక దగ్గరికి ప్రచారకులు చేరిపోయారు' అంటూ వామపక్ష సాహిత్యగాళ్ళను హెచ్చరించవలసి వచ్చింది...('భూమితో మాట్లాడు' వరవరరావు 2005లొ తెలంగాణా విమోచనోద్యమం తెలుగునవల1983).

8. అదే సమయంలో గిరిజన ప్రాంతాలలో సమస్యలమీద అధ్యయనాలు జనార్దనరావు అద్వర్యంలో జరుగుతుండేవి. 1/70 రెగ్యులేషన్ నుండి చిన్న రైతులను మినహాయిస్తూ నాటి ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేయటం, అంతకు ముందే కోర్టు ద్వారా జిల్లాలో కొన్ని గ్రామాలు గిరిజన ప్రాంతంనుండి తీసివేయించటం ఆయన పేర్కొన్నారు. కొందరు అధికారుల సలహా మేరకు కావచ్చు, ఆ జి.వొ.ను ఖమ్మం జిల్లాలో ఒక గిరిజనసంఘం పిటిషనర్ గా పౌరహక్కుల ఉద్యమ నాయకుడు కన్నబిరాన్ కొట్టేయించారు. చిన్న రైతులను ఆదుకునేందుకు వామపక్షాలు ఉద్యమించి బలం పెంచుకో సాగాయి. శ్రీకాకుళం ఉద్యమాన్ని అణచి వేసినట్టే, ఇక్కడకూడ పౌరహక్కుల ఉద్య మాన్ని అణచి వేతకు ప్రభుత్వం దమనకాండకు పూనుకొంది. ఈ హింస, నక్సలైట్ల ప్రతిహింస మీద జోరుగా చర్చలు జరుగుతుండేవి. 'కూలి సరిగ్గా ఇవ్వని భూస్వాములను కూలి అడగటానికి, భూములు పంచని పాలకులను భూములు అడగటానికి, అడవులను ఆక్రమించు కున్న ప్రభుత్వానికి అవి గిరిజనుల అడవులు అని చెప్పటానికి...జనం ఐక్యమై ఆందోళన చేస్తే దానిని తీవ్రవాదం అనడానికి వీల్లేదు'అని పౌరహక్కుల నాయకుడు రామనాథం గారికి జోహార్లర్పించిన బాల గోపాల్,

9. 'పేదలకు పంచదానికి భూములెక్కడున్నాయి అని కమ్యూనిస్టులు సహితం అనుకుంటున్నదశలో తన స్వంతజిల్లా అయిన చిత్తూరులో పేదలకు పంచని, పంచినా అన్యాక్రాంతమైన...భూముల్ని ఒక్కటొక్కటిగా బయటకు తీసి భూసంస్కరణల కార్యాచరణోద్యమం పేరిట దళిత సంఘాలను ఇతర ఉద్యమకారులను కలుపుకుని కలక్టర్ల వెంట పడ్డాడు నరేంద్రనాద్ అంటూ ఆయన గాంధేయ దృక్పధాన్ని ప్రశంసిస్తాడు. (హక్కుల ఉద్యమం – తాత్విక దృక్పథం 2010).

10. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తాలూకాలో ఈ ఉద్యమానికి 'సలహా' ద్వారా పునాది వేసిన వారు గీతారామస్వామి, సిరిల్ రెడ్డి, మనోహర్, శైలజ, సి.వి.మోహనరెడ్డి వగైరాలు-జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ పరిశోధన పేరిట, భూమి రికార్డులు సేకరించు కోటానికి, హైదరాబాదు విశ్వవిద్యాలయంలో అర్ధశాస్త్ర ఆచార్యుడు డి.నరసింహారెడ్డిగారి నుండి ఉత్తరం పెట్టించి, జిల్లాలలో రికార్డులు సంపాదిస్తూ, ఈ కార్యక్రమాన్నివారు కొంతకాలం నడిపించారు. అయితే విశ్వవిద్యాలయాలలో ఉన్న వామపక్ష విద్యార్థి సంఘాలు, జనార్దనరావ్ వంటి ఆచార్యులు ఈ విధానంలో గిరిజన భూముల మీద పరిశోధనలు చేయటానికి పూనుకోలేదు.కానీ 'సలహా'తో పని చేసిన దళిత మేధావి బొజ్జాతారకం ఆ విద్య యొక్క అవసరం గుర్తించారు. 'సర్వే నెంబర్లు, సరిహద్దు రాళ్ళూ అన్నీ కరణానికే తెలుస్తాయి...భూమికి సంబంధించిన విషయాలన్నీ అతని మాట మీదనే ఆధారపడి ఉంటాయి. మూడో ఎద్దుగా మనిషి మారాలంటే ప్రధానంగా రెండు మార్గాలున్నాయి. ఒకటి భూమి సమస్య. రెండు చదువు.భూమి ఇస్తే చదువు తనే చదువుకుంటాడు...**భూమి, చదువు ఎంత అవసరమో తెలుసుకున్న ఆసాములు పాలేరు జీతగాల్లకు ఆ రెండు లేకుండా చేసారు'. (నేల నాగలి మూడు ఎద్దులు 2008)** తరువాత నవల పంచతంత్రంలో(2012) కూడా అయన ఇదే చెప్పారు. 1964లో వచ్చి, ఒరవడిగా మారిన కారా 'యజ్ఞం' కథకు రావలసిన మలుపు, ఇప్పటికి వచ్చింది.

11.మైదాన ప్రాంతాలలోకన్నా గిరిజన ప్రాంతాలలో రైతు కూలి సంఘాలకు పట్టు ఎక్కువ. అధికారంలోకి వచ్చే బలంలేదు గాని తమ ప్రయోజనాలు కాపాడుకోడంలోవారు వివిధ వర్గాలతో

చేతులు కలుపుతారు. సమర్ధించుకుంటారు. శక్తి ప్రారంభించిన తొలి నాళ్లలో, గిరిజనులు ఒక సారాకొట్టు మూయించారు. రైతుకూలి సంఘాలు ప్రశంసించాయి.మరుసటి సంవత్సరం, ఆ సారాకొట్టు తెరిస్తే గిరిజనులు ఆ కొట్టు మూయించారు. ఈసారి సంఘాలు ఆ కొట్టును సమర్థిస్తూ గిరిజనులలో తాగుడు అరికట్టడం, బయటి వాళ్ళు పెట్టే సారాకొట్టు ద్వారానే సాధ్యం అంటూ కరపత్రం వేసి సమర్ధించుకున్నారు...తాగుడు అదుపు చేస్తాం, మాకో అవకాశం ఇవ్వండి అంటూ గిరిజన విద్యార్థులు, దళ నాయకుడిని బతిమాలినా వాళ్ళు అంగీకరించలేదు. పనులలోకి రాకుండా వెలివేస్తాం అంటూ బెదిరించారు. అప్పట్లో ప్రముఖంగా వచ్చిన ఈ వార్తలు చూసి, నేడు రచయిత గిరినసంక్షేమశాఖలో అధికారి శ్రీ చినవీరభద్రుడు నన్ను చూడడానికి వచ్చారు. ఆయన తత్వశాస్త్రం చదువుతున్నారని తెలిసి నావ్యాసం 'వార్తయందు జగము...' ఇచ్చాను. వారి నాన్నగారు శరభవరం కరణం గారు చెప్పిన వివరాల నమూనాలో, కలెక్టరు కార్యాలయంలో తారీకులు దస్తావేజులు వెతికి 'భూములు కోల్పోతున్న గిరిజనులు' అనే పుస్తకం వేసాం. పాడేరులో ప్రాజెక్ట్ అధికారి కొన్న 'తెలుగు గిరిజనగీతాలు' సొమ్ము ఆయనే పంపించారు. ఈ మధ్యనే గిరిజన సంస్కృతి ప్రధానోపాధ్యాయుల కరదీపిక ఆయన సమన్వయం లోనే వచ్చింది.

11. 1976లో తూర్పుగోదావరిలో గిరిజన ప్రాజెక్ట్ అధికారిగా పనిచేసిన రచయిత 'నెలనెలా వెన్నెల' సి.వి.కృష్ణారావుగారు, మారేడుమిల్లిలో కొండమామిడిచెట్ల నరికివేతకు తన మెడను అడ్డంపెట్టిన చిన్నం శాంతయ్యను తన కవితలలో ప్రస్తావించారు. ఆ శాంతయ్యగారి దగ్గరే, పరిశోధనకు కావలసిన సమాచారం సేకరించాను. ఆ మామిడి చెట్లను నరికే ప్లయ్ వుడ్ ఫాక్టరీని మనోహర్, మోహనరెడ్డిల ద్వారా ప్రజాహిత వ్యాజ్యం వేయించి మూయించటం మాతొలి విజయం. తరువాత గనులు మూయించాము. రైతుకూలి సంఘాల ఒప్పందపు కూలి బదులు ఐ.టి.డి.ఏ. చేత కనీస వేతనాలు ఇప్పించాము.

12. మళ్ళీ వరంగల్ గిరిజన ప్రాంతానికొస్తే, అక్కడ కమలాపురం రేయన్ ఫాక్టరీ ఉంది. ఆదిలాబాబాద్ గిరిజన ప్రాంతంలో దేవాపూర్ సిమెంట్ ఫాక్టరీ ఖనిజాలు తవ్వుతుంది. ఇంతకు ముందు చెప్పినట్లు 23 గ్రామాలు గిరిజన ప్రాంతం నుండి తొలగించటమే కాదు, 1/70 రెగ్యులేషన్ వర్తించదని స్టే తెచ్చుకోడం 1987లోనే వరంగల్ జిల్లాలో మొదలైంది ఇక్కడే. కన్నబిరాన్ తన ఆత్మకథ 24 గంటలలో ప్రస్తావించిన న్యాయవాది ప్రతాపరెడ్డి ఇలా 32 గ్రామాలకు స్టేలు వరసగా తెస్తుంటే, 1992లొ నిలువరించటంతో మా పశ్చిమ గోదావరి కార్యక్రమం ప్రారంభమైంది. 'చాలా కాలంగా ఆదివాసులలో పునాది ఉన్న ఏ కమ్యూనిస్ట్ పార్టీ కూడా 1/70 పోరాటాన్ని ఆ స్థాయిలో ఎందుకు చేపట్టలేక పోయింది అనేది ప్రశ్న...1/70 పోరాటం ఆదివాసీలే చేపట్టిన ఉద్యమాల్లో ముందుకొచ్చినంత బలంగా ఏ కమ్యూనిస్ట్ గిరిజన ఉద్యమంలోనూ రాలేదు'(చూపు జనవరి 1999) అని గమనించిన బాలగోపాల్, జనార్దనరావుతో కలిసి ఖమ్మం జిల్లాలో గిరిజనులు ఉద్యమిస్తున్న అశ్వారావు దమ్మపేట మండలాలలో పర్యటించి 'వార్త'లో రాసారు. కానీ స్వయంగా ఆ ఉద్యమంలో పాల్గొనలేకపోయారు.

13. బాలగోపాల్ పేర్కొన్నట్లు నల్లమల నుండి చెంచులను తరలించాలని చూస్తున్న తరుణంలో, ప్రకాశం జిల్లాలో వారిని వోటర్లుగా నమోదు చేయించటంతో వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావటం మొదలైంది. లోపలి అడవిలో ఉన్న అప్పాపూర్ పంచాయతి అయింది. చేపలు పట్టుకునే హక్కు చెంచులు సాధించుకున్నారు. అన్నిటికి మించి చెంచులు సేకరించిన సంప్రదాయ సాహిత్యం వెలుగు చూడటంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇప్పటిదాకా విదేశీయులు హైమెండోర్ఫ్, మైకేల్ యార్క్ కృషి మాత్రమే ఆధారమైతే,ఇప్పుడు గోండుల సంప్రదాయ సాహిత్యాన్ని ఆదిలాబాద్ ఆకాశవాణి ద్వారా సుమనస్పతి రికార్డ్ చేస్తున్నారు.

14. అయితే ఎవరి పని వాళ్ళది అన్నట్లు పక్కపేజి పట్టించుకోని ధోరణి పెరుగుతోంది. జయధీర్ తిరుమలరావు సంపాదకత్వంలో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం జానపద విజ్ఞానంపై స్నాతకోత్తర విద్యార్థులకు వ్యాసావళి తయారు చేసి ప్రచురించింది. వాటిలో జానపద సాహిత్యం మీద రాసిన వ్యాసాలతో పాటు, 'గిరిజనుల కళలు సాహిత్యం' వ్యాసం కూడా ఉంది. గిరిజన రచయిత మల్లిపురం జగదీశ్ 'శిలకోల'కథల సంకలనానికి ముందుమాట రాసి, అతని వ్యాసాన్ని 'బహుళ"లో చేర్చిన సంపాదకులు, తన వ్యాసాల పక్కనే ఉన్న 'గిరిజనుల కళలు, సాహిత్యం' వ్యాసం జగదీశ్ దృష్టికి, పాఠకుల దృష్టికి తేలేక పోయారు.

15. 1960లో తయారైన మాండలికవృత్తి పదకోశాలకు ముందుమాట రాస్తూ ఆ విజ్ఞానాన్ని మానవ శాస్త్రవేత్తలు ఉపయోగించుకోవాలి, విశ్లేషించాలి అని భద్రిరాజు కృష్ణ మూర్తి ఉద్బోధించారు. ఆయన హైదరబాదు విశ్వవిద్యాలయం కులపతిగా ఆ ప్రయత్నం చేస్తే బాగుండేది. 1995లో తెలుగు భాషాభిమానులు, తెలుగు గ్రంథాలు పునర్ముద్రించాలని పిలుపునిచ్చారు. కానీ మాండలిక పద కోశాల ప్రచురణ త్వరగా పూర్తిచేయమని కోరలేదు. ఇవేళ పాత పంటలు, రుచులు గూర్చి ప్రచారం చేస్తున్నవారు, జానపదుల వారసత్వాన్ని చాటే వ్యవసాయ వృత్తి పదకోశాలను తెలుగు సామెతల సంకలనాలను గుర్తుచేయటం లేదు. ఇటీవల వస్తున్న చట్టాలు సంప్రదాయాన్ని గుర్తిస్తున్నాయి. అడవిలో గిరిజన ఆవాసాలకు సంప్రదాయ సరిహద్దు పటాలు తయారు చేస్తున్నట్లే , సముద్రంలో మత్స్య కారుల స్థల నామాలను ఉపగ్రహ చిత్రాలతో అనుసంధానం చేసే ప్రయత్నం మొదలైంది. అందుకు మత్స్య పరిశ్రమ మాండలిక పదకోశం ఉపయోగ పడుతుంది. ప్రపంచాన్ని వణికిస్తున్న వాతావరణంలో పెను మార్పులను వ్యవసాయ పదకోశం ఆధారంగా అధ్యయనం చేయాలి. జ్ఞానాన్ని ప్రజలలోకి తీసుకు పోవాలంటే ఈ పలుకు బడులే దిక్కు.

16. ఇలా సాహిత్యగాళ్ళు, సంఘాలు, మేధావులు, ఆచార్యులు శీతకన్ను వేసినా, సంప్రదాయ జానపద గిరిజన సాహిత్యం తన ఉనికిని చాటుకుంటుంది. సాధికారిత ఏటికి ఎదురీది ఊపిరి పీల్చుకొంటుంది. ఒక పక్క, చట్టాలు తాము పోరాడితేనే వచ్చినాయి అని చెప్పుకుంటూ, అవి అమలు కావట్లేదని విమర్శించే ధోరణి పెరిగింది.

(తరువాయి భాగం 45 వ పుటలో)

కీ.శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి



శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భంలో
శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు చదివిన ఉపన్యాసం

కొనలు కొంచెం గిరజాలుగా తేల్చి దువ్విన జుట్టు. వైకల్పికంగా ధరించే కళ్లజోడు. కమీజులోపలికి పెట్టి కట్టిన తెల్లని పంచ మీద నిలువునా బొత్తాలుగల కోటు. ఒక కొన వీపుమీదకు పోగా రెండవ కొన ముందుకు విడిచిన సన్న ఖండువా, కొంచెం వెడల్పైన పెదవులమీద ఒక చిత్రమైన యాసతో ఉచ్చరించే అచ్చపు తూర్పు గోదావరి జిల్లా తెనుగు. సడలని ఉత్సాహంతో, వడలని శరీరంతో, రాజమహేంద్రవరం వీధిలో తెనుగుబింకంతో నడిచే ఆ నిండు విగ్రహం ఎవరు?

ఆయనే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. ఉరవు – కలాభివర్ధనీ పరిషత్తు.

ఆయనకు షష్టిపూర్తి అంటే ఎవరు నమ్ముతారు? నేటి సాహిత్య యువకు, లందరికంటే గూడా యువకుడుగా కనిపిస్తూ, పొంగులు వారే ఉత్సాహంతో సాహిత్య సేవ చేస్తూ, ఏ విషయంమీదనైనా ముక్కుమీద గుద్దినట్టు వెర పెరుగకుండా మాటలాడుతూ, తెనుగుతనం ప్రసక్తిలో పిడికిలి బిగించి ఉపక్రమించే ఆయన ఎప్పుడూ ముప్పయి దాటని సాహిత్య త్రిదశుడని మా విశ్వాసం గదా – అప్పుడే ఆయనకు అరవై అంటే ఎవరు నమ్ముతారు? "నిజమే...ఆయన రచనాశక్తికీ, సాహిత్యాసక్తికీ, కార్యదీక్షకూ, కళాభిరుచికీ నిత్యయౌవనమే కావచ్చు. కాని : శరీరానికి మాత్రం షష్టిపూర్తి", అన్నాడు మావాడు.

ఉచితజ్ఞులైన రాజమహేంద్రవర పౌరులు అఖిలాంధ్రదేశ ప్రోత్సాహ, ప్రోద్బలాలతో సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి శక్తివంచన లేకుండా "ఓహో" అన్నట్టు షష్టి పూర్త్యుత్సవం చేస్తున్నారంటే సారస్వత ప్రియులంతా సంతోషిస్తున్నారు.

ఆంధ్ర వాఙ్మయానికి – తత్రాపి – నవ్య సాహిత్యానికీ శ్రీ శాస్త్రిగారి యీవి తక్కువ కాదు. భక్త విజయం మొదలు కలంపోటు దాకా ఆయన లేఖిని ఆంధ్రసారస్వత క్షేత్రంలో విశృంఖల విహారం చేసింది.

నాటకాలు వ్రాశారు. నవలలు సృష్టించారు. రూపికలు చిత్రించారు. కవిత నారాధించారు. వ్యాఖ్యానాలు ప్రపంచించారు. వ్యాసాలు రచించారు, మీగడతరకలు అందించారు. ఇంకా ఎత్తిన కలం దించలేదు. కొత్తరచనకు పథకాలు పడుతూనే ఉన్నాయి. సాహిత్య రంగంలో ద్రుతగమనం సాగుతూనే ఉంది.

యుగపురుషులు, నన్ని భట్టారకుడూ, వీరేశలింగం పంతులూ మెట్టిన రాజమహేంద్రవర సారస్వత పుణ్య క్షేత్రంలో శాస్త్రిగారి మనుగడ. అటు ప్రాచీనసారస్వత సారమూ, ఇటు నవ్య సంస్కార చైతన్యమూ సమన్వయించి ఆస్వాదించిన ప్రబుద్ధాంధ్రులు శ్రీ శాస్త్రిగారు.

కానైతే...సాహిత్య పూర్వాశ్రమంలో పండిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రులవారు చక్కని గ్రాంథీకాంధ్రభాషలో పెక్కు గ్రంథాలు వ్రాశారు. అప్పుడు నలిగిన తోవలో వ్రాసుకుపోయే నలుగురు రచయితల్లోనూ ఆయన ఒకరు...అంతే. ఏ విశిష్టతకూ ఆయన లక్ష్యం కాలేదు. ఏ ప్రత్యేకతకూ ఆయన నిదర్శనం కాలేదు.

ప్రతిభగల వ్యక్తికి ఏనాడో ఏర్పడిన పరిధుల్లో కళ్లు మూసుకుని సురక్షితంగా నడవడం సాధ్యమైన పనికాదు. అప్రయత్నంగా ఆతడు ఎప్పుడో ఎర్రజండా పట్టుకొని గీతలుదాటి బయటపడి తన ప్రజ్ఞకు రెక్కలు తొడుగుతాడు. ప్రజలకు తన ముక్తకంఠం వినిపిస్తాడు.

శాస్త్రిగారికి ఎప్పుడో ఒకనాడు ప్రజాసామాన్యంతో బెట్టుసరిగా ఉండే గ్రాంథిక భాషమీద పొంగివచ్చే నవ్య చైతన్యవాహినికి ఇరకాటమైన సంప్రదాయ రచన మీద నిర్లక్ష్యం పుట్టింది. దానితో ఆయన మేధలో వింత మెరపులు మెరసీ విచిత్ర భావావళి విరిసింది.

శ్రోత్రియతా సంపన్నమైన వైదిక కుటుంబంలో పుట్టిన శాస్త్రిగారు, అన్నగారిలా, నిగ్గయిన ఏ దైవజ్ఞ శిఖామణిగానో, శ్రౌత స్మార్త నిత్య కర్మానుష్ఠాన యోగ్యతా పరతంతులైన ఏ వేదమూర్తిగానో కావలసింది. అయితే ఆయన పేరు మహేంద్రవాడ పరిసరాలనూ, మహా అయితే రామచంద్రపురం తాలూకానూ దాటకుండానే ఉండేదేమో, కాని ఆయన భవిష్యత్తు అదికాదు. పరిసరాలను ఒత్తిగించుకొని ఆయన వ్యక్తిత్వం ఒక నవ్య వాఙ్మయ తపస్సిద్ధివైపు అచంచల గమనం సాగించింది.

–2–

శాస్త్రిగారు కృషిచేసిన తెనుగు పొలం చాలా పెద్దది. గట్టుమీద నించుని కలయజూస్తే ఆ సస్యాభోగం కంటిని చెదరగొడుతుంది.

ఆంధ్రంలో సర్వతోముఖమైన సారస్వత కృషిచేసి వాసి కెక్కిన ప్రముఖు లెందరో ఉన్నారు.

కాని, వారి మార్గం–మార్గ కవితానుకారి. వారు ఎంత నవీన సమస్య నెత్తుకొని వ్రాస్తూన్నా వారి రచనల్లో అగ్గలమైన సాంస్కృతిక వాసన గుప్పుమనక తప్పదు.

ఇక, సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఏది వ్రాసినా దేశపథం పట్టిస్తారు. ఆయన నాటకాల్లో అఖండ రాజమర్యాదలతో విలసిల్లే తెలుగు రాజులూ, అతి "లౌక్యం" లో ముదరబండిన తెలుగు మంత్రివృద్ధులూ, మాటలాడిన ప్రతీమాటనూ కావ్యంగా మెరిపించగల తెలుగు మహాకవులూ ప్రత్యక్షమవుతారు.

కథల్లో, నిండు పాలకుండల్లాంటి తెలుగు కుటుంబాలూ, కొత్త బంతిపూవుల్లాంటి పల్లెపడుచులూ కనిపిస్తారు.

వ్యాసాల్లో, వ్యాఖ్యానాల్లో, మాట పరువంతో నిశితతర్కం చూపే ఒక ఆంధ్ర మనిషి కనిపిస్తాడు. వెరసి – ఒక మాటలో చెప్ప వలసి వస్తే – సుబ్రహ్మణ్యశాస్త్రిగారి రచన అంతా తెనుగు జాతికి అంకితం. దీనికోసం ఆయన తన సంస్కృతాంధ్ర సంస్కారాన్నంతా ఒకొక్కప్పుడు మూటకట్టి ఒకచోట పెట్టి..ఎంత మట్టానికైనా దిగి తెనుగు వాతావరణం సృష్టించడంలో చరితార్థులవుతారు.

ఆయన ఆంధ్రాభిమానానికితోడు ప్రశంసార్హమైనది అసాధారణ మైన అభ్యుదయదృష్టి, ఈనాడు భాషా, సంఘ, సంస్కారాల గురించి ఎవరు ఎట్లా మాటలాడినా పేల పిండి. శాస్త్రిగారు రచన చురుగ్గా చేసేనాటికి కత్తులబోను. భాషా సంస్కారం గురించి తల పెడితే చీల్చి చెండాడే వృద్ధపండితులొక ప్రక్క, సమాజ సంస్కారం గురించి ఎత్తితే నిప్పులు చెరిగే సనాతన వాదులు రెండో పక్క, రెండు కక్ష్యలనూ ధిక్కరించి, తాను నమ్మిన భావావళిని రచనల ద్వారా ప్రచారం చెయ్యడంలో–గుండెలు దీసిన బంటు శ్రీ శాస్త్రిగారు.

స్త్రీ పునర్వివాహ విషయంలో వీరేశలింగం పంతులుగారి వాక్కు ప్రభుసమ్మతంగా హుంకరిస్తే...శాస్త్రిగారి కథలు కాంతా సమ్మతంగా తెలుగు గుండెలను కరిగించి వేశాయి. వితంతు దయనీయ స్థితిని లోకానికి ఇంతగట్టిగా వాదించి చెప్పిన వకీలు మరొకరు కనిపించరు.

చేసే చేసే గ్రాంథికాంధ్ర రచనను విడిచి తెనుగు మనస్సులోనికి దూసుకువెళ్ళి వాడుక భాషను పట్టుకున్నారు. గ్రాంథికం మార్చి వ్యవహారికం చెయ్యవచ్చు. కాని యీయన వ్యావహారం వేరు. ఇంకొకరికి పట్టుబడదు. ఈయన రచన ఏదిచదివినా ఇది కసబడి పోతుంది!

శాస్త్రిగారి రచనల్లో ఒక పరమోద్దేశం స్పుటంగా కనబడుతుంది. హిందువుల ఆర్షమతం చాలా గొప్పదే. అయితే ఏం లాభం? అది శిథిలమూ, విషమమూ అయిపోయింది. దాన్ని అభిమానంతో కప్పితే ఏం లాభం? దాని కలరూపు స్పష్టంగా గుర్తించి ధైర్యంగా సంస్కరించాలి. ఈ భావ ప్రచారం కోసం అగ్రజాతుల అహంకారాలూ, మాలిన్యాలూ, అన్యమత మాత్సర్యాలూ, సోమరితనం, స్త్రీల పతనం వస్తువులుగా తీసుకుని పరశ్శతంగా రచనలు సాగించారు.

శాస్త్రిగారి రచనలు రెండు విధాలుగా విభజించవచ్చును.

1. ప్రగతిశీల రచనములు

2. రసైక రచనములు, అని.

ఒక సిద్ధాంతం ప్రచారం చెయ్యడానికి రమణీయ సన్నివేశాలు కల్పించి చేసిన రచనలు మొదటి తరగతివి.

ఉన్న విచిత్ర సంవిధానాలను, వింత కథలనూ ఉపయోగించు కొని ప్రజ్ఞతో కావ్యత్వ సిద్ధిని పొందించిన రచనలు రెండవ శ్రేణికి చెందుతాయి. శాస్త్రిగారు యీ రెండు విధాలైన రచనలూ సమృద్ధిగానే చేశారు.

1. మార్గదర్శి 2. మొదటి దాడి 3. పెల్లాడ దగ్గ మొగాడేదే 4. తాపీ మేస్త్రి 5. తల్లిప్రాణం 6. ఇల్లాంటి తవ్వాయి వచ్చిపడితే మొదలైన కథలనేకం తొలి జాతివి.

రాజరాజు, నిగళబంధనం, కలంపోటు మొదలైన నాటకాలూ, వడ్లగింజలు, యావజ్జీవంహోష్యామి, ఇల్లుబట్టిన....ఆడపడుచు, గులాబీ అత్తరువూ మొదలైన కథానికలూ రెండవజాతికి చెందినవి.

–3–

శాస్త్రిగారి రచనలమాట తల పెట్టేసరికి–మొట్టమొదట చిన్న కథలు జ్ఞాపకం వస్తాయి. ఎన్నాళ్లకిందట చదివినా ఆ కథల్లోని సన్నివేశాలూ, పాత్రలూ, అన్నింటినీ మించిన కథ చెప్పే ఒడుపూ మనస్సులోనుంచి చెరిగి పోదు.

వడ్లగింజల్లో తంగిరాల శంకరప్పగారినీ, దివాంజీగారినీ తెలుగు పాఠకులు మరచిపోగలరని నేననుకోలేను.

"ఇల్లుబట్టిన...ఆడబడుచు" కథలో ఒక సాధారణ బ్రాహ్మణ కుటుంబ సన్నివేశం ఎంత నేర్పుగా చిత్రించారో, వడ్లగింజల్లో గంభీరమైన ఒక తెనుగు దివాణాన్ని అంత లోకజ్ఞతతో వర్ణించారు. ఈ రచనలో శాస్త్రిగారి రచనా సౌందర్యం "పరిణత ప్రజ్ఞస్యవాణీ మియామ్" అన్నట్టుంది. దాన్ని ఇంకా వివరించడానికి ఈ సంకుచిత స్థలం చాలదు.

సరిగ్గా ఇదే రంగస్థలం మీద గులాబీ అత్తరుతో షుకురల్లీ కనిపించి, "ఇదేనా తెనుగు జాతి రసికత" అని ఎర్రని కళ్లతో అడుగుతూ ఉంటే మన తెల్లని కళ్లు చెమ్మగిలుతూ ఉంటాయి.

మార్గదర్శి అంతా ఒక ఉపన్యాసం. కాని విసుగు పుట్టించదు. అందులో కొన్ని కథలు చరచర పరుగెత్తుతాయి. ఇందులోని టెక్నిక్ చిత్రమైనది. ఉద్యోగం పేరిట బానిసతనానికి ఎగబడే బ్రాహ్మణ యువకుల భావరుజకు ఈ రచన సంజీవిగా పని చేస్తుంది.

"శుభికేశిర ఆరోహ" అనేది ఒక చురుకైన "శటైర్". అచ్చపు తెనుగు కుటుంబంలో అతకని ఉత్తర హిందూ నాగరికతా వ్యామోహాన్ని చమత్కారంగా నిరూపించి, చాలా మంది ఆంధ్ర యువకుల భావ దాస్యాన్ని హేళన చేశారు. ఇందులో. అంతేగాదు – శాస్త్రిగారికి హిందీభాషమీద ఉండే సదభిప్రాయం కూడా దీనిలో తొంగిచూస్తూ కనబడుతుంది.

తల్లిప్రాణం ఒక మంచికథ. టీ కప్పులో తుఫాను అన్నట్టు ఒక బ్రాహ్మణ కుటుంబంలోని భావ సంఘర్షణ ఇందులో ఇతివృత్తం. శిథిలమైన సనాతనాచారానికి ఒక ముసలి వితంతువు ప్రతినిధి. పొంగివచ్చే సంస్కార వాహినికి ఒక ప్రౌఢ తెనుగు ఇల్లాలు ఆలంబం. మధ్య నిస్సహాయుడైన యజమాని యొక్క సంశయాత్మ, ఫలితం –

మొదటిదాన్ని రెండవది అణచి వేసి నెగ్గుతుంది. ఇది శాస్త్రిగారికే గాదు, ఆంధ్ర పాఠకులందరికీ అభిమాన రచనే అనుకుంటాను. ఇట్లాంటి వందల కొలదీ రసవత్కథానికలే కాకుండా ఈయన నవలలు కూడా అనేకం వ్రాశారు. రక్షాబంధనం మొదలైనవి అపరాధ పరి శోధకములు. వీటిలో గూడా ఈ రచయిత మేలికత కనబడుతుంది. వంగ అపరాధ కథలతో నిండిన తెలుగు పాఠకులకు ఊరటగా – తెలుగు జీవితంలో నుంచి అట్టి కథలు కల్పించి ప్రజాదరణ సంపా దించారు.

ఆత్మబలి – శాస్త్రిగారు ఇటీవల రచించిన నవల. వయసు వచ్చిన కొడుకును కులపౌరుష చిహ్నంగా యుద్ధానికి పంపిన ఒక కాపు యువతి ముమ్మరమైన యౌవనపు పొంగును ఆపుకోలేక నర కానికి జారిపోతూ చటుక్కున నిలదొక్కుకుని కొడుకు ప్రతిష్ట కోసం అతని సుఖం కోసం తన అనుభూతిని బలివేసుకుంటుంది. ఈ పతనోత్పతనాలలో రచయిత చూపిన కౌశలం సాటిలేనిది.

నాటకాల్లో "రాజరాజు" శాస్త్రిగారి కీర్తి పతాక అని చెప్పవచ్చు. గ్రాంథికాభిమాని స్వర్గీయ జయపురాధీశుణ్ణి గూడా ఆకర్షించి ఆనంద పెట్టినదంటే ఈ నాటకం యొక్క ఉదాత్తత ఊహించవచ్చు.

అనేకులు "సారంగధరలు" రాశారు. కాని వాటిలోని రాజ రాజు పూసలకోటుతో వట్టి నాటకం రాజుగా కనిపిస్తాడు గాని యావదాంధ్ర భూమిని ఏకచ్ఛత్రంగా పాలించిన చాళుక్య ప్రభువుగా కాన్పించడు. ఇక ఆ నాటకాల్లో నన్నయకు నామరూపాలే లేవు. అట్టి కథ తీసుకుని ఇంద్రజాలం చేసినట్టు సజీవమైన ఆంధ్ర రాజ్య వాతావరణం సృష్టించి గంభీర చాళుక్య రాజరాజును, రాజనీతిలో పండిపోయిన తెనుగు మంత్రివృద్ధులనూ, మాటలతో బంతులాడే భృత్యవర్గాన్ని ప్రదర్శించారు.

ఇందులోని నన్నయ మహాకవి సృష్టి అపూర్వం. ఈ నాటక ముకాహారానికి మేరుమణి నన్నయ. ఇతడు కులబ్రాహ్మణుడు మాత్రమే అనుకునే అల్పజ్ఞులకు కూలంకష లోకజ్ఞుడు కూడాను అని స్ఫుటంగా శాస్త్రిగారు తమ నాటకంలో నిరూపించారు.

భారత రచన అరణ్య పర్వంలో ఆగిపోవడానికీ, కోడలు కాద గిన చిత్రాంగిని రాజరాజు వరించడానికీ ఈయన చేసిన వ్యాఖ్యానం అద్భుతమైనది. అధర్మ పరిధిలో భారతాంధీకరణం చెయ్యలేడు నన్నయ మహర్షి.

తన భోగం కోసం అన్యాయంగా కొడుకు యౌవనం అడిగి పుచ్చుకున్న యయాతి వంశస్థుడు రాజరాజు. ఎంత ఉజ్జ్వల కల్పన!

కలంపోటు – ఒక ఏకాంక రూపిక.

ఈ రచన చేసిన శాస్త్రిగారిలో – ఇప్పటి వారి పరిభాషలో – ఒక అభ్యుదయ కవి దాగి ఉన్నాడు. తిమ్మన పారిజాతాపహరణం గురించి చెప్పుకునే ఒక దంతకథ దీనికి ఆధారం. దాన్ని కవి అన్నవాని ప్రజ్ఞా పారమ్యానికి నిదర్శనంగా చేసి శక్తిమంతంగా నడిపారు.

పారిజాత...రచనలో మునిగి తేలే తిమ్మకవిగారికి మహామంత్రి తిమ్మరుసు కొట్టిన దెబ్బ నసాళం అంటింది. "నే నిప్పుడొక రాచకార్యం లో పడి కొట్టుకుంటున్నాను...ఈ స్థితిలో వాఙ్మయవిషయం... అందు లో శృంగార కవిత్వ..." అనే సన్నాయి నొక్కులతో తిమ్మకవిగారికి గొంతు నొక్కినంతపని అయింది. ఈ బీజాతాపంతో శాస్త్రిగారు కథకు వేగం కల్పించి, తిరుమల దేవి దాసి మంగ. ప్రసంగంతో తిమ్మకవికి తహతహ లెత్తించి, అతని గంటాన్ని అనేక యుద్ధాల్లో ఆరియుతేరిన కర్ణాట సార్వభౌముని మీద మో పెట్టి ఓడించి రసవంతమైన పరి సమాప్తి నిచ్చారు.

రాయల సభలోని సాహిత్య చర్చా సౌరభం ఈ చిన్న నాటికలో అనుభూతమై తత్ప్రియావులను ఎన్నటికీ విడువదు.

అయితే ఒక్కమాట – అభిజ్ఞులైన నటులూ, రసజ్ఞులైన ప్రేక్షకులూ వచ్చేదాకా తెనుగు రంగం మీద ఇట్టి నాటకాల ప్రదర్శనం చూచే యోగ్యత మనకు లేదు.

–4–

రచయితలకు సాధ్యంకాని ఒక అసాధారణ సాహిత్యసంస్థ నడుపుతున్నారు బి శాస్త్రిగారు. దాని పేరే కలాభివర్ధనీ పరిషత్తు. చాలా రోజులు ఈ పేరు సుబ్రహ్మణ్య శాస్త్రిగారి పుస్తకాల అట్టలమీద మాత్రమే కనబడుతూ ఉండేది. ఉండి ఉండి ఒక్కసారిగా కల నిజమైనట్టు ఇది బలిష్ఠంగా ప్రత్యక్షమయింది. పేరుపడిన ఎందరో రచయితలు కలాభివర్ధని పిలుపుతో వచ్చి అసాధారణ గౌరవమంది బిబిజాంబూనదాంబరంబులు గ్రహించి ఉత్సాహ తరంగితంగా ఉపన్యాసాలివ్వడం, కావ్యగానం చెయ్యడం జరుగుతున్నది. ఈ సమావేశాలకు నాయకమణులు నన్నయ్య శ్రీనాథ జయంతులు. వీటి అన్నిటి వెనకా ప్రబలమైన ప్రేరకశక్తి శ్రీ శాస్త్రిగారు. వీరికి సాహితీ ప్రియులైన రాజమహేంద్రవర పౌరులు ఆలంబనం. భేష్. "మణినా వలయః వలయేన మణిః"

మొత్తంమీద – శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారి సాహిత్య వ్యాసంగం గురించి ఒక చిన్న వ్యాసంలో చెప్పడం సాహసికమైన పని. వారి అన్ని రచనల గురించీ సమగ్ర పరిశీలన చెయ్యవలెనంటే ఒక గ్రంథం వ్రాయడం అవసరం. నాకన్న సమర్థులు ఆ పనికి అర్హులనుకుంటాను. ఇంతకూ – శాస్త్రిగారు షష్టి పూరిత వయస్కులే కాకుండా సాహిత్య శతవృద్ధులు గూడా అయి మాకు మార్గదర్శి కావాలని కాంక్షిస్తున్నాము.

(కిన్నెర: సంపుటము 3, సంచిక 5, మే 1951)

జనవాణి

ఆకాశవాణి – ఆంగ్లభాష

ఆకాశవాణి – విజయవాడలో ముఖ్యంగా యఫ్‌యమ్ కృష్ణవేణి వినేవారికి చాలా వరకు ఆంగ్ల పదాలే వినిపిస్తున్నాయి. ఆకాశవాణి ఆంగ్లభాషకు ప్రాముఖ్యం ఇస్తున్నదా? లేక కార్యక్ర మాలు నిర్వహించే వారి పరభాషా నైపుణ్యం చాటుకొనటానికా? అనే విధంగా ఎక్కువ ఆంగ్ల పదాలు వాడి, వినే సామాన్యులకు అర్థం అయినా, కాకపోయినా మా భాష మాది అనే అహం కారమా? తమిళంలో కాని, కన్నడంలో కాని ఆంగ్ల పదాలు ఆలా తక్కువగా వాడతారు. మన వాళ్ళు ఇతరులను చూసి నేర్చుకొనరు. మాతృభాషపై మమకారం చూపరు. పరభాషా వ్యామోహం తగ్గితేగాని ప్రాంతీయ ప్రసారాలకు గౌరవం రాదు.

ప్రొఫెసర్ ఎ.వి. నరసింహం
08678 277155

డి. చంద్రశేఖర్
92900 91232



మూడు అక్రియావాదాలు–బుద్ధుని క్రియాశీలవాదం

మానవుడు పొందే అనుభవాలు స్థూలంగా మూడు రకాలని చెప్పవచ్చు: సుఖకరమైనవి, దుఃఖకరమైనవి, ఈ రెండూ కాని తటస్థ అనుభవాలు. మానవ చరిత్రను పరిశీలిస్తే, ప్రపంచ మంతటా అన్ని కాలాల్లో, ఎటువంటి మినహాయింపు లేకుండా, మనుషులందరూ ఈ మూడురకాల అనుభవాలను ఎదుర్కోవటం కనిపిస్తుంది. అందుకే మానవ జీవితం గురించి శోధించిన తత్త్వవేత్తలందరూ, ఈ అనుభ వాలకు దారితీసే కారణాలను అన్వేషించటానికి ప్రయత్నించారు. ఈ విషయంలో ప్రాచీన భారత తత్త్వవేత్తలు గణనీయమైన కృషి చేశారనేది, ఆధునిక పండితులంతా ముక్తకంఠంతో అంగీకరిస్తున్న ఒక వాస్తవం.

ప్రాచీన భారత తాత్త్వికచింతనలోని భిన్నమైన ధోరణులను లేక వాదాలను క్రోడీకరించి చెప్పటానికి ప్రయత్నించిన తొలిగ్రం థాలు త్రిపిటకాలు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రత్యేకించి బుద్ధుని ఉపదేశాలను ఆయన స్వంతమాటల్లో నమోదుచేశాయని చెప్పబడే, పాలి నికాయాలు మరియు సంస్కృత ఆగమాల్లో, ఆ కాలంనాటి విభిన్న తాత్త్విక ధోరణులను వివరించే సందర్భాలు పుష్కలంగా ఉన్నాయి.

వాటిలో, 'మానవ జీవితపు అనుభవాలకు దోహదం చేసే కారణాలను వివిధ తత్త్వవేత్తలు ఎటువంటి దృష్టితో చూశారు' అనేది చాల మౌలికమైన విషయం. దీని గురించి బుద్ధవచనం ఏం చెబుతుందో చూద్దాం.

ఈవిషయమై అంగుత్తరనికాయలోని ఒక సుత్తం (3:61) చాల స్పష్టమైన విశ్లేషణ అందిస్తుంది. దీనిలో బుద్ధుడు, మానవుని సుఖదుఃఖాలకు ఆనాటి బ్రాహ్మణేతర తత్త్వవేత్తలైన శ్రమణులు, బ్రాహ్మణ పండితులు చెప్పిన కారణాలను కింది విధంగా పేర్కొన్నాడు:

"భిక్షువులారా, (1) కొందరు శ్రమణులు బ్రాహ్మణులు, 'మనిషికి కలిగే సుఖ, దుక్ఖ, తటస్థ అనుభవాలన్నీ గతకర్మల కారణంగానే (పూర్వకతహేతు) పొందుతాడు' అనే దృష్టి కలిగివున్నారు. (2) మరి కొందరు శ్రమణులు బ్రాహ్మణులు, 'మనిషికి కలిగే సుఖ, దుక్ఖ, తటస్థ అనుభవాలన్నీ దైవసృష్టి కారణంగానే (ఈశ్వరనిర్మాణహేతు) పొందుతాడు' అనే దృష్టి కలిగివున్నారు. (3) ఇంకా కొందరు శ్రమణులు బ్రాహ్మణులు, 'మనిషికి కలిగే సుఖ, దుక్ఖ, తటస్థ అనుభవాలన్నీ ఎటువంటి కారణం లేకుండానే (అహేతుప్రత్యయా) పొందుతాడు' అనే దృష్టి కలిగివున్నారు."

పైన ఉటంకించిన మూడురకాల వాదాలను వినిపించే అనేక మంది శ్రమణులను, బ్రాహ్మణులను తాను స్వయంగా కలిసినట్లు బుద్ధుడు అనేక సుత్తాల్లో ప్రకటించాడు. అంతేకాదు, వారి వాదాలు ఏవిధంగా దోషపూరితమైనవో చెప్పటానికి, బుద్ధుడు తగిన కారణాలను కింది విధంగా వివరించాడు.

(1) 'మనిషికి కలిగే సుఖ, దుక్ఖ, తటస్థ అనుభవాలన్నీ గత కర్మల కారణంగానే పొందుతాడు' అనేవాదం ప్రకారం, ఒకవ్యక్తి గతకర్మల కారణంగానే హత్యలు, దొంగతనాలు, వ్యభిచారం చేస్తాడు గతకర్మల కారణంగానే అబద్ధాలు, తంపులమారి మాటలు, దురుసు మాటలు, పనికిరాని మాటలు మాట్లాడుతాడు. అతడు గతకర్మల కారణంగానే లోభి, దుర్మార్గుడు, తప్పుడుదృష్టి కలవాడు అవుతాడు. గతకర్మలు నిర్ణయాత్మకమైనవని నమ్మేవారు, 'ఇది చెయ్యాలి', 'అది చెయ్యకూడదు' అనే సంకల్పం లేనివారవుతారు. ఏది చేయదగిందో, ఏది చేయకూడనిదో తెలియక, అయోమయంలో పడి దిక్కు తోచని వారు అవుతారు.

(2) 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ దైవ సృష్టి కారణంగానే పొందుతాడు' అనేవాదం ప్రకారం, ఒకవ్యక్తి దైవాజ్ఞ కారణంగానే హత్యలు, దొంగతనాలు, వ్యభిచారం చేస్తాడు దైవసృష్టి కారణంగానే అబద్ధాలు, తంపులమారి మాటలు, దురుసు మాటలు, పనికిరాని మాటలు మాట్లాడుతాడు. అతడు దైవాజ్ఞ కారణం గానే లోభి, దుర్మార్గుడు, తప్పుడుదృష్టి కలవాడు అవుతాడు. దైవసృష్టి నిర్ణయాత్మకమైనదని నమ్మేవారు, 'ఇది చెయ్యాలి', 'అది చెయ్యకూడదు' అనే సంకల్పం లేనివారవుతారు. ఏదిచేయదగిందో, ఏదిచేయ కూడనిదో తెలియక, అయోమయంలోపడి దిక్కుతోచనివారు అవుతారు.

(3) 'మనిషికి కలిగే సుఖ, దుక్ఖ, తటస్థ అనుభవాలన్నీ ఎటువంటి కారణం లేకుండానే పొందుతాడు' అనేవాదం ప్రకారం, ఒకవ్యక్తి ఏ కారణం లేకుండానే హత్యలు, దొంగతనాలు, వ్యభిచారం చేస్తాడు ఏ కారణం లేకుండానే అబద్ధాలు, తంపులమారి మాటలు, దురుసు మాటలు, పనికిరాని మాటలు మాట్లాడతాడు. అతడు ఏ కారణం లేకుండానే లోభి, దుర్మార్గుడు, తప్పుడుదృష్టి కలవాడు అవుతాడు. అహేతుకత లేక కారణరాహిత్యం నిర్ణయాత్మకమైనదని నమ్మేవారు, 'ఇది చెయ్యాలి', 'అది చెయ్యకూడదు' అనే సంకల్పం లేని వారవుతారు. ఏది చేయదగిందో, ఏది చేయకూడనిదో తెలియక, అయో

మయంలో పడి దిక్కుతోచనివారు అవుతారు.

బుద్ధుడు ఖండించిన పై మూడువాదాల ప్రకారం, మనిషి చేసే నేరాలు, ఘోరాలు, కుట్రలు, కుతంత్రాలు, యితర అనైతికమైన పనులకు నేరుగా ఎవరూ బాధ్యులు కాజాలరు.

ఎందుకంటే, సదరు వాదాల ప్రకారం, తాను చేసే పనుల్లో ప్రవర్తనలో, మనిషి సంకల్పానికి లేక ప్రయత్నానికి ఎటువంటి స్థానం లేదు. అందుకే బుద్ధుడు ఈ మూడింటిని "లోతుగా పరిశీలించి, పరిశోధించి, విశ్లేషిస్తే, అంతిమ సారాంశంలో అవి అక్రియావాదాలు" గా మిగిలిపోతాయని అన్నాడు.

పైన పేర్కొన్న మూడు అక్రియావాదాలను సూటిగా, స్పష్టంగా తిరస్కరించిన బుద్ధుడు, వాటికి ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన వాదం ఏమిటి? అనేది చాల సహజమైన, విలువైన ప్రశ్న. అక్రియా వాదాలకు కార్యకారణ వాదమే సరైన ప్రత్యామ్నాయమని బుద్ధుని అభిప్రాయం. పాలిభాషలో ఇదాప్పచ్చయతా (నిర్దిష్టకారణ) నియమం అని పిలవబడిన, బుద్ధుని కార్యకారణ వాదాన్ని క్లుప్తంగా యిలా చెప్పవచ్చు: "ఒక వస్తువు లేక ధాతువు లేక స్థితి ఉత్పన్నం కావటానికి తగిన కారణం (లేక కారణాలు) ఉన్నప్పుడే, ఆ వస్తువు లేక ధాతువు లేక స్థితి ఉనికిలోకి వస్తుంది ఆ కారణం (లేక కారణాలు) నిరోధ మైతే, ఆ వస్తువు లేక ధాతువు లేక స్థితి తన ఉనికిని కోల్పోతుంది." అంటే, ప్రతిదానికి ఒక కారణం ఉంటుంది, తనను ఉత్పన్నం చేసిన కారణం నిరోధం కాగానే ప్రతిదీ సమసిపోతుంది.

సరళమైన ఈ సూత్రం ఆధారంగానే బుద్ధుడు, మానవ జీవితపు దురవస్థను రూపుమాపగల సమగ్రమైన మరియు ఆచరణాత్మక మైన మార్గాన్ని సూచించాడు.

బుద్ధుని కార్యకారణ వాదం 'పండితుల' వ్యవహారమే గాని, అది సామాన్యులకు అర్థంకావటం దుర్లభమని కొందరు భావిస్తున్నారు. ఇది ఒక అపోహ మాత్రమేనని చెప్పకతప్పదు. నిజానికి బుద్ధుడు చెప్పిన కార్యకారణ నియమాన్ని, సాధారణ రోజువారి అనుభవం ద్వారా మరియు అత్యంత సూక్ష్మమైన మానసిక ప్రక్రియలను విశ్లేషించటం ద్వారా కూడ అర్థంచేసుకోవచ్చు. ఈ దిశగా రెండు ఉదాహరణలను చూద్దాం.

ఒకటి: ఒకానొక సందర్భంలో, లిచ్ఛవి జాతికి చెందిన భద్దియ అనే గృహస్తునితో బుద్ధుడు జరిపిన సంభాషణ అం.ని. 4:193% కింది విధంగా ఉంది:

"భద్దియ, దురాశకులోనై దాని వశంలో చిక్కిన దురాశాపరుడు జీవహింస, దొంగతనం చేస్తాడు వ్యభిచరిస్తాడు, అబద్ధాలు చెబుతాడు ఇతరులను యిటువంటి పనులకు ప్రేరేపిస్తాడు. ఇది అతనికి దీర్ఘకాలం కీడు, దుక్ఖం కలిగించదా?"..."అవును, భంతే." "భద్దియ, ద్వేషానికిలోనై దాని వశంలో చిక్కిన ద్వేషపరుడు...

మోహానికిలోనై దాని వశంలో చిక్కిన అజ్ఞాని...ఉద్రేకానికి లోనై దాని వశంలో చిక్కిన ఉద్రేకి. జీవహింస, దొంగతనం చేస్తాడు వ్యభిచరిస్తాడు, అబద్ధాలు చెబుతాడు ఇతరులను యిటువంటి పనులకు ప్రేరేపిస్తాడు. ఇది అతనికి దీర్ఘకాలం కీడు, దుఃఖం కలిగించదా?" ..."అవును, భంతే."

పై సంభాషణలో కనిపించే కార్యకారణ నియమం ఏమిటో చూద్దాం. దురాశ, ద్వేషం తదితరమైన కారణాల వల్ల, ఒక వ్యక్తి జీవహింస, దొంగతనాలు, లైంగికదురాచారం మొదలైన పనులు చేస్తాడు. అంతేకాదు, ఆ వ్యక్తి ఇతరులను కూడ అదేరకమైన పనులకు పురికొల్పుతాడు. అటువంటి ప్రవర్తన కారణంగా, అతడు (లేక ఆమె) దీర్ఘకాలంపాటు దురవస్థకు, దుఖానికి లోనుకాక తప్పదు.

కేవలం స్థూల భౌతికవాద దృష్టితో చూసేవారికి, బుద్ధుడు చెప్పినపై ఉపదేశం సబబుగా తోచకపోవచ్చు. ఎందుకంటే, జీవ హింస, దొంగతనాలు, లైంగికదురాచారం వంటి పనులకు పాల్పడి, అందుకు తగిన శిక్షలు లేక ప్రతిచర్యలు పొందకుండా తప్పించుకునే వారు అనేకులు మనకు కనిపిస్తారు.

కాని యిదే విషయాన్ని, మనోవిజ్ఞాన దృక్పథంతో పరిశీలిస్తే, దీనిలో అసలు విషయం మనకు బోధపడుతుంది. జీవహింస, దొంగతనాలు, లైంగికదురాచారం వంటి అకుశలమైన పనులు చేసిన వ్యక్తి, వాటిద్వారా తనలో కలిగే మానసిక క్షోభ నుండి తప్పించుకోలేడు. పైకి ఎంత డాంబికంగా విలాసవంతంగా నిర్భయంగా జీవిసున్నట్లు కనిపించినా, అతడు (లేక ఆమె) నిశ్చింతతో మానసిక ప్రశాంతతో జీవించటం కల్ల. అంతేకాదు, అటువంటి వ్యక్తి యితరులక్కూడా వ్యధాభరితమైన జీవితాన్నే అందిస్తాడు.

రెండు: మనోవిజ్ఞాన దృక్పథం నుండి, బుద్ధుడు కార్యకారణ నియమాన్ని మరింత లోతుగా వివరించిన మరో ఉదాహరణ చూద్దాం. దుక్ఖానికి కారణం ఏమిటి? అనే ప్రశ్నకు బుద్ధుడు సంక్షిప్తంగా చెప్పిన జవాబు యిది:

"భిక్షువులారా, దుక్ఖానికి కారణం ఏమిటి? కన్ను, రూపం ఆధారంగా చక్షువిజ్ఞానం జనిస్తుంది. ఈ మూడింటి కలయికే స్పర్శ. స్పర్శ కారణంగా వేదన, వేదన కారణంగా తృష్ణ జనిస్తుంది. ఇదే దుఖానికి మూలం. (ఇదే రీతిలో తరువాత, చెవి – శబ్దాలు, ముక్కు – వాసనలు, నాలుక – రుచులు, మనసు – భావాల విషయంలో కూడ దుక్ఖం కారణాన్ని వివరించటం జరిగింది.)"

ఈ విషయాన్ని మరింత స్పష్టంగా గ్రహించాలంటే, ఎవరికి వారు తమ మనసు అంతరాళంలోకి ప్రవేశించి, నిశితంగా పరిశీలించాలి. ఈపని ఎంత కష్టమైందో, దానిఫలితం అంతే విలువైంది.

పైన చెప్పిన ఉదాహరణల సారాంశం ఏమిటంటే, మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నిటికీ తగిన కారణం ఉంటుంది. ఆ కారణాలకు మనిషి మనసే చోదకశక్తి.

అంటే, మనిషి సంకల్ప పూర్వకంగా చేసే చర్యలు, మనిషి జీవన గమనాన్ని నిర్దేశిస్తాయి. కనుక, ఎటువంటి చర్యలు కీడు చేస్తాయో, అటువంటి చర్యలను విరమించాలి. ఏవి మేలు చేస్తాయో, అటువంటి వాటిని పెంపొందించాలి. అంటే, తాను పొందే సుఖ దుక్ఖాల్లో మనిషి క్రియాశీలమైన పాత్ర పోషించాలని బుద్ధుడు చెప్పాడు. అందుకే ఆయన, దేవునిపైన లేక విధిరాతపైన గాక, "మీరు మీపైనే ఆధారపడండి, మరెవరిపైనా ఆధారపడవద్దు.

ధర్మాన్ని ఆశ్రయించండి, మరి దేనినీ ఆశ్రయించవద్దు." అని చెప్పాడు. ఇదే బుద్ధుడు మనకందించిన క్రియాశీలవాదం.

డా. ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
98485 98446

కపిలవస్తు నగరానికి బుద్ధుని రాక



తథాగతుడు వేణువనంలో విహరిస్తున్న సమయంలో - కుమారుడు ఆరేళ్ళ కఠోరసాధన చేసి సమ్యక్ సంబోధిని పొందాడనీ, ధర్మచక్రాన్ని ప్రవర్తింపజేసి, నేడు వేణువనంలో విహరిస్తున్నాడనీ మహారాజు శుద్ధోదనునికి తెలిసింది. శుద్ధోధనుడు మంత్రిని పిలిచి అతనితో, "నా ఆజ్ఞగా వేయిమందిని తీసుకొని రాజగృహానికి వెళ్ళి, నీ తండ్రి శుద్ధోదనుడు నిన్ను చూడాలనుకొంటున్నాడని చెప్పి, నా కుమారుని తీసుకురా" అని చెప్పాడు.

"అలాగే ప్రభూ" అన్న మంత్రి, రాజాజ్ఞను శిరసావహించి వేయిమందిని తీసుకొని అరవై యోజనాలు ప్రయాణించి బుద్ధుడు నాలుగు పరిషత్తుల మధ్యన కూర్చుని ధర్మబోధ చేస్తుండగా విహారంలో ప్రవేశించాడు. "రాజసందేశం సంగతి తరువాత" అనుకుని ఒక ప్రక్కన నిలబడి ధర్మదేశనాన్ని వింటూ ఆ మంత్రి మిగిలిన వేయిమంది తోసహా ప్రవ్రజ్యనిమ్మని అడిగి అర్హంతుడై పోయాడు. బుద్ధభగవానుడు "భిక్షులారా! రండి" అని చేతిని చాపాడు. వారందరూ కూడా భిక్షాపాత్ర, చీవరాలను ధరించారు. అలా అర్హంతులైన వారు "ఆర్యులు తటస్థులుగా ఉంటారు" అనుకుని సందేశాన్ని బుద్ధునికి వినిపించలేదు.

"వెళ్ళినవాడింకా తిరిగి రాలేదు. కనీసం వర్తమానమన్నా పంపలేదు" అనుకొన్న శుద్ధోధనుడు, మరో మంత్రిని పంపాడు. అతడు కూడా అనుచరులతోపాటు అర్హంతుడై, రాజశాసనం విషయాన్ని పక్కనపెట్టాడు. అలా మొత్తం తొమ్మిది మంది మంత్రులను పంపగా వారందరూ అనుచర సహితంగా అర్హంతులై రాజశాసనం విషయంలో మౌనంధరించి, రాజగృహంలోనే ఉండిపోయారు. కనీసం లేఖద్వారానైనా విషయాన్ని తెలియజేయగలిగిన వారు కనబడక పోవడంతో రాజు ఇలా అనుకొన్నాడు. "నేనంటే ప్రేమ గలవారిందరు వెళ్ళికూడా కనీసం పత్రమన్నా తేలేదు. ఇపుడు నా మాటను తెలియజేయగలవారెవరు మిగిలారు?". అపుడాయన రాజపురుషుల మండలినంతా పారజూస్తూ, కాలుదాయి పై దృష్టిని నిలిపాడు. అతడు రాజుకు పూర్తి ఆంతరింగికుడూ, విశ్వాసపాత్రుడూ, సర్వార్థసాధకుడూ అయిన మంత్రి. అతడు బోధిసత్త్వుడు పుట్టినరోజునే పుట్టిన, బోధిసత్త్వుని చిన్ననాటి స్నేహితుడు కూడా. శుద్ధోధనుడు అతన్ని చూసి "నాయనా కాలుదాయీ! నేను నా కుమారున్ని చూడాలనుకొంటున్నాను. తొమ్మిదివేల మందిని పంపాను కానీ వారిలో కనీసం పత్రం తెచ్చిన వారొక్కరైనా లేరు. శరీరం అస్థిర మైనది. నేను బ్రతికి ఉండగానే నా కొడుకును చూడాలను కొంటున్నాను. నువ్వు నా కుమారుని తెచ్చి నాకు చూపించగలవా?"

"ప్రభూ! ప్రవ్రజించేందుకు అనుమతి దొరికినట్లయితే తప్పక తీసుకు రాగలను."

"ప్రవ్రజితుడివైనా సరే, కాకపోయినా సరే. నా కొడుకును తెచ్చి చూపించు చాలు."

"అలాగే ప్రభూ!" అన్న కాలుదాయి రాజశాసనాన్ని తీసుకుని రాజగృహాన్ని చేరాడు. బుద్ధుడు ధర్మదేశనం చేస్తున్న సమయంలో పరిషత్తు చివర నిలబడిన అతడుకూడా అనుచర సహితంగా అర్హంత ఫలాన్ని పొందాడు. "రండి భిక్షులారా" అనగానే భిక్షువైపోయాడు. సిద్ధార్థుడు, బుద్ధుడైన తరువాత మొదటి వర్షావాసాన్ని ఋషిపట్టణం (సారనాథ్)లోనే గడిపాడు. ఆ తరువాత వర్షావాసాంతంలో ప్రవారణ చేసుకొని ఉరువేలకు వెళ్ళాడు. అక్కడ ముగ్గురు జటిలసోదరులనూ సన్మార్గానికి మళ్ళించి, ఆ పై అనుచరులైన వేయిమంది జటిలురతో బాటుగా పుష్యమి మాసానికల్లా రాజగృహం చేరుకున్నాడు. అక్కడ రెండు నెలలున్నాడు. ఇప్పటికి వారణాశి నుండి బయలుదేరి అయిదు

మాసాలు అవుతుంది. హేమంత ఋతువు గడచి పోయింది. ఉదాయి స్థవిరుడు వచ్చి ఏడెనిమిది రోజులయ్యింది. ఫాల్గుణ పౌర్ణమాసి రోజున కాలుదాయి స్థవిరుడు ఆలోచనలో పడ్డాడు. "హేమంతం వెళ్ళి వసంతం వచ్చింది. రైతులూ మనుష్యులూ పైరులను కోసి త్రోవలను బాగుచేశారు. భూమంతా పచ్చని పచ్చిక పరచుకొని ఉంది. వనఖండాలన్నీ పుష్పించాయి. రహదారులు ప్రయాణానికి అనుకూలమయ్యాయి. బుద్ధుడు తన జాతిని ఉద్ధరించదగిన సమయం యిది." ఇలా ఆలోచించిన ఆయన భగవానుని దరి చేరాడు.

"భంతే! ఫలాకాంక్షతో వృక్షాలు ఆకులను విడిచి అగ్నికణాలను ధరించి నట్లున్నాయి.

మహావీరా! అవి అగ్నిశిఖలలా అగుపడుతున్నాయి... ఇది రసాల కాలం.

"మరీ చలి లేదు. మరీ వేడి లేదు. అన్నానికి బాధ లేదు. భూమి పచ్చదనంతో శోభిస్తుంది.

మహామునీ! ఇదే ప్రయాణించేందుకు తగిన సమయం."

అంటూ అరవై గాథలతో బుద్ధుని ముందు కులనగర గమనాన్ని ప్రశంసించాడు.

"ఉదాయీ! ఇలా మధుర స్వరంతో యాత్రను గురించి ప్రశంసించిన కారణమేమిటో!" అన్నాడు బుద్ధుడు.

"భంతే! మీ తండ్రి శుద్ధోదన మహారాజు మిమ్మల్ని చూడాలనుకొంటున్నాడు. (స్వ)జాతివారిని ఉద్ధరించాలి".

"ఉదాయీ! నేనలాగే జాతివారిని ఉద్ధరిస్తాను. నువ్వు యాత్రకు అవసరమైన కర్మలను పూర్తి చేయమని భిక్షు సంఘానికి తెలియజేయి."

"మంచిది భంతే" అని ఆయన ఆ సంగతిని భిక్షుసంఘానికి తెలియజేశాడు. భగవానుడు అంగ-మగధలకు చెందిన కులపుత్రులు పదివేలమంది, కపిలవస్థు నివాసులు పదివేలమందితో బాటుగా రాజగృహాన్ని వీడాడు. రోజుకు యోజనం చొప్పున నడువ సాగాడు. రాజగృహంనుండీ అరవై యోజనాల దూరంగల కపిల వస్తును రెండు మాసాల్లో చేరే ఉద్దేశ్యంతో నడకను మెల్లగా సాగించాడు.

ఈలోగా, శాక్యులు భగవానుడు విహరించవలసిన చోటును గురించి ఆలోచన చేసారు. న్యగ్రోధుడనే శాక్యుని ఆరామం రమణీయమని ఎరిగి దానిని శుభ్రం చేయించారు. గంధపుష్పాలను చేతికిచ్చి, చక్కగా అలంకృతులైన బాలబాలికలను ముందుగా ఆహ్వానానికై పంపారు. ఆ వెంటనే కుమారులనూ, కుమార్తెలనూ పంపి ఆ తరువాత తామే స్వయంగా గంధపుష్ప చూర్ణాదులతో భగవానుని పూజిస్తూ న్యగ్రోధారామానికి కొనిపోయారు. అక్కడ క్షీణాస్రవులైన ఇరవై వేల మంది అర్హంతులతో బాటుగా భగవానుడు అమర్చివున్న బుద్ధాసనంపై ఆసీనుడయ్యాడు.

మరునాడు భగవానుడు భిక్షువుల సహితంగా భిక్షాటనకై కపిల వస్తును ప్రవేశించి. ఇంద్రకీలంవద్ద నిలబడి ఆలోచించ సాగాడు- "ముందటి బుద్ధులు - కులనగరంలో భిక్షాటనమెలా చేశారు? మధ్యలో కొన్ని ఇళ్ళను విడుస్తూనా, లేక ఒకదాని తరువాతొకటిగా ప్రతి ఇంటికీ వెళుతూనా?" కనీసం ఒక బుద్ధుడైనా మధ్యన కొన్ని ఇళ్ళను విడిచి భిక్షకై చరించటం కానరాలేదు. "నాదీ బుద్ధుల వంశమే కనుక నేనీ కుల ధర్మాన్నే గ్రహించాలి. దీనివల్ల రానున్న కాలంలో నా శ్రావకులు నన్నే అనుసరిస్తూ భిక్షాటన వ్రతాన్ని పూర్తి చేయగలరు." అనుకొని మొదటి ఇంటినుండే భిక్షాటనను ప్రారంభించాడు. "ఆర్య సిద్ధార్థకుమారుడు భిక్షాటనం చేస్తున్నాడ"ని విన్న ప్రజలు రెండు, మూడంతస్థుల మేడల పైనుండీ కిటికీలను తెరచి క్రిందికి చూస్తున్నారు.

రాహులమాతాదేవి (యశోధర) కూడా దీనిని విన్నది. "ఆర్య పుత్రుడీ నగరంలోనే ఎంతో రాజఠీవితో బంగారు పల్లకీలల్లో తిరిగాడు. కేశాలూ, గడ్డమూ తీసివేసి కాషాయాన్ని ధరించీ ఈ రోజునీ నగరంలోనే పాత్ర చేతపట్టుకుని భిక్షాటన చేస్తున్నాడు. ఇదేమైనా శోభనీయమా!" అంటూ కిటికీని తెరచింది. విరాగం వల్ల ఉజ్జ్వలమైన దేహకాంతితో నగరపథాన్ని ప్రకాశింపజేస్తూ అనుపమమైన సంబోధి సిరితో విరాజిల్లుతున్న భగవానుని చూసింది. రాజుతో "మహారాజా! మీ కొడుకు భిక్షాటనం చేస్తున్నాడు" అని చెప్పింది. రాజు కలవర బాటుతో లేచి, ధోవతిని సరిచేసుకొంటూ వడిగా మేడమెట్లను దిగాడు. భగవానుని ముందు నిలబడి "భంతే! మమ్మెందుకిలా సిగ్గుకు గురిచేస్తున్నావు? భిక్షాటనెందుకు? మా వద్ద ఇందరు భిక్షువులకు భోజనమే దొరకదా!" అన్నాడు.

"మహారాజా! ఇది మా వంశాచారం."

"భంతే! మనది మహాసమ్మత క్షత్రియ వంశం. ఒక్క క్షత్రియుడైనా ఎన్నడూ భిక్షాచారి కాలేదు".

"మహారాజా! బాటసారులకు సత్రంలా నాకు క్షత్రియవంశంతో ఉన్న సంబంధం తాత్కాలికం. బుద్ధపురుషులే నా పూర్వ వంశీయులు. నా వంశాచారాన్నే నేను పాటించాలి."

రాజు భగవానుని భిక్షాపాత్రను చేతిలోకి తీసుకుని ఆయనను భిక్షుసంఘ సహితంగా మేడ నెక్కించాడు. స్వహస్తాలతో ఖాదనీయ, భోజనీయాలను వడ్డన చేసాడు. భోజనం పూర్తయిన తరువాత ఒక్క రాహులమాత తక్క రాణివాసపు స్త్రీలు అందరూ భగవానునికి వందనమాచరించారు. "వచ్చి ఆర్యపుత్రునికి అభివాదం చేయ"మని పరిజనుని పంపి నప్పటికీ, "నాలో గుణముంటే ఆర్యపుత్రుడే స్వయంగా నాదగ్గరకు వస్తాడు. అప్పుడే నేను వందన మాచరిస్తాను" అని ఆమె రాలేదు.

పాత్రను రాజు చేతికిచ్చి భగవానుడు ఇరువురు అగ్రశ్రావకులతో బాటుగా రాకుమారి శయనాగారాన్ని ప్రవేశించాడు. "రాకుమారికి తోచినట్టుగా వందనమాచరించనివ్వండి. ఏమనకండి." అని వారికి చెప్పి పరచివున్న ఆసనం పైన కూర్చున్నాడు. ఆమె వడివడిగా వచ్చి ఆయన చీలమండలను పట్టుకుని, తలను పాదాలపై ఉంచి, తనకు తోచినట్లుగా వందన మాచరించింది. రాజప్పుడు ఆమెకు భగవానుని పట్లగల ప్రేమాభిమానాలను గురించి చెప్పసాగాడు- "భంతే! నా కూతురు నీ కాషాయ వస్త్రధారణను గురించి విన్నప్పటి నుండీ, తానూ కాషాయవస్త్రధారిణి అయ్యింది. ఒకసారే భుజించటం గురించి విని, తానూ ఏకాహారిణి అయ్యింది. - ఉన్నతమైన

పాన్పులను వీడడం గురించి విని తాను కూడా చిన్న శయ్య పైననే శయనించ సాగింది. మాలాగంధవిరహితుడ వైనట్లు విని తానూ వాటిని ధరించడం మాని వేసింది.” ‘నీ సేవా సుశ్రూషలు చేస్తాం రా’ అని పుట్టింటి వారి వైపునుండీ ఎన్ని లేఖలు వచ్చినా వాటిని కన్నెత్తి చూడదు. భగవాన్! నా కూతురంత గుణవతి.” భగవానుడా తరువాత ధర్మదేశనం చేసి ఆసనంనుండీ లేచి నిష్క్ర మించాడు.

మూడవరోజున, అంటే రాకుమారుడు నందుని అభిషేక, గృహప్రవేశ, వివాహాలు మూడూ జరుగవలసిన శుభదినాన భగవానుడు భిక్షకు బయలుదేరాడు. శుభమని పలికి లేచివెళ్ళేటప్పుడు రాకుమారుడు నందుని చేతి నుండి భిక్షాపాత్రను తిరిగి తీసుకోలేదు. తథాగతుని పట్లనున్న గౌరవాదరాలవల్ల “భంతే !భిక్షాపాత్రను తిరిగి తీసుకొమ్మ”ని అతడూ అనలేక పోయాడు. ‘మెట్లు దిగి తీసుకుంటాడు: వాకిట తీసుకుంటాడు’ అనుకొంటూ అతడు వెనుకే వెళుతున్నాడు కానీ బుద్ధుడు మాత్రం ఎక్కడా తిరిగి తీసుకోలేదు. అక్కడ ఉన్నవారు వెళ్ళి అతని భార్య అయిన జనపద కల్యాణి (సుందరి)తో “భగవానుడు నందరాకుమారున్ని వెంటతీసు కొని పోతున్నాడు. ఆయన మీ ఆయనను నీక్కాకుండా చేసేస్తాడు” అని చెప్పారు. ఆమె తడిచిన కురులూ చేత దువ్వెనతో వడివడిగా పై అంతస్థుకు వెళ్ళి కిటికీని తెరిచింది. “ఆర్యపుత్రా! త్వరగా తిరిగి రావాలి” అని అరిచింది. ఈ పిలుపు నందుని గుండెలను కలచి వేసింది. బుద్ధుడు అలాగే విహార ప్రవేశం చేసి “నందా! ప్రవ్రజితుడివవుతావా?” అని అడిగాడు. ఎదురు చెప్పలేక “ఆఁ, అవుతాన”న్నాడు. “నందుని ప్రవ్రజితుని చేయండి” అని భగవానుడన్నాడు. ఇలా కపిలవస్తును చేరిన మూడవ రోజున ఆయన నందకుమారుని ప్రవ్రజితుడిని చేసాడు.

ఏడవ రోజున యశోధర కొడుకు రాహులుని అలంకరించి, ‘నాయనా! ఆ ఇరవై వేలమంది మధ్యన కూర్చుని బంగారు కాంతులను వెదజల్లుతున్న...ఆ శ్రమణుని చూడు. ఆయనే నీ తండ్రి. ఆయన వద్ద అనేక నిధులుండేవి. అవి ఆయనిల్లు వదిలిన నాటినుండీ కనబడడంలేదు.” అని చెప్పి బుద్ధభగవానుని వద్దకు పంపింది.

భగవానుడు పూర్వాహ్న సమయాన, పాత్రచీవరాలను తీసుకుని శుద్ధోదన శాక్యునింటికి వెళ్ళాడు. అపుడు యశోధర రాహు లునితో “రాహులా! ఆయనే నీ తండ్రి. వెళ్ళి ఆస్థిలో నీ భాగాన్నిమ్మను” అని చెప్పి పంపింది. అపుడు రాహుల కుమారుడు భగవానుని ముందుకు వెళ్ళి ఆయన ముందు నిలబడ్డాడు. “శ్రమణా! నీ నీడ చాలా సుఖకరంగా ఉంది” అన్నాడు. భగవానుడప్పుడు ఆసనంనుండీ లేచి నడువసాగాడు. రాహులుడు ఆయన వెంటే నడుస్తూ “శ్రమణా నా వారసత్వ భాగం నాకివ్వు” అనసాగాడు. భగవానుడు తలను తిప్పి, “శారిపుత్రా! అలాగైతే రాహులునికి ప్రవ్రజ్యనివ్వు” అని అన్నాడు.

“భంతే! రాహులకుమారుని కే విధంగా ప్రవ్రజ్యనివ్వాలి?” అని అడిగాడు శారిపుత్రుడు.

ఈ సందర్భంలోనే ధర్మ దేశనాన్ని చేసిన భగవానుడిలా అన్నాడు– “భిక్షులారా! మొదట కేశాలను తీయించి కాషాయాన్ని కట్టబెట్టాలి. ఆ తరువాత ఉత్తరాసంగాన్ని ఒక భుజం పైకి సర్దించి వీరాసనంలో కూర్చోబెట్టాలి. చేతులు జోడింప జేసి ఇలా అనమనాలి.

“బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి, సంఘం సరణం గచ్ఛామి.”

దుతియంపి బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి.

తతియంపి బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి.”

అపుడు ఆ శారిపుత్రుడు రాహులకుమారుని ప్రవ్రజింప జేశాడు. ఆ తరువాత శుద్ధోదన శాక్యుడు భగవానుని సమీపించి, అభివాదం చేసి ఒక ప్రక్కన కూర్చుని– “భంతే! నేను భగవానుని నుండి ఒక వరాన్ని కోరుతున్నాను.” అన్నాడు.

“గౌతమా! తథాగతుడు వరాలకు అతీతుడు.” బుద్ధభగవాను డన్నాడు.

“భంతే! ఇది ఉచితమైంది. దోషరహితమైంది.” శుద్ధోధనుడు చెప్పాడు.

“అదేమిటో చెప్పు గౌతమా.” అడిగాడు భగవానుడు.

“భంతే! భగవానుడు ప్రవ్రజితుడైనప్పుడు నాకెంతో దుఃఖం కలిగింది. అలాగే నందుడు ప్రవ్రజితుడైనప్పుడు కూడా దుఃఖం కలి గింది. ఇప్పుడు రాహులుని ప్రవ్రజ్యతో అది మిక్కుటమైపోయింది. భంతే! పుత్ర ప్రేమ చర్మాన్ని ఛేదిస్తుంది. చర్మాన్ని ఛేదించి నా మాంసాన్ని, నాడులను, ఎముకలను ఛేదిస్తుంది. భంతే! ఆర్యులు (భిక్షువులు) తలిదండ్రుల అనుమతి లేని వారికి ప్రవ్రజ్యనీయకుంటే బాగుంటుంది.”

ఆ తరువాత భగవానుడు ఆయనకు ధర్మదేశన చేశాడు...అపుడాయన లేచి భగవానునికి అభివాదన ప్రదక్షిణలు చేసి నిష్క్రమించాడు. భగవాను డిదే సందర్భంలో ధర్మ దేశనం చేసి భిక్షువులతో ఇలా అన్నాడు

“భక్తులారా తలిదండ్రుల అనుమతి లేని వారికి భిక్షువులు ప్రవ్రజ్యనివ్వకూడదు. ఇచ్చిన వానిది దుష్కృత దోషం.”

మహామౌద్గల్యాయనుడు రాహులునికి తలగొరిగి కాషా యాన్ని కట్టి త్రిశరణగమనం చేయించాడు. మహాకాశ్యపుడు ఉపదేశమిచ్చే ఆచార్యుడయ్యాడు.

(మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్ ‘శ్రీబుద్ధచర్యా’ లోని భాగానికి అనువాదం)

భాషోద్యమ కథానిక

పేరుబలం

ఆచార్య కొలకలూరి ఇనాక్
94402 43433

'మీ పేరేమో ఇంగ్లీషు పేరు కావచ్చు.
ఇంగ్లీషులో మాత్రం రాయరు.
మేం ఇంగ్లీషులో రాస్తే తప్పు అంటారు.
బాగుందండి మీ వరస!'

నేను తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా ఉన్నప్పుడు బంధువుల్ని పలకరించటానికి భీమవరం వెళ్ళాను. ఎవరింటికీ వెళ్ళకుండా ఎక్కడయినా వసతి చూచుకోవాలను కొన్నాను. ఎక్కడ బాగుంటుందని అడిగితే 'విజయ లక్ష్మి' మేలు అన్నారు.

వెళ్ళి, 'గది కావాలి' అన్నాను.

'సింగిలా? దబలా?' అని అడిగాడు.

'నేనొక్కణ్ణే' అన్నాను.

'అయితే సింగిల్ తీసుకోండి' సలహా ఇచ్చాడు.

'సరే' అన్నాను.

'ఏసినా? నానేసినా?' అని అడిగాడు.

'అసలే చలికాలం' అన్నాను.

'అయితే నాన్ – ఏసీ సింగిల్ ఇస్తాను' అన్నాడు.

'సరే' అన్నాను.

'ఎన్ని రోజులుంటారు?'

'రెండు రోజులు'

'చెకిన్ ఎప్పుడయినా, చెకవుట్ మిడ్డే ట్వెల్వో క్లాక్' అన్నాడు.

'సరే' అన్నాను.

'టూ డేస్ కదా! త్రీ దవుజండ్ అడ్వాన్సు ఇవ్వాలి' అన్నాడు.


'అలాగ్గే' అన్నాను.

'రిజిష్టర్‌లో పేరు, ఊరు, అడ్రసు, ఫోను నెంబరు రాయండి' అన్నాడు.

'భోజనం ఇక్కడేనా? బయటా?' అడిగాను.

'హోటల్ ఎటాచ్‌డ్! వెజ్ ఆ? నాన్ వెజ్ ఆ?' సమాచారం చెప్పాడు. ప్రశ్నలు అడిగాడు.

'ఏదైనా ఫరవాలేదు' అన్నాను.



'హోటల్‌లో తింటారా? రూంకు తెప్పించుకొంటారా?

'గదిలోనే అనుకూలంగా ఉంటుంది కదా!'

'మీ యిష్టం' అన్నాడు.

'పిలిస్తే, తెచ్చి పెట్టటానికి, పిల్లలు ఉంటారు కదా! వస్తారు కదా!'

'బెల్ కొట్టండి. బోయిస్ వస్తారు. ట్వంటీ ఫోర్ అవర్స్ సర్వీసు. డ్రింక్స్ అవసం ముంటుందా?'

'అవసరం ఉండదు' చెప్పాను.

'నో ప్రాబ్లం. బోయిస్‌కి టిప్స్ ఇవ్వండి. మాట వింటారు'

'సరే!'

'వినోదానికి?' అడిగాను.

'టి.వి. ఉంది. ఫోన్ ఉంది. రిమోటు చేతిలో ఉంటుంది. సినేమాహాలు వెరీ నియర్. నో వరీ!' అన్నాడు.

'సంతోషం' అన్నాను

'పర్సనల్ డిటెయిల్స్ రిజిస్టర్‌లో రాయండి' అని దాన్ని ముందుకు నెట్టాడు.

సీరియల్ నెంబరు – వేశాను.

నేమ్ – కొలకలూరి ఇనాక్ రాశాను.

మొబైలు – వేశాను.

అడ్రస్ – ఉపాధ్యక్షులు చిరునామా ఇచ్చాను.

కమింగ్ ఫ్రం – తిరుపతి.

గోయింగ్ టూ తిరుపతి.

సిగ్నేచర్ – చేశాను.

అడ్వాన్స్ – రూపాయిలు మూడు వేలు.

అన్ని గళ్ళూ నింపినప్పుడు, నా ముఖంలోకి ఎగాదిగా చూశాడు.

'ఇంగ్లీషు రాదా?' అని అడిగాడు.

'వస్తుంది!' అన్నాను.

'మరి తెలుగులో రాశారేం?'

'మనం తెలుగు వాళ్ళం కదా!'

'ఢిల్లీలో ఏ భాషలో రాస్తారు?'

'హిందీలో'

'అమెరికాలో?'

'ఇంగ్లీషులో!'

'ఆంధ్రప్రదేశ్ అంత అలుసా? ఇంగ్లీషు లో రాయలేదు. హిందీలో రాయలేదు. తెలుగులో రాశారు!!!'

'అలుసు కాదు. గౌరవం! మన రాష్ట్రం! మన భాష! మన రాష్ట్రంలో మనం మనభాష వాడుకోవచ్చు కదా!'

'ఏం గోలో? అడ్వాన్స్ త్రీ థౌజండ్ ప్లీజు!'

మూడు వేలు ఇచ్చాను. 'రిసీట్ తీసుకొని రూంకు పొండి'. అన్నాడు. రాశాడు. కాగితం చించి ఇచ్చాడు.

చూశాను. అది ఇంగ్లీషులో రాశాడు.

'ఇది నాది కాదు' అన్నాను. 'వాట్?' అన్నాడు.

'నా పేరుతో కదా దీన్ని ఇవ్వాలీ' అన్నాను.

'అది మీ పేరే!'

'నా పేరు తెలుగులో ఉంది'.

'నేను ఇంగ్లీషులో రాశాను'

'ఇంగ్లీషులో నా పేరు ఇట్లా ఉండదు. వేరే అక్షర క్రమం ఉంటుంది' 'ఏదో లెండి. రిసీట్ ఇచ్చాను కదా!' నవ్వాడు. నేనూ నవ్వాను. 'మీరు యజమానా? ఉద్యోగా?' అన్నాను.

'బోత్!' అన్నాడు.

'నాకు తెలుగులో రసీదు ఇచ్చి ఉంటే మీకు ఇబ్బంది ఏమిటి?'

'ఏం ఇబ్బంది లేదు'

'అయితే రాసి ఇవ్వండి'

నా పేరు నేనెట్టా రాశానో అట్లా తెలుగులో రాశాడు.

ఆ ఆలు నేర్చుకొంటున్న పిల్లల రాతలాగా ఉంది.

'ఏం పేరిది?'

'నా పేరు!'

'ఇసాకా?'

'కాదు. ఇనాక్'

'ఇంగ్లీషు పేరా?'

'అవును'.

'మీ పేరేమో ఇంగ్లీషు పేరు కావచ్చు. ఇంగ్లీషులో మాత్రం రాయరు. మేం ఇంగ్లీషులో రాస్తే తప్పు అంటారు. బాగుం దండి మీ వరస!'

'అది అమ్మ పెట్టిన పేరు. నాది అమ్మ నేర్పిన భాష.

ఏ పుణ్య ముహూర్తాన ఆ పేరు పెట్టిందో నాలుగు తెలుగు మాటలు వచ్చాయి. తెలుగు బోధించే స్థాయి వచ్చింది. అది పేరు బలం!

'తెలుగూ ఇంగ్లీషూ కలిసి మీ పేరు ఉండవచ్చు గాని, మేం ఇంగ్లీషూ తెలుగు కలిపి మాట్లాడినా, రాసినా మీకు ఇష్టం కాదు. కష్టం! అవునా?'

'ఎంత చక్కగా తెలుగు మాట్లాడా రండి! ధన్యవాదాలు'.

నవ్వాడు యజమాని – ఉద్యోగి, రెండూ అయిన మనిషి.

'కాఫీ తెప్పిస్తాను. తాగి రూంకు వెళుదురుగాని' అన్నాడు.

'నేను మజ్జిగ మాత్రమే తాగుతాను!'

'ఇంత చలిలోనూ!'

'ఎల్లప్పుడు!'

'అందులోనూ తెలుగేగా?'

'అసలు సిసలు తెలుగు వాళ్ళు కదా!'

ఎంత హాయిగా నవ్వేడంటే అంత హాయిగా అతను తన బాల్యంలో ఎప్పుడు నవ్వాడో గుర్తు చేసుకోవలసిందే!

'ఇంత పెద్ద ఉద్యోగి మీరు. తెలుగు అంటే అంత ప్రేమ ఎందుకు?'

'అన్నం పెట్టింది కదా!'

'ఏమిటీ?'

'అమ్మ కదా!'

కౌగిలించుకొని 'హాయిగా ఉంది!' అన్నాడు.

'నాకూ సుఖంగా ఉంది' అన్నాను. తాళం తీసుకొని నా గదికి బయలుదేరాను. పిల్లవాడు సామాను తెస్తున్నాడు.

తృప్తిగా, ఆనందంగా చూస్తున్న యజమాని + ఉద్యోగిని– వెనుదిరిగి చూస్తే పరమానందం కలిగింది.

– రచయిత
ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ
అధ్యక్షులు

రావి కొండలరావు
98480 71175

ఓ తెలుగూ.....నీ వెక్కడ?

ఉన్న తెలుగు మాటల్ని ఉపయోగించకుండా వదిలేసి, అవసరంలేని ఇంగ్లీషు పదాలకి తెలుగు ఆలోచిస్తూ కాలయాపన చేస్తున్నాం తెలుగువాళ్ళం! స్వచ్ఛమైన తెలుగు పదాలు ఆలస్యం, కాయగూరలు, సేపు, నూనె, అలాగే, నిమిషం, క్షణం – వంటి మన మాటల్ని వదిలేసి, లేటు, వేజిటబుల్స్, టైము, ఆయిలు, ఓకే, మినిట్ – అని ఆంగ్ల పదాలు వాడుతున్నాం. ఇవాళ ఏ ఒక్కరూ 'ఆలస్యం' అనడం లేదు. చదువుకోని వాళ్ళు కూడా లేటయింది, లేటుగా వస్తాను అంటున్నారు.. పెన్సిల్ కీ, రబ్బర్‌కీ, మొబైల్ ఫోన్‌కీ, పెన్‌కీ, బాల్‌పాయింట్‌కీ తెలుగేమిటా అని తలలు పగల గొట్టుకుంటున్నాం. ఒక్క విషయం గమనించాలి – తెలుగుభాష పుట్టినప్పుడు కంప్యూటర్, టెలిఫోన్, టెలివిజన్ పుట్టలేదు. ఇలాంటివి ఇంకా ఎన్నో పుట్టాయి. అవి వాటి పేర్లు. వాటికి తెలుగులో ఏం పెట్టాలా అని ఆలోచించడం వ్యర్థ ప్రయాస...వార్తలు రాసేవాళ్ళూ యథాతథంగా అనువదించి రాసేస్తున్నారు. ఇంటర్‌నెట్‌కి, యధాతథ అనువాదం – అంతర్జాలం. ఇంటర్ అటే, అంతర్, నెట్ అంటే వల. అంటే జాలం. ఎవరు వాడతారు ఈ మాటలు? 'నెట్' అనే అంటారు. మొబైల్ ఫోన్‌కి చరవాణి, సంచారవాణి! "మీ దగ్గర సంచారవాణి వుందా?" అని ఎవరైనా అడుగుతారా? ఇంగ్లీషులో లాటిన్, గ్రీక్ భాషల పదాలు కలిశాయి. సంపన్నమైంది. తెలుగులోనూ ఇంగిలీషు, ఉర్దూ, సంస్కృత పదాలు ఎన్నో కలిసాయి. రోడ్డు అనే ఇంగ్లీషు మాట, అసలు...ఉర్దూ పదాలూ తెలుగైపోయి కూచున్నాయి. పలుభాషలు కలిస్తే భాష విస్తృతమవుతుంది. ప్రపంచ భాషలన్నీ అంతే! తెలుగు భాష రానురాను తగ్గిపోతున్నదని చెప్పడానికి చాలా కారణాలు చెప్పొచ్చు. తెలుగు జాతీయాలు, సామెతలూ ఎందుకు చెప్పుకోడం?

ఈ మధ్య ఒక పత్రిక – "మేక్ హే వైల్ ది సన్ షైన్స్" అన్న దానికి తెలుగు అనువాదం చేసింది. "ఎండ వుండగానే, గడ్డి ఎండ బెట్టాలి" అని. దీనికి ప్రత్యామ్నాయం లేదా? మన జాతీయం – "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టాలి" అన్నది కదా? ఎందుకు వాడరు?

వార్తలు ఇంగ్లీషులో వస్తాయి. వాటిని తెలుగు చేసి రాస్తారు పత్రికలవాళ్లు. "వర్క్ ఈజ్ బీయింగ్ డన్ ఆన్ వార్ ఫూటింగ్" అని ఇంగ్లీషులో వుంటే "యుద్ధ ప్రాతిపదినక పనులు జరుగుతున్నాయి" అన్నది తెలుగు. "అత్యంత వేగంగా పనులు జరుగుతున్నాయి" అని రాస్తే తెలుగు కాదా? "ఏక రూప వస్త్రాలు" అన్నమాట విన్నారా? – అంటే యూనిఫార్మ్ కి తెలుగు!

'కష్టమర్ కేర్' కి వినియోగదారుల రక్ష! అసలు ఈ యధాతథ అనువాదం నూరేళ్ల ముందు నుంచీ వుంది. హైస్కూలు కి తెలుగు 'ఉన్నత పాఠశాల' హై అంటే ఎత్తయినది – అంటే ఉన్నతమైనది. కొండ మీద వుందా పాఠశాల?...ఎలిమెంటరీ స్కూల్‌ని ప్రాథమిక పాఠశాల అన్నారు. బాగుంది. హైస్కూలుని 'మాధ్యమిక పాఠశాల' అనవచ్చుగా. ఇంగ్లీషువాళ్ళు లెక్కకిరాని సొమ్ముని బ్లాక్ మనీ అంటారు. మనం దొంగ సొమ్ము అనవచ్చు. పత్రికలవాళ్ళు 'నల్లధనం' అని ఎందుకు రాస్తారో అర్థం కాదు. యథాతథ అనువాదము ముప్పు! మొన్న ఒకాయన లాప్‌టాప్‌కి తెలుగు ఆలోచిస్తున్నాడు! ఎంత ఆలోచించి ఏ పేరు పెట్టినా లాప్‌టాప్ అనే అంటాం. దాని పేరు అదీ! కంప్యూటర్ ఛిప్, బ్రౌస్, యాప్ – ఈ పదాలకి తెలుగు ఆలోచించకండి. ఏ భాషలో అయినా వాటి పేరు అదే.

ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రి అయాక, తెలుగు మాటలు పెట్టాలని, 'పబ్లిక్ టెలిఫోన్'కి "ప్రజా దూర్వాణి' అని రాసి బోర్డు పెట్టారు. ఒక గ్రామీణుడు "దూర్వాణి' అంటే ఏమిటంటడీ?" అని అడిగాడు. "టెలిఫోన్" అన్నాడు పక్కాయన. "అదా! ఆమాట చెప్పొచ్చు కదండీ" అని నవ్వాడు గ్రామీణుడు.

ఒక పత్రిక – ఎవరో చనిపోతే, "చనిపోయినట్టుగా, సందేశం వచ్చింది" అని రాసింది. ఇంగ్లీషులో మెసేజ్ అని వుంది. అంటే సందేశం కదా. "చనిపోయినట్టుగా వార్త వచ్చింది" అని రాస్తే ఎంత బాగుండేది! సర్కిల్ ఇనస్పెక్టర్ కి 'వృత్తాధికారి' తెలుగు! బాగుంది కదూ!

మీరు రైలు స్టేషన్‌లో గమనించారో లేదో – కొన్ని పెట్టెల మీద అన్ రిజర్వ్‌డ్ – అని ఉంటుంది. దానికి తెలుగు రాసి వుంటుంది – ఏమిటో తెలుసా? – "అనా రక్షితము". అది రైల్వే వారి తెలుగు!

విమానాశ్రయంలో – ఎరైవల్స్, డిపార్చ్యూర్ కి ఆగమనము, నిష్క్రమణము అని తెలుగులో ఉంటాయి. ఏమిటో! రాకడ, పోకడ – అనొచ్చుగా చక్కగా తెలుగుమాటలు!

దారుణమైన అనువాదాలకి ఇంకో మచ్చుతునక. ఒకడు నేరస్థుడు. అతన్ని పట్టి ఇస్తే 5 లక్షలు ఇస్తామని పోలీసు ప్రకటన. అది ఆంగ్లంలో "హి కారీస్ 5 లాక్స్ ఆన్ హిజ్ హెడ్" అని వుంటే ఒక పత్రిక చేసిన అనువాదం – "అతని తల మీద 5 లక్షలున్నాయి!!"

'ప్రెస్ మీట్', 'సిఎమ్ కాన్వాయ్' 'కాటరింగ్ బాగుందని మెచ్చుకున్నారు మంత్రి" "మంత్రుల ఉపాన్యాసాలకి నిర్మించిన ప్లాట్‌ఫారం కూలిపోయింది" "ముఖ్య అతిథి సభకి అరగంట లేటుగా వచ్చారు" – ఇలా ఇంగ్లీషు పదాలతోనే తెలుగు పత్రికలు వార్తలు

అందిస్తున్నాయి. ఐతే, యథాతథ అనువాదం లేకపోతే యథాతథ ఆంగ్లం! అన్నింటికీ తెలుగు పదాలున్నాయి - వాడరు. "తెలుగు కాపాడుకుందాం" అని రాతలు!

టీవీలో మధ్యమధ్య "మనం తెలుగువాళ్ళం. తెలుగులోనే మాట్లాడుకుందాం" అని వస్తూ వుంటుంది. వెంటనే, ఆ 'యాంకర్' "హై వ్యూయర్స్... అని ఆంగ్లంలో అంటుంది. ఎగతాళా? అవహేళనా? టీవీల వార్తల భాషా అలాగే వుంటుంది. తెలుగు వార్తలు చదువుతున్న అమ్మడు - "ఏదో ఇరగదీస్తుందనుకున్న సానియా..." అని చదివింది. ఇది వార్తల భాషా?...హతోస్మి. వార్తలు చదివే వాళ్ళు ఒత్తులు పలకరు. ద్విత్వాక్షరాలు సరిగా ఉచ్చరించరు. కొన్ని లక్షల మంది తెలుగువారు వార్తలు వింటారు కదా - అన్న ఆలోచన వుండదు.

ఇంగ్లీషులో 'దీ' లేదు గనక, దానికి 'డి' అక్షరం వాడతారు. హైదరాబాద్ - అన్నట్టుగా. తెలుగువాళ్ళం 'డి'ని 'డి'గా పలుకుతాం - హద్రాబాద్ - అని. అలాగే గోదావరి ఎక్స్‌ప్రెస్ ని 'గొడావరి' అనీ, రాజమండ్రి ని 'రాజమండ్రీ' అని పలుకుతున్నాం.

ఏమైనా, తెలుగుభాష, మాట-ఇంటి నుంచే ఆరంభం కావాలి. ఇంట్లో వున్న తల్లిదండ్రులు పిల్లలతో తెలుగు మాట్లాడాలి. పొద్దున్నే "బుక్స్ అన్నీ బ్యాగ్‌లో పెట్టుకున్నావా?" అని తల్లి అగడడానికి బదులు "పుస్తకాలు సంచిలో సర్దుకున్నావా?" అనొచ్చు గదా. "వాటర్ బాటిల్ (నీళ్ళసీసా) ఫుల్ (నిండుగా) గా వుందా" "సాక్స్ (మేజోడు) షూ (జోడు) దగ్గర పెట్టుకో..." "లంచ్ బాక్స్ (అన్నం డబ్బా) పెట్టుకు న్నావా?" బయల్దేరు...బై జాగ్రత్తగా వెళ్ళిరా) అంటే వాడూ 'బై' 'బై' అంటాడు. లేదా "బై మమ్మీ" (అలాగే అమ్మా) అంటాడు. అంతా ఇంగిలీషే. ఇల్లంతా "ఎంగిలీషే!" - ఇంక తెలుగేంబతుకుతుంది?.... స్కూల్లో పిల్లలు తెలుగులో మాట్లాడుకుంటే, శిక్షట... తెలుసా? ఇంగ్లీషులోనే మాట్లాడాలట!!...చేతులు రెండూ జోడించి - ఉపాధ్యా యులకి "నమస్కారం" చెప్పడం నిషిద్ధం! "గుడ్ మార్నింగ్ టీచర్" అనాలి. చదువులు, సంస్కారాలూ చట్టుబండలై చచ్చాయి! ఆడపిల్లలు జడవేసుకుని, తలలో పువ్వులు పెట్టుకుని లక్షణంగా స్కూలుకి వెళితే, లోపలికి రానివ్వని బడులు కూడా వున్నాయి! జడ, పువ్వులూ నిషిద్ధం!!

ఇంటి దగ్గర ఆరంభమై, స్కూళ్ళు కాలేజీలు, ఆఫీసులు తెలు గుతో శోభించాలి. అదీ తెలుగు వాళ్ళ లక్షణం! ఏదో ఒక ఇంగ్లీష్ మాట పట్టుకుని, దానికి తెలుగేమిటి - అని ఆలోచించకండి. ఉన్న తెలుగు పదాలని రోజూ వాడండి. బల్ల (టేబుల్) కుర్చీ (ఛైర్) పుస్తకం (బుక్) మంచినీళ్ళు (వాటర్) కూర (కర్రీ) చెంచా (స్పూన్) నెయ్యి (ఘీ) అన్నం (రైస్) ఉప్పు (సాల్ట్) వంటి చక్కని తెలుగు పదాలని పలకండి. బ్రాకెట్లలో వున్న ఆంగ్ల పదాలే వాడుకలో వున్నాయి. పిల్లల చేత అమ్మా, నాన్న, అక్క, తాత అనిపించండి. ఆంటీ, అంకుల్, మమ్మీ, డాడీ, గ్రాండ్‌మా లాంటి మాటలు మానిపించండి. **తెలుగుని తెలుగులా బతకనివ్వండి "బడి పలుకుల తెలుగు కాదు మనకి కావలసింది; పలుకు బడుల తెలుగు కావాలి" అన్నారు కాళోజీ.** సముద్రం అంత తెలుగు భాష; పురిషెడయినా పట్టుకుందాం!

- వ్యాస రచయిత - ప్రముఖ సినీనటులు

కవిత

ఎప్పటిలాగే

గేటు చప్పుడైంది
కవిత్వం తోసుకొస్తుందేమో!
కొబ్బరాకులు కదుల్తున్నాయి,
వాటి పైకెక్కి
జారిపడిందేమో!
కింద పడి లేవటం
దానికలవాటే.

సూర్యకిరణాలు
వంకర్లు బోతున్నాయి
అక్షరాలుగా మారే
ప్రయత్నం కాబోలు.
ఆనాడు
ఎక్కడికో ఎగిరిపోయిన పక్షి
మళ్ళీ కనపడలేదు.
దాని రెక్కల కదలిక
ఇప్పటికీ మనస్సులో వుండిపోయింది.

రాత్రంతా నిద్ర లేదు
'ఆగిపోరాత్రీ' అంటే
ఆగిపోయేదేమో.
నిద్రను ఆపొచ్చునేమోగాని
గడియారం ఆగదు.
తెల్లరగట్ల
దుప్పటి మీది పూల డిజైన్లు
పరిమళిస్తున్నాయి.

ఫ్యాన్‌ల నీడలో
ఏసీల శీతల భాహువుల్లో
పులిసిపోయిన దేహంతో
ఎండలో
కుర్చీ వేసుకొని కూర్చున్నాను
కవిత్వం
'డి' విటమిన్‌లా విస్తరిస్తుంది.

డా॥ ఎన్.గోపి
93910 28496

చలసాని నరేంద్ర
98495 69050

రైతులు ఈ దేశ పౌరులు కారా?



1991 తరవాత సైద్ధాంతిక నిబద్ధతతో సంబంధం లేకుండా కేవలం దివాలాస్థితిలో ఉన్న ఆర్థిక పరిస్థితుల నుండి బైట పడటానికి ఆర్థిక సంస్కరణలను ప్రవేశ పెట్టవలసి వచ్చింది. అప్పటి నుండి దేశంలో అధికారంలో ఉన్న పార్టీలు, నేతలు మారుతున్నా, విధానా లలో మాత్రం పెద్దగా తేడా ఉండటం లేదు. 'బరి తెగించి'న రీతిలో ప్రభుత్వం కీలక రంగాల నుండి వైదొలిగి, ప్రైవేట్ రంగానికి, దేశీయ-విదేశీ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నాయి. చివరకు రక్షణ, రిటైల్, మీడియా రంగాలలో కూడా విదేశీ పెట్టుబడులకు బార్లా తలుపులు తెరుస్తున్నారు.

అయితే మనదేశంలో అతి పెద్ద ప్రైవేట్ రంగమైనా వ్యవ సాయంను మాత్రం ప్రభుత్వ కబంధ హస్తాల నుండి విముక్తి కావిం చడం లేదు.

దేశంలో ఇప్పటికి సగంకు పైగా ప్రజల జీవనాధారం వ్యవ సాయరంగం. 1950లో తిండి గింజలను సహితం దిగుమతి చేసుకో వలసిన దుస్థితిలో మన రైతులు ఈదేశ గౌరవాన్ని, అభిమానాన్ని కాపాడారు. ఎంతో కష్ట పడి దేశాన్ని ఈ రంగంలో స్వయంసమృద్ధి కావించడమే కాకుండా, నేడు ప్రపంచంలో అతి పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల దేశాలలో ఒకటిగా భారత దేశాన్ని మార్చారు.

అటువంటి రైతులకు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఏమి చేస్తున్నాయి ? వారిని బిచ్చగాళ్ల వలే చూస్తూ తీవ్రమైన అవమానాలకు గురి చేస్తున్నాయి. వ్యవసాయ రుణాలను రద్దు చేస్తున్నామని అంటూ అసమర్థంగా పనిచేస్తున్న బ్యాంకుల మొండి బకాయిలను జమచేసు కొనే సౌలభ్యం కల్పిస్తున్నారు. కానీ ఒక్క రైతును కూడా ఋణం అవసరం లేకుండా చేయగలుగుతున్నారా? ఉచిత నగదు ఇస్తామం టారు. వడ్డీ లేని రుణాలు అంటారు. ఉచిత భీమా అంటారు. కానీ తాను ఎంతో కష్టపడి పండించుకున్న పంటలను తన ఇష్ట ప్రకారం అమ్ముకొనే స్వేచ్చ రైతులకు ఇస్తున్నారా? కనీసం తన ఇష్ట ప్రకారం పంటలు పండించుకునే సౌలభ్యం కలిగిస్తున్నారా?

అందుకనే నేడు వ్యవసాయం చేస్తున్న యువకుడిని వివాహం చేసుకోవడానికి ఏ యువతీ కూడా ఆసక్తి చూపడం లేదు. మరో లాభదాయకమైన ప్రవృత్తి లభిస్తే వ్యవసాయం వదలడానికి దేశంలో సగం మందికైనా రైతులు సిద్ధంగా ఉన్నారు. వ్యవసాయాన్ని ఏ విధంగా లాభదాయకంగా చేయాలో ఎవ్వరు ఆలోచించడం లేదు. ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు దాదాపు శూన్యం. పైగా, అత్యంత నిరంకుశమైన భూసేకరణ చట్టం, నిత్యావసర వస్తువుల చట్టం వంటివి రైతుల పాలిట యమశాపంగా మారుతున్నాయి.

1950 నుండి దేశ జనాభా నాలుగు రెట్లు పెరిగితే, వ్యవసాయ ఉత్పత్తులు ఆరు రెట్లు పెరిగాయి. 15 ఏళ్లుగా ప్రపంచంలో అతి పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దేశంగా భారత్ ఉంది. గతేడాది 36 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసాం. అయినా దేశంలో ఆకలి తప్పడం లేదు. ప్రపంచంలోనే మరెక్కడా లేనన్ని భారీ ఆహార ధాన్యాల నిల్వలు భారత ప్రభుత్వం వద్ద ఉంటున్నా 15 శాతం ప్రజలకు పౌష్టికాహారం లభించడం లేదు. ఆరేళ్ళ లోపు బాలల్లో 40 శాతం మందిలో పౌష్టికాహార లోపం కనిపిస్తున్నది.

ప్రతిసంవత్సరం వంట నూనెల దిగుమతికి రూ 70,000 కోట్లు ఖర్చు పెడుతున్నాం. కేవలం మన రైతుల ఉత్పాదికతను పెంచ గలిగితే ఈ మొత్తం మన రైతులకే ఇవ్వవచ్చు గదా. 2030 నాటికి భారత్‌ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చేస్తామని బీజేపీ చెబుతున్నది. వ్యవసాయంలో వృద్ధి రేట్ కనిపించ కుండా జరిగే అభివృద్ధితో ఎవ్వరికీ ప్రయోజనం? ఇప్పటికి ప్రతి రోజు 40 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధాన మంత్రి ఈ విషయమై ఏ నాడైనా ఎందుకు జరుగుతుందో సమాలో చన చేశారా? కనీసం రాహుల్‌గాంధీ మౌలిక సమస్యల గురించి చర్చించారా ?

వ్యవసాయానికి ఎన్నో సబ్సిడీలు ఇస్తున్నామని ప్రతి ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటుంది. కానీ వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ప్రతికూల సబ్సిడీలు ఇస్తున్నారని గ్రహించాలి. ఒక అధ్యయనం ప్రకారం 2000 నుండి 2016 మధ్య భారత రైతులు 14 శాతం ప్రతికూల సబ్సిడీలే దేశానికి ఇచ్చారు. అంటే వారు దేశానికి అందించిన వ్యవసాయ ఉత్పత్తుల విలువ కన్నా వారికి లభించిన ధరలు 14 శాతం తక్కువ అన్నమాట.

రైతులకు గిట్టుబాటు ధరలు దక్కక పోవడంతో దళారులే భారీ లాభాలు పొందుతున్నారు. వారితో రాజకీయ నేతలు కుమ్మక్కు అవుతున్నారు. విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాలు, ఉత్పత్తులు, మార్కెట్ ... ప్రతి చోట పలు నిర్బంధాలు, నియంత్రణలు, ఆంక్షలకు లోనవుతున్నారు. ఈ ఆంక్షల సంకెళ్ళ నుండి స్వేచ్ఛ కలిగిస్తే గనీ రైతులు ఊపిరి పీల్చుకోలేరు. వ్యవసాయాన్ని గిట్టుబాటుగా మార్చుకోలేరు.

రైతులకు ప్రధానమైన ఆస్తి భూమి. ఎవ్వరైనా తమ ఆస్తులను మెరుగు పరచుకొని, విస్తరించుకునే ప్రయత్నం చేస్తారు. కానీ రైతులకు అటువంటి స్వేచ్ఛలేదు. తమ ఇష్టప్రకారం భూమిని ఉపయోగించుకోలేరు. అమ్ముకోలేరు. కొనుక్కోలేరు. అనేక ఆంక్షలు. వ్యవసాయం కాకుండా మరో వ్యాసంగం ఆ భూమిలో చేపట్టరాదు. అమ్మినా మరో రైతుకే అమ్మాలి. అసలు వ్యవసాయం సంక్షోభంలో ఉంటె రైతులు భూములు కొనగలరా? నేడు కోర్టులలో ఉన్న కేసులలో **70 శాతంకు పైగా వ్యవసాయ భూములకు సంబంధించిన వివాదాలే కావడం గమనార్హం.**

రైతుల ఆస్తి హక్కులకు గౌరవం లేదు. తమ ఉత్పత్తులను తమకు అనుకూలమైన చోట, తమకు గిట్టుబాటు అయిన ధరకు అమ్ముకొనే సౌలభ్యం లేదు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం అంటూ ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ నియంత్రణ చట్టం, నిత్యావసర వస్తువులను వినియోగదారులకు అందించడం కోసం ఆంటూ తీసుకువచ్చిన నిత్యావసర వస్తువుల చట్టం రైతుల అణచివేతకు కారణం అవుతున్నాయి. వారిని తమ ఉత్పత్తులను స్వేచ్ఛగా అమ్ముకోనీయకుండా బందీలుగా మారుస్తున్నాయి.

ఉత్పాదికతను పెంచడంలో, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించడంలో అత్యాధునిక సాంకేతికత కీలక పాత్ర వహిస్తుంది. నేడు అన్ని రంగాలలో అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ రైతులు మాత్రం దూరంగా ఉంటున్నారు. జీఎం పంటలవలన ప్రపంచంలో ఇప్పటికే 12 పంటలలో వ్యవసాయ రంగంలో రైతులకు అధిక ఆదాయం, అధికోత్పత్తి సాధిస్తూ ఉండగా, మన రైతులను మాత్రం ఆంక్షలతో దూరంగా ఎందుకు ఉంచుతున్నారు? ఎవ్వరి ప్రయోజనాలకోసం?

అందుకనే శరద్‌జోషి వంటి రైతునేతల ఆలోచనలకు అనువుగా ప్రస్తుత ఎన్నికల సమయంలో 'రైతులప్రణాళిక' అంటూ కొన్ని నిర్దుష్టమైన ప్రతిపాదనలు దేశ ప్రజల ముందు ఉంచారు. రాజకీయ పార్టీల పరిశీలనకు ఉంచారు. **రైతుల నుండి ఇష్టారాజ్యంగా ప్రభుత్వం భూసేకరణ చేసే ప్రక్రియకు స్వస్తి పలకాలి. కేవలం విస్తృతమైన "ప్రజాప్రయోజనం" కోసం పరిమితంగా మాత్రమే భూసేకరణ జరపాలి. ప్రైవేట్ కంపెనీలకు ప్రభుత్వం భూసేకరణ జరిపి ఇవ్వడం నేరంగా పరిగణించాలి.**

భూసేకరణ చట్టాలకు స్వస్తి పలకాలి. భూమి ఉపయోగం, అద్దెకు ఇవ్వడం, అమ్మడంలపై గల ఆంక్షలను తొలగించాలి. కాంట్రాక్టు ఫార్మింగ్ పేరుతో కార్పొరేట్ శక్తులు ఈ రంగంలోకి రాకుండా చూడాలి. వ్యవసాయ వాణిజ్యంలో రైతులకు స్వేచ్ఛ కల్పించడం కోసం వ్యవసాయ మార్కెట్ నియంత్రణ చట్టం, నిత్యావసర వస్తువుల చట్టంలను రద్దు చేయాలి. అన్ని వ్యవసాయ ఉత్పత్తులలో ఫ్యూచర్ ట్రేడింగ్ కు అవకాశం కల్పించి, వ్యవసాయ వాణిజ్యంలో, అసమంజస ఆంక్షలను తొలగించాలి. నీరు, ఇతర సహజ వనరులలో ఆస్తి హక్కు కల్పించాలి.

పర్యావరణ పరిరక్షణ చట్టం, బయో సేఫ్టీ నియంత్రణలను కుదించి రైతులకు సమాచారం, సాంకేతికత, వ్యూహాలను అందుబాటులోకి తీసుకు రావాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో విస్తృతంగా వ్యవసాయ పరిశోధనలకు ఆస్కారం కల్పించాలి. రైతులకు సమాచారంతో సాధికారికత కల్పించే విస్తరణ కార్యక్రమాలను పునరుద్ధరించాలి. రైతులకు తమ వ్యవసాయం గురించి తామే నిర్ణయాలు తీసుకోగల అవకాశం కల్పించాలి.

మెరుగైన గ్రామీణ మౌలిక సదుపాయాలతో స్థానిక ఉపాధి, ఆర్ధిక అవకాశాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంతాలలో పెట్టుబడులను ప్రోత్సహించాలి. వికేంద్రీకృత నిల్వ సదుపాయాలు, ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కావించాలి. గిరిజనులు, ఇతర సాంప్రదాయ అటవీ సమూహాలకు భూమి, సహజవనరులపై గల హక్కులను గుర్తించాలి. గ్రామస్థాయిలో, స్థానిక సమూహాలు భూమి స్థాయి, ఉపయోగం, సొంతదారులు, తమదే అని వాదిస్తున్నవారి వివరాలను పౌరసమాజంలో పారదర్శకంగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించాలి. రాష్ట్రస్థాయిలో భూమి రికార్డులకు ఇది భూమికగా ఉండాలి.

భారత రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌ను రద్దు చేసి, రైతుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించాలి. న్యాయపర సమీక్షకు అవకాశం ఇవ్వాలి. చట్టాలు, నియంత్రణల నుండి రైతులకు విముక్తి కలిగించి, నిజమైన స్వాతంత్ర్యం కల్పించాలి. 50 ఏళ్ళల్లో దేశాన్ని ఆహార కొరత నుండి ఆహార ధాన్యాలలో మిగులుస్థాయికి తీసుకు వచ్చిన రైతులు మాత్రం పేదరికంలో మగ్గిపోతున్నారు. రైతులను పేదరికంలోకి నెట్టివేస్తున్న అనేక చట్టాలు, నియంత్రణల నుండి వారికి విముక్తి కల్పించి వారికి సహజన్యాయం అందించడం జాతీయ ప్రాధాన్యతలలో కీలక అంశంగా ఉండాలి.

ప్రభుత్వం అధికారాల పట్ల సంయమనంతో వ్యవహరించి, కీలక అంశాలైన శాంతిభద్రతలు, న్యాయం అందించడంకు పరిమితం అయ్యే ప్రయత్నం చేసినప్పుడే ప్రజల స్వాతంత్ర్యంలకు హామీ ఇవ్వగలరు. భూమి, సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థల పేరుతో దశాబ్దాలుగా ప్రభుత్వం ప్రజల నుండి సేకరించిన ఆస్తులను తిరిగి వారికే ఇచ్చే ప్రయత్నం ప్రభుత్వం చేయాలి. ఇటువంటి ఆస్తులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం ద్వారా ప్రభుత్వాలు ప్రజల ఆస్తి హక్కులను, స్వాతంత్ర్యంలను హరించి అన్యాయం చేయడానికే దారి తీస్తున్నది.

ఎస్. ఆర్. పృథ్వి
99892 23245

పరులపాలనలో తెలుగువారి దుస్థితిని తెలియజెప్పిన 'జంపన'

వ్యాపార నెపంతో భారత భూ భాగాన్ని హస్తగతం చేసుకుని, రెండు శతాబ్దాల పాటు రాజ్యాధికారాన్ని అనుభవించిన ఆనందంలో ఆంగ్లేయులు ; భాషా సంస్కృతులు విచ్ఛిన్నమై, సంపద దోపిడీ చేయబడి, మాన ప్రాణాల భయంలో భారతీయులు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగువారి పాత్ర గణనీయమైనది. జాతి స్వేచ్ఛకోసం కలంతో పోరాడిన చిలకమర్తి, వేదుల, గరిమెళ్ళ వంటి కవులలో 'జంపన' ఒకరు. తెలుగు పౌరుషాన్ని అక్షరబద్ధం చేసి, కవిత్వంగా మలిచి, ఆ జ్వాలాక్షరాలను ఆంగ్లేయులపై వదిలారు అదే 'ఆంధ్రజ్వాల' కవిత్వం.

తెలుగు నేలను 'వేద సుధలను పితికిన ప్రేమభూమి' అన్నారు కవి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ప్రతి మనిషిలోను, ముఖ్యంగా కవులు, దేశాన్ని కన్న తల్లితో సమంగా భావించేవారు. పుట్టి, పెరిగిన ఊరుని ఎంతగానో అభిమానించే వారు. పుట్టిన మట్టిలో తనువు చాలించడం గొప్ప భాగ్యంగా భావించేవారు.

ఇప్పటి పరిస్థితి పూర్తిగా భిన్నం. అందరం స్వతంత్రులమే. ధన కాంక్ష, అధికార కాంక్ష, దేశాన్ని, రాష్ట్రాలను పాలించాలన్న తపన తప్ప, మరొకటి కనిపించదు. ఎవడి గోల వాడిది ; ఎవడి తాపత్రయం వాడిది. నేను, నాది అనే అహం తప్ప ఏకోశానా మనము అనే ధ్యాస కనిపించదు. జంపన తెలుగు నేలను, తెలుగు భాషను ప్రేమించిన కవి.

"నేను తెలుగువాడను - తల్లి నేల కొరకు
రాల్చు కన్నీళ్ళే రత్నాల రాసులగును ;
నేను తెలుగు వీరుడ - తల్లి నేల కొరకు
కార్చు రుధిరమ్మె స్వాతంత్ర్య సుధల నొసగు" అంటారు.

నేను తెలుగు వాడను ; ఈ నేల నా తల్లి అని సగర్వంగా ప్రకటించుకున్నారు. తెలుగు మాటలో సత్యము వెలుగుతుందంటారు. తెలుగు పాటలో ధర్మము చెలగుతుందంటారు. తెలుగువారి ఆటల్లో ధైర్యం కలుగుతుందంటారు.

"కనుల జలజల భాష్పముల్ కార్చుచున్న
తల్లి వదనమ్ము కనలేము ; తాళలేము" అని మాతృదేశముపై అమితమైన భక్తి ప్రపత్తులను ప్రకటించారు. అంతే కాదు ; ఆ నాటి వైభవం, తెలుగు పౌరుషం గురించి యిలా అన్నారు.

తెలుగు ప్రతాపుని కొలువులో జయభేరి
పలుకదా దిగ్వ్యాప్తి సలుప నేడు?
రాజ రాడ్విభుని కొల్వుంగ రా రేలనో
నన్నయాది కవులానంద గరిమ?
కృష్ణరాయలు స్మరియించు తెలుగు భూమి
తలచదా స్వేచ్ఛా పథమ్మొకింత?
బాల చంద్రుని భుజాస్ఫాల నమ్మిన రేగు
పౌరుషవహ్ని ఏ వసుధ దాగె?

ఈ విధంగా ప్రాచ్య ఆంధ్ర పౌ రాగ్ని లోంచి వెలువడిన జ్వాలలు ఏ విధంగా నున్నవో ప్రస్తావించారు.

తెల్లవాడి పాలనలో మనవి బానిస బ్రతుకులైనాయి. అని ఎందరో ఆ బాధలు అనుభవించిన స్వాతంత్ర్య సమర యోధుల జీవితాలు చెప్పాయి. అవి చూచిన కవులు కలాలు విదిలించారు. ఆనాటి బానిస పరస్థితుల గురించి జంపన గారు కూడా వ్రాసారు.

"దేశ కళలపై నిప్పులు పోసినాడు
దేశ కవితల హృదయమ్ము కోసినాడు
పరుల యెంగిలి కూటికై కరము చాచి,
బానిసత్వము విడలేక బ్రతికి నాడు"

ఆనాడు దేశ సాహితీ, సాంస్కృతిక, కళా రంగాలు నాశనమై, మనుషులు ఆంగ్లేయులకు బానిసలుగా బ్రతకడం, వాళ్ళు వేసే ఎంగిలి మెతుకుల కోసం ముగం వాచి ఎదురు చూడడం వంటి దురదృష్టకరమైన దృశ్యాలు- కవి కంటబడ్డాయి. దేశ సంస్కృతిని దెబ్బతీయడమంటే యిదే కదా -

"మాతృభాషలో మాటాడమరచి తలచు
ఆంగ్లభాషనే సభ నుపన్యాసమిచ్చు
దేశ భక్తులు నీ యింట తిరుగుచుండ
తిరిపమెత్తుట కింకేమి కొరత తల్లి!"

అంటు ఆనాటి దౌర్భాగ్య స్థితి గురించి వాపోతారు కవి.

"తెలుగు స్వభాష యనుచు / నుతించి, పఠించిన వాడు / దుఃఖ భాజనుడయి / కూడు గుడ్డలు / ప్రశాంతియు / పొందలేక / తా వెనుకటి శౌర్య సంపద - / కవి ప్రవరాళి ప్రతిజ్ఞ తెల్పుచును / కనులను ప్రాణముల్ నిలువగా / పఠియింపడె దాస్య గీతముల్?"

తెలుగు నా భాష యని సగర్వముగా చెప్పుకున్నవాడు కూడు, గుడ్డ, శాంతి, సౌఖ్యములు దూరమై దుఃఖ సాగరంలో కొట్టుకు పోవడం కవి దర్శించాడు. కళ్ళల్లో ప్రాణాలను నిలుపుకుని దాస్య గీతాలు ఆలపించడం దురదృష్టకరం.

జంపన కవిత్వంలో 'బలిపీఠం' అనే కవితా ఖండిక ఒకటి కనిపిస్తుంది. ఆంగ్ల విద్యనభ్యసించి జీవితాన్ని నైవేద్యంగా పెట్టారు అంటారు.

"ఆంధ్రభాషామ తల్లి హృదయంతరమున
అడుగులను మోపి, ఠీవిగా నడచి నీవె
ఆంగ్ల విద్యాలయమ్ముల కరిగి – నీదు
జీవితమ్మె నైవేద్యమ్ము చేసినావు"

ఆనాటి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన కవి. ఎంత చక్కటి పద్యమిది. ఈయన రచనలో భావగాంభీర్యం నిండుగా కనిపిస్తుంది. పద సౌశీల్యమూ కనిపిస్తుంది. చివరిగా –

"బ్రతుకగనెంచ 'ఆంధ్రు' దని
పల్కబోకుమ ; పల్కినంత, నీ
యతనము బుగ్గి పాలయి, ప్రయాసమె
నిల్చును మృత్యుదేవి యై ;
సతతము దుఃఖ భోక్తవయి.
శాంతి నెరుంగక, వెర్రివాడవై
వితరణ శీలురన్ గనగ వేడియ
కంతము రుద్ధ మొందంగా"

స్వాతంత్ర్యానికి పూర్వం తెల్ల దొరల పాలనలో దేశంతో పాటు, ప్రజలు, భాష ఏ విధంగా దోపిడీకి గురయిందో, బానిసత్వాన్ని అనుభవించిందో ఈ చిరు కావ్యంలో ప్రస్తావించారు కవి. బ్రిటిష్ వారి పరిపాలనను, ఆలోచనలను వ్యతిరేకించిన కవులు ఆ తరంలో అనేకమంది కనిపిస్తారు. జంపనగారు కూడా ఆదారిలో నడిచి, వారి ఆలోచనలను నిర్మోగమాటంగా కావ్య రూపంలో పెట్టడం జరిగింది. అటువంటి నిస్వార్థ కవులను మననం చేసుకోవలసిన అవసరం ఉంది.

(29 వ పుట తరువాయి)

జనానికి కావలసిన శిక్షణ ఇచ్చి, అధికారుల ముక్కు నేలకు రాసి, అమలుచేయించాలి. సంఘాలు పోటీ పడాలి.చట్టం అమలుకాకపోతే నష్ట పోయేది ప్రజలే. 'తిరిగే కాలు, తిట్టే నోరు' అన్నట్లు ఈ మేధావులకు నేర్చుకునే కుదురు,విషయపరిజ్ఞానం శూన్యం. ఈ ధోరణి వల్లే శంకరన్ ప్రారంభించిన ఏజెన్సీ ప్రాంతాల భూమిసర్వే, అడవి హక్కుల మార్గ దర్శకాలు, గిరిజన ప్రాంతాలలో పంచాయత్ రాజ్ గ్రామసభల ఏర్పాటు నిరుపయోగంగా మారాయి. సంఘాలు మేధావులు రచయితలు ఖండన పర్వాన్ని రక్తి కట్టిస్తున్నారు.జనం కూడా పత్రికలో తమప్రకటన చూసుకుని మురిసిపోతున్నారు. 'నేల విడిచి చేసే సాముగరిడిలకన్న, నేలను అంటిపెట్టుకుని నీటిలో చేపల లాగా మెలగగల మెలకువతో నిర్వహించుకుని నిభాయించుకోగల సాములకే ఎక్కువ విలువ, మన్నన'(ఏ.బి.కె.ప్రసాద్ 'మహత్తర శ్రీకాకుళ పోరాటం' ముందుమాట 2006) అంటూ గత ఉద్యమాలను చూసిన వారి హితవును చెవినపెట్టాలి. నూతన ప్రజాస్వామిక విప్లవం, పీడిత జన విముక్తి, రాజ్యాధికారం, సాహిత్యం – సామాజిక స్పృహ, శాస్త్ర విజ్ఞానాల ఆధునికీకరణ అంటూ 'ఎవరికి తెలియని ఏవో పాటలు పాడే' బుద్ధిజీవులు తమపాత్రను నిర్వచించుకో వలసిన అవసరం వచ్చింది.

కవిత

వలస

పిచ్చికా!
నువ్వున్నట్టా, లేనట్టా
జాడలేని నిన్ను
లేవనే అనుకొంటున్నది లోకం.
అయినా నువ్వున్నావన్న నమ్మిక
గుండె చెట్టు కొమ్మ మీద
కిచకిచలాడుతుంది ఇప్పటికీ
ఏ మూలో చూరు తొర్రలో
ఓ చిట్టి గూడు
చిట్ట చివరి ఆశతో నిరీక్షిస్తూ
నిద్రలేని రాత్రులు గడుపుతోంది
మా గోడకు బిగించిన అద్దం
నీ కోసం దిగులు పడింది
ఎక్కడికెళ్లిపోయావు పిచ్చుకా!
జాలిలేని జనం గాజు కళ్లలో
నీ కోసం చుక్క కన్నీరు కరువైందన్న
నిజం తెలుసుకున్న తర్వాత
దయలేని హృదయాల నీడలో
తరంగ దైర్ఘ్యాల టవర్లకే తప్ప
నీ కోసం చిటికెడు ఆశయం
లేదన్న నిజం తెలిశాక
మా పిల్లలు యిప్పటికీ నిన్ను
పుస్తకాల్లోనే చూసుకొంటున్నారు.

గుర్రాల రమణయ్య
9963 921943

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లి భాష గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

సన్నిధానం నరసింహశర్మ
92920 55531

సౌజన్యధన్యుడు, సాహిత్య సంపన్నుడు విహాల వాసుదేవ దీక్షితులు


1942 – 12 ఏప్రిల్ 2019

ఆంధ్రప్రభ సంపాదకునిగా, ప్రసార మాధ్యమాల్లో సమకాలీన రాజకీయ విశ్లేషకునిగా ప్రసిద్ధి పొందిన దీక్షితులుగారు అప్పుడే మృతి చెందడం విచారకరం; విషాదకరం.

సాహితీవేత్తలు పత్రికా సంపాదకులుగా ఉండడం వల్ల, శైలీ సౌందర్యాలు, బాస తీయందనాలు ఎక్కడో అక్కడ గుబాళిస్తుంటాయి. సమాచారాన్నో, విజ్ఞానాంశాన్నో రచనలుగా మలచడం వారికి వెన్నతో పెట్టిన విద్యగా ఉంటుంది; పెన్నుతో పండించే పంటగానూ ఉంటుంది.

ఆరుద్ర మాటల బలిమిపై నీలంరాజు వేంకట శేషయ్యగారు అజంతాకు ఆంధ్రప్రభలో ఉద్యోగమిచ్చారు. కొన్ని ముఖ్య పత్రికలకులాగే ఆంధ్రప్రభకు కొన్ని సంప్రదాయాలు విలువలు ఉండేవి. సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు, ఆంధ్రప్రభ సంపాదక ప్రతిష్ఠాపీఠంపై తన తరువాత దీక్షితులుగారు వచ్చిన ముచ్చట చూసిన పొత్తూరి వేంకటేశ్వరరావుగారు పత్రికా రంగ రచనలో నాకు అక్షరాభ్యాసం చేసినది ఒకప్పటి ఆంధ్రప్రభ సంపాదకులు కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యంగారేనని ఇప్పటికీ చెప్పుకుంటారు. ఇందులో ఆయన వైయుక్తిక సుగుణమే కాక, ఆంధ్రప్రభ అందించిన వారసత్వ సుగుణత్వ శోభ కూడా లేకపోలేదు. అదిగో ఆ ప్రతిభా వైభవం చవిచూసిన, చవిచూపిన సంపాదకుడు వాసుదేవ దీక్షితుల ంగారు. మహాకవి మదునాపంతుల సత్యనారాయణ శాస్త్రి కీర్తి శేషులైనప్పుడు సంపాదకీయం రాసిన ఏకైక సంపాదకులు దీక్షితులుగారే. అది ఆయన సాహిత్య సంపన్నత వల్ల జరిగిన మేలుపని.

నా గ్రంథాలయ గురువు పాతూరి వారికి పొట్టి శ్రీరాములు గారు రాసిన లేఖల్ని ఓ వ్యాసంగా రాసి, ఓ నవంబరు.! ఆంధ్రప్రదేశ్ అవతరణ సంచికకు పంపాను. సత్వర సంస్పందనలో దీక్షితులుగారు 'మహా ప్రసాదం అందింది. కళ్ళకు అద్దుకుని మరీ వేస్తున్నాను ఆ వ్యాసాన్ని సంపాదకీయపు పుటలో. అన్నారు, వేశారు. రోశయ్యగారి వంటి పెద్దలు సైతం ఆనందించారు. ఆనందాన్ని నొక్కేసుకోకుండా తెలిపారు.

ఆంధ్రప్రభ సంపాదకునిగా ఆయన మానేశాక కూడా ఎందరో అభిమాన ప్రేమలకు పాత్రుడయ్యారంటే ఆయన సౌజన్యధన్యతవల్లనే కదా! తెలుగు విశ్వవిద్యాలయం హైద్రాబాదు ప్రాంగణంలో ఆచార్య జయధీర్ తిరుమలరావు సన్నిధానంలో ఆంధ్రభూమి సంపాదకులు శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రిగారు 'దీక్షితులుగారూ! మీ అనుభవాల్ని మా ఆంధ్రభూమిలో ధారావాహికగా రాయండి' అని కోరారు. అలా రాసి వుంటే విశేషాంశాలెన్నో విశేష సంఘటనలతో వెలికి వచ్చేవి, తెలిసి వచ్చేది. అది జరగలేదు.

తెలుగు వచన కవిత్వంలో అపురూప కవి అజంతా అన్నా, ఆయన కైతలన్నా దీక్షితులుగారికి ప్రాణం. అజంతాగారూ దీక్షితులుగారు నా ప్రాణం అనేవారు.

ఆంధ్రప్రభలో దీక్షితులుగారు, ఎం.వి.ఆర్.శాస్త్రిగారు, పురాణపండ రంగనాథ్‌గారు – వీరందరి కలుపుగోలు తనాలు దళ కార్యానుసంధానాలంటే ఏమిటో ఆంధ్రప్రభ ద్వారా తెలిపేవారు.

తరువాత పొత్తూరి వారైనా, దీక్షితులుగారైనా తాము సంపాదక స్థానాల్లో ఉన్నా అజంతా వంటివారిని తమ వద్దకు పిలి పించుకోకుండా తామే వారి వద్దకు వెళ్ళి, అవసర సంప్రదిం పులు చేసేవారు.

ఒక ముఖ్యమంత్రి ప్రభ సంపాదకునిగా దీక్షితులుగారికి తాముగా ఫోనుచేసి ఓసారి కలుద్దామా అంటే దీక్షితులుగారు సవినయంగా హుందాగా రావడానికి అభ్యంతరం లేదు కాని, ఆంధ్రప్రభ కార్యాలయాన్ని ముఖ్యమంత్రులు దర్శించడం కూడా వుంది అన్నారు. ఇది ప్రస్తుత ముఖ్యమంత్రికి సంబంధించి కాదు.

తెలుగు రాష్ట్రాలు రెండుగా విభజింపబడినాక ఆం.ప్ర. దొరతనం దీక్షితులుగారికి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ పదవినైతే ఇచ్చింది.

విజ్ఞులానందించారు. అయితే దీక్షితులుగారి ఆశయ రూప కల్పనలకు, నూతనాకాంక్షల కార్యక్రమాలకు తగిన బడ్జెట్టు కేటాయింపులు, మంజూరులు లేకపోవడం వల్ల ఆయన చేతులు, చేతలు కట్టేసినట్లయింది.

ఉషశ్రీగారు చనిపోయాక నేను ప్రభ కార్యాలయానికి వెళ్ళి ఉషశ్రీగారు ఎవరికీ చెప్పనివి నాకు మాత్రమే చెప్పినవీ, దీక్షితులు గారికి చెప్పామా (వీనిని వివరంగా ఆంధ్రభూమిలో రాశాను) చెప్పి, రైలెక్కి రాజమండ్రం వెళ్లిపోయాను. కొన్ని రోజులకి ఆ ఉషశ్రీ సంబంధిత అపూర్వ అంశాలు చెప్పడానికి దీక్షితులుగారి ప్రేరణపై విశ్వనాథ సత్యనారాయణగారింట్లో పావనిశాస్త్రిగారు సమావేశం ఏర్పాటు చేశారు. ఏకైక వక్తను నేను. విశ్వనాథ జయంతి, ఉషశ్రీ పై ప్రసంగం. నలుగురైదుగురే శ్రోతలు. వారు స్వాతి సంపాదకులు బలరాంగారు, పావనిశాస్త్రిగారు, పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు, బాలజ్యోతి సంపాదకులు శశికాంత్ శాతకర్ణిగారు. ఇలా నలుగురైదు గురు వేత్తలకి జ్ఞానానందాల్ని పంచాలనుకునే సంస్కారం దీక్షితులు గారిది. స్వీయానందాలకే కాక సామాజికానందానికీ ప్రాధాన్యమిచ్చేవారు చాలా అవసరం.

ప్రసార మాధ్యమాల్లో చర్చల సందర్భాలలో ఆయన మొగ్గులు ఆయనకున్నా – చౌకబారు వ్యాఖ్యానాల్ని, ఎదుటివారి, తన స్థాయిల్ని తగ్గించే దిగువ తలంపులుండేవికావు. అమ్మనుడికి ఈ తీపి గుర్తుల ప్రమేయం రాసే సందర్భంలో పొత్తూరి వారికి ఫోను చేసి, దీక్షితుల గారి గురించి, ప్రామాణికులైన మీ నుండి రెండు వాక్యాలు వినాలని వుంది అని అభ్యర్థిస్తే, వెంటనే ఆర్ద్రంగా – దీక్షితులుగారు చాలా మంచి వ్యక్తి. పరిశుభ్రమైన భాషలో రాసేవారు. ఆంధ్రప్రభకు వెనుకటి చరిత్ర నుండి అనుచానంగా వస్తున్న వారసత్వ సత్సంప్రదాయాల్ని రక్షిస్తూ వచ్చిన వారిలో ఆయన ఒకరు. క్రమశిక్షణ గల బాధ్యతాయుత రచయిత. ఫలానా చోటుకి బదిలీ చెయ్యబడ్డారంటే, వెంటనే వెళ్ళి, విధుల్లో హాజరయ్యే మంచి నైజం ఆయనది" అన్నారు.

విజయవాడ గాంధినగర్‌లో ఒక బ్యాంకుకు ప్రక్కనే ఉండే సౌజన్య నిధి దీక్షితులుగారు.

పోతన్న మహాకవి ప్రహ్లాదుని సుగుణాలు చెబుతూ 'స్నేహ మోహన భాషణ శ్రీలతోడ' ప్రహ్లాదు దున్నా డన్నారు. స్నేహమోహన భాషణలు సంపద లన్నారు.

ఎప్పుడూ అందంగా తాజా నవ్వులు చిందిస్తూ ఆనందం, ఆప్యాయతలు వెలిగే కళ్ళతో చూపుతోనే హాయిగా ఆహ్వానించే దీక్షితులుగారు – ఆతిథ్యానందాల సందడుల మధ్య ఆంధ్రపురాణం వంటి కావ్యగానాల మధ్య – ఓహ్, ఆహాలతో కాలాన్ని అమృతం చేసుకున్న దీక్షితులుగారు లేరనే వాస్తవం జీర్ణించుకోవడమే కష్టంగా వుంటుంది.

సమవయస్కులు, ఎదలో పీట పరచుకుని ఉన్న వారలు చన్నవారలైనప్పుడు....ఆ వెలితి ఎదను దహించే చితి అవుతుంది. చితి – చింతల్లో కూడా తీపి గురుతులు మాత్రమే బతికిస్తుంటాయేమో! ఏమో!

స్పందన

"తెలుగువారి ఉగాదే...ప్రపంచానికి యుగాదా ..."
అనే శీర్షికతో అచ్చయిన వ్యాసం, ఏప్రిల్ 'అమ్మనుడి' –33వ పుట పూర్తి అవాస్తవాలతో, వక్రీకరణలతో కూడినదని నా అభిప్రాయం.

దీనిలో ప్రామాణికమైన సమాచారం దాదాపు లేదనే చెప్పాలి. "ఈ ఉగాదినే చాలా ప్రాంతాల ప్రజలు సంవత్సరాదిగా భావిస్తారు" అనటానికి ఎటువంటి ఆధారం లేదు. తెలుగువారు జరుపుకునే ఉగాది ప్రపంచానికి యుగాదా, కాదా? అనే సంగతి అలావుంచితే, అది కనీసం భారతీయులందరూ జరుపుకునే సంవత్సరాది కూడ కాదు. ఎందుకంటే, మనం జరుపుకునే ఉగాదిని ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే జరుపుకుంటారు. తమిళులు తమ సంవత్సరాదిని "పుథండు" అనే పేరుతో, ప్రతిసంవత్సరం ఏప్రిల్ 14న జరుపుకుంటారు. ఇదే రోజును కేరళలో "విషు", ఉత్తరాది రాష్ట్రాల్లో "వైశాఖి", అస్సాంలో "బోహగ్ బిహు" అనే పేర్లతో జరుపుకుంటారు. ఇది సూర్యమాన కాలెండర్ ప్రకారం రూపొందిన పండుగ. వీటన్నిటిలో "విషు" అనేది సంవత్సరానికి "ఆది" అనే అర్థాన్ని కచ్చితంగా సూచించే పదం. ఎందుకంటే, విషు అనేది రాత్రి పగలు సమంగా ఉండే రోజును (విషువత్ equinox) సూచిస్తుంది. కనుక దీన్ని తెలుగువారి ఆవిష్కరణగా చెప్పటానికి ఎటువంటి ఆధారం లేదు. వ్యాసరచయిత చెప్పినట్లు, విషువత్తు ఆధారంగా చాంద్రమానాన్ని రూపొందించటం 'మన ప్రాచీన ఋషుల అద్భుత విద్వత్తు' అని అంగీకరించినా, ఆ ప్రాచీన ఋషులు తెలుగువారని చెప్పటానికి కనీస సాక్ష్యాలు లేవు. ఇక తెలుగువారి యుగాది లేక శాలివాహన శకం ప్రారంభమై యిప్పటికి 1940 సంవత్సరాలు మాత్రమే గడిచాయి. (మన వ్యాసంలో కనీసం దీని ప్రస్తావన లేదు). దీనికి చాలా కాలం ముందు నుండే రోమన్, జూలియన్, హీబ్రు తదితర కాలెండర్లు అమలులోకి వచ్చాయి.

ప్రపంచ వ్యాపితంగా, సూర్యచంద్రుల గమనాన్ని గణించిన అనేక జాతులు, ఎవరికివారు వేరువేరుగా మరియు పరస్పర సహకారంతో కాలమానాన్ని లెక్కించారు. ఈనాడు మనం ఉపయోగిస్తున్న కాలమానం, మానవజాతి ఉమ్మడిగా సాధించిన ఉత్తమ ఫలితం. ఆ మానవజాతిలో తెలుగువారు కూడ భాగస్వాములు అనటంలో ఎటువంటి సందేహం లేదు. అయితే, నిరాధారమైన పుక్కిటి పురాణాలతో, చరిత్రను వక్రీకరించి, అందరికంటే మనమే గొప్పవారమని చెప్పు కోవటం, మనకు మేలు చెయ్యకపోగా, కీడు చేస్తుందనేది మనకు చరిత్ర నేర్పిన గుణపాఠం.

– డి.చంద్రశేఖర్ 92900 91232

పుస్తక సమీక్ష

క్రాంతదర్శి: కందుకూరి



సంపాదకుడు : డా॥ తూమాటి సంజీవరావు
వెల: 450/-
ప్రతులకు : జి2, నీలాద్రి అపార్ట్‌మెంట్స్, న్యూ 186 (పాతది 111) లేక్ వ్యూ రోడ్ (పోస్టాఫీసు దగ్గర) వెస్ట్ మాబలం, చెన్నై - 600 033, సెల్ : 9884446208

కందుకూరి వీరేశలింగము శతవర్ధంతి (1848–1919) సందర్భంగా తేదీ 31 –10–2018 నాడు చెన్నపురి తెలుగువాణి ప్రచురణ 'క్రాంతదర్శి – కందుకూరి' విశేష సంచిక చెన్నై నగరంలో ఆవిష్కరింపబడింది. కందుకూరి శతవర్ధంతి రెండు తెలుగు రాష్ట్రాల్లో జరగకపోవటమేమిటి?! ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, సాహిత్య సంస్కృతీ సంస్థలు, గ్రంథాలయాలు మొ॥వి స్పందించకపోవడం, తెలిసిందే! అయితే, కందుకూరి తనువు చాలించింది 27-05-1919న మదరాసులోని కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులుగారి వేదవిలాస్‌లో గనుక, అక్కడే అంటే చెన్నైలో జరపడం సబబు అని భావించారు సంపాదకులు మరియు కార్యదర్శితో పాటు చెన్నై తెలుగు వాణి అధ్యక్షులు. కాని అది అంత సమర్థనీయంగా అన్పించదు. కందుకూరి శతవర్ధంతి చెన్నైలో జరగటం వారు అక్కడ మరణం పొందటం కాదు – అక్కడ చెన్నైలో డా॥ తూమాటి సంజీవరావు ఉండటమే! పొరుగు రాష్ట్రంలో ఉన్నా, తెలుగుకై తపించి, జపించి, శ్రమించేవాడు, తెలుగుకు ప్రాచీన హోదా కోసం ఏక వ్యక్తి పోరాటం చేసి న్యాయస్థానంలో గెలుపొందిన భాషా ప్రేమికుడు, కందుకూరి శతవర్ధంతిని నిర్వహించే భాగ్యం ఎందరికి లభిస్తుందని భావించే (విత్తశుద్ధి లేని) చిత్తశుద్ధి కల భాషా ప్రేమికుడు, సేవకుడు డా॥ తూమాటి సంజీవరావు.

'క్రాంతదర్శి – కందుకూరి' ఆ మహానుభావునికి అర్పించిన అద్భుతమైన నివాళి. కందుకూరి నవ్యాంధ్ర సాహిత్య నిర్మాత, శతాధిక గ్రంథకర్త, సంఘ సంస్కర్త, పత్రికాధిపతి, గద్యబ్రహ్మ, దక్షిణ భారత విద్యాసాగరుడుగా ప్రసిద్ధులు. అయితే, సంపాదకులు 'క్రాంతదర్శి' అని శీర్షిక పెట్టడం, చాల వినూత్నమైన ఆలోచన. "అతీతా నాగత" అని శీర్షిక పెట్టడం, చాలా వినూత్నమైన ఆలోచన. "అతీతా నాగత సమస్త వస్తువేత్తరి – క్రాన్తదర్శీ" అని శబ్దార్థ కల్ప తరువు చెపుతుంది. అంటే, కడచినవియు, రాబోవునవియు నగు విషయములనన్నిటిని ఎఱిగిన వాడు అని అర్థం. తెలుగు సాహిత్యానికి ప్రక్రియా వైవిధ్యాన్ని, వైభవాన్ని అందించటమే కాకుండా సంస్కార ధోరణులు ప్రవేశపెట్టి మత దురాచారాలను మూఢ విశ్వాసాలను, ఛాందసాలను ఖండిం చారు. స్త్రీ అభ్యుదయానికి, స్త్రీ విద్యకు, మహోత్కృష్ట వితంతు పునర్వివాహ సంస్కరణలు చేపట్టి కేవలం రచనలతో సరిపెట్టకుండా కార్యరంగంలో చేసి చూపిన–"కార్యశూరుడు వీరేశలింగం / కలం పట్టి పోరాడిన సింగం / దురాచారాలను దురాగతాలను / తుద ముట్టించిన అగ్ని తరంగం / అదుగో అతడే వీరేశలింగం"; "కందుకూరి ఒక ఏకవ్యక్తి విశ్వ విద్యాలయం" అని శ్రీశ్రీ ప్రశంసించారు.

ఈ సంకలనం ఐదు అధ్యాయాలుగా విభాగింపబడింది. కందుకూరి సాహితీ తత్త్వం, కందుకూరి సామాజిక తత్త్వం పేరున ఉన్న 32 వ్యాసాలు (రెండు అధ్యాయాలు 16+16 కలిపి) దేనికది ఒక సాహితీ సుమమే! మధునాపంతుల, కట్టమంచి, ఎన్.జి.రంగా వంటి నాటి ప్రతిభావంతులు, నేడు తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారు వ్రాసిన వ్యాసాలు నిజంగా చిన్న తరహా సిద్ధాంత వ్యాసాలు అనిపించేలా – పరిశీలనాత్మకంగాను, పరిశోధనాత్మకం గాను, వ్రాయటం ఈ సంకలనంలోని విశేషం. కాంగ్రెస్ మహాసభ లలో రాజకీయాంశాలకీ, స్వాతంత్ర్య పోరాటానికి ప్రాధాన్యమిచ్చి, సాంఘిక సమస్యలు చర్చకు రాకపోవటం వలన ఆ సమస్యలు అలాగే ఉండి పోయినవని డా॥ఎమ్. శ్రీనివాసరావు 'కందుకూరి స్మృతి – ఆవశ్యకత' వ్యాసం లోను; నిబద్ధత, నిమగ్నత, నిబిడత అనే త్రిగుణాత్మకంగా సాగించే విమర్శనంలో కందుకూరి సాహిత్యం విశిష్టంగా నిలుస్తుంది", అని మరొక సందర్భంలో కందుకూరి దళితులను ఎలా ఆదరించారో కొలకలూరి ఇనాక్ పేర్కొంటూ కందుకూరిని సరిగ్గా చదవకుండా ఆరోపణలు చేసినవారికి సమాధానం' యిచ్చారు. కందుకూరి స్వీయ చరిత్రను శ్రీమతి రాజ్యలక్ష్మమ్మకు అంకితమిస్తూ రాసిన పద్యాన్ని ఆయన దస్తూరిలోనే ఆచార్య మలయవాసిని అందించారు (పేజీ. 162). డా॥ మిరియాల గౌతమ్ 'బ్రాహ్మ వివాహం – పెద్దయ్యగారి పెళ్ళి' నాటకాన్ని ఆసక్తికరంగా విశ్లేషిస్తూ – ఈ నాటకం ఏ పూట కూళ్లమ్మతో ముగుస్తుందో, అదే పూటకూళ్ళమ్మతో గురజాడ కన్యా శుల్కం ప్రారంభమైంది అంటారు. అదే విధంగా కందుకూరి వారు 'సత్యవతీ చరిత్రము' నవలికలో (1883 సం॥) వాడినది వ్యావహారిక భాష అనీ, ఇది కన్యాశుల్కం (1892) కు ముందుగానే అని శ్రీమతి జగద్ధాత్రి అభిప్రాయ పడ్డారు. ఆ విధంగానే మలయాళ సమాజాన్ని ప్రభావితం చేసిన సంస్కర్తల్లో ముగ్గురిని (కందుకూరివంటివారిని) సమకాలికులుగా పేర్కొన్నారు శ్రీ ఎల్.ఆర్.స్వామి. సంస్కర్త త్రయం అనే వ్యాసంలో శ్రీనారాయణ గురు (1856–1928), అయ్యంకాళి (1863–1941), వి.టి. భట్టి తిరిపాడ్ (1896–1982) ల గురిం చిన విశ్లేషణ చేస్తూ, ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. మిగతా వ్యాసాలు కూడా స్థాయిలోను, విశ్లేషణలోను ఎంతో ప్రామా ణికంగా ఉన్నాయి. మూడవ విభాగంలో – కందుకూరి రచనలయిన అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము, అతి బాల్య వివాహము, మానుష ధర్మము, అధ్యక్షోపన్యాసము (ప్రెసిడన్షియల్ అడ్రస్ – 1889లో మదరాసులో జరిగిన ఇండియన్ సోషల్ రిఫార్మ్ జాతీయ సభలో కందుకూరి అధ్యక్షోపన్యాసము) దాని ఆంధ్రానువాదం ఉన్నాయి. వీటిలో మానుష ధర్మము, అధ్యక్షోపన్యాసము శతవర్ధంతి సందర్భంగా మొదటి సారి ప్రచురితం అవటం సంతోషకరం. నాలుగవ అధ్యాయంలో – 'కందుకూరి నివాళి' శీర్షికన విశ్వ నాథ, ఆరుద్ర, రాయప్రోలు, దాశరథి, సినారె, కొండవీటి వంటి ప్రముఖ కవుల కవితా నివాళులున్నాయి. ఇక ఐదవ, చివర అధ్యాయంలో శతవర్ధంతి సభ (31-10- 2018) విశేషాలు ఉన్నాయి.ఇలా విభిన్నంగాను, విశిష్టంగాను రూపొందిన 'క్రాంతదర్శి – కందుకూరి' సంచికలోని వ్యాసాలను ఈ తరం పాఠకులు తప్పకుండా చదవాలి. యుగ పురుషుడైన కందుకూరి జీవిత, ఉద్యమ, సాహిత్యాలను చదవాలనే ఆసక్తిని ఈ సంచిక కలుగజేస్తుంది. సందేహం లేదు.చివరగా చెప్పుకున్నా – ప్రధానమైనవి రెండు విషయాలు . ఒకటి – ఈ సంచిక వెలువడటానికి ఒక లక్షరూపాయల ఆర్థిక సహాయాన్ని పుదుచ్చేరి ప్రభుత్వం తరపున అందచేసిన మంత్రి శ్రీ మల్లాడి కృష్ణారావు, రెండు. ఏదేశమేగినా, ఎందుకాలిడినా...అన్న ట్టుగా తెలుగుకు ఎల్లలు లేవని, ఆంధ్రభారతికి సేవ చేస్తున్న డా॥ తూమాటి సంజీవరావు, ఇద్దరూ అభినందనీయులే!

ఎమ్.వి.శాస్త్రి 9441 342999


పొరుగు తెలుగు

కన్నడతోటలో విరిసిన తెలుగుపాట

బుర్రకథ ఈరమ్మ-సంచారి ఆత్మకథ

కన్నడ మూలం
డా. నింగప్ప ముదేనూరు

అనువాదం
రంగనాథ రామచంద్రరావు
9059779289



(ఏప్రిల్ సంచిక తరువాయి...)

చివరి రోజులు

(రెండు రోజులు చీకటి - రెండు రోజులు వెలుతురు)

ఈరమ్మది ఎన్నడూ ఇంకిపోని ఉత్సాహం.

వయస్సుకు తగినట్టు ముసలితనం ఆవరిస్తున్నప్పటికీ కావ్యగానంలో ఆమె ఇంకా యవ్వనవంతురాలు.

ముడుతలు పడ్డ చర్మం, కాంతివంతమైన ముఖం, చేతిలో తంబూర, చేతులకు మట్టి గాజులు, నుదురు నిండా విభూతి, వెండిలా తెల్లబడిన జుత్తు, సదా మెరుస్తున్న వెన్నెలలాంటి నవ్వు, నోటిలో ఎర్రగా మెరుస్తున్న తాంబూలపు గుర్తులు చూస్తే భూమికి దిగిన అల్లమప్రభు అనుభావలోకమే దిగివచ్చినట్టుంది. 'నడిచినంతగా నాడు, పొందినంతగా భాగ్యం' అన్నది ఆమె అభిప్రాయం.

ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగానే ఉండేది.

ఆరోగ్యం కాపాడుకోవటం కోసం తానే స్వయంగా దివ్య ఔషధాన్ని కనుక్కుని దాన్ని సేవిస్తున్నప్పటికీ ఎందుకో చివరి రోజుల్లో కృశించసాగింది.

గొంతుకు సున్నం పూసుకుని, నిరంతరం స్వరాలను, కథలను ధ్యానం చేస్తున్నట్టు ఉండేది.

ఈరమ్మకు గొంతులో ఏదో సమస్య తలెత్తింది.

దాంతో విచారంలో మునిగిపోయింది.

అయినప్పటికీ బుర్రకథా గానాన్ని ఆమె మానలేదు.

ఊరూరు తిరిగటం మానలేదు.

కథలు చెప్పటం ఆపలేదు.

చివరివరకూ కుమార రాముడి కావ్యాన్ని, స్యాసి చిన్నమ్మ, బాలనాగమ్మ మహా కావ్యాలను గానం చేస్తూ జీవితాన్ని సాగించింది.

ఈరమ్మలోని ఆశు కవిత్వ ప్రతిభ అద్భుతమైంది.

కథలోని ఒక సంఘటన దొరికితే చాలు.

ఆ సంఘటనలోని ఒక పోగు పట్టుకునినా కథను ఇట్టే అల్లుకునిపోగల సామర్థ్యం ఆమె సొంతం.

ఊహల్లో అల్లుకున్న కథనాన్ని చక్కగా అభివ్యక్తపరచగలిగే కళ ఆమెలో ఉంది.

కథావస్తువును గ్రహించి, దానికి మనస్సులోనే మెరుగులు దిద్దుకుని, తన సృజనాత్మకమైన కల్పనా చాతుర్యంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేసే శక్తి ఆమెలో ఉంది.

బుర్రకథలను పాడేటప్పుడు నృత్యం, అభినయం, కథలలో ఉపకథలను చెప్పటం, అలా చెబుతూ అందులో హాస్యం, వినోదం- ఇలా అనేక వైవిధ్యతలను అలవరుచుకుని కథను ఆసక్తికరంగా చెప్పటంలో ఆమె సిద్ధహస్తురాలు.

మితిమీరి ఆకువక్కలు నమలటం వల్లనే గొంతు నొప్పి వచ్చిందని నలుగురూ చెప్పినా ఈరమ్మ మానలేదు.

ఆత్మీయులు హెచ్చరించినా అలవాటు వదులుకోలేదు.

బుర్రకథలు చెప్పే తన కాయకానికి దూరం కాలేదు.

ఇలాంటి జానపద కళాకారులు పెదవులకు లిప్‌స్టిక్ పూయకపోతే ఏమిటి?

నోట నిరంతరం వెలిగే సూర్యుడి ఎరుపురంగుతో కూడిన తాంబూలం ఉండనే ఉంటుందికదా !

భోజనం అయిన తరువాత ఆకువక్కలతోపాటు కాచు వేసుకోవటం జానపదుల రోజువారీ అలవాటు.

అలాగే ఈరమ్మకూ ఆ అలవాటు ఉంది !

ఊరూరు పాడుతూ వెళ్ళేటప్పుడు ఇలాంటి గాయకులకు తాంబూలం ఇచ్చే ఉత్సాహం కావాలి.

పైగా ఈర్ష్య, అసూయలతో ఎవరైనా మందుమాకులు పెడతారేమోనని ఆమె తల్లితండ్రులకు భయముండేది.

ఆ కారణంగా మందుమాకులకు విరుగుడుగా అమాయకురాలైన ఈరమ్మ ఎప్పుడూ తన దగ్గర యాలకులు ఉంచుకునేది.

తాంబూలంలో యాలకుల పొడి కలుపుకుని ఆకువక్కలు వేసుకునేది.

అలాంటి ఈరమ్మకు ఇలా అయింది కదా !

అలాంటి మహాకావ్యాల గని మూగబోతుందని తెలిస్తే ఆమె

అభిమానులు ఎలా భరించగలరు?

నిజానికి ఈరమ్మవ్వకు ముందరి తరాల వరకూ జానపద కళ సజీవంగా ఉండాలనే కోరిక తీవ్రంగా ఉంది.

నిజానికి ఈరమ్మకు ఈ పురస్కారాల మీద, అవార్డుల మీద కోరిక లేదు.

గ్రామీణుల పిల్లలకు ఈ కథలు నేర్పించే ఒక పాఠశాల ఉంటే బాగుంటుందని ఆమె ఆలోచన.

ఆ ఆలోచన ఆమె జీవితానుభవంలోంచి మొలకెత్తింది.

ప్రభుత్వం తనకు ఇస్తున్న పింఛన్ సొమ్మును గ్రామీణ పిల్లల కోసమే ఉపయోగించాలని నిర్ణయించుకుంది.

అమాయకమైన పిల్లలలో తన గానసౌందర్యాన్ని చూడటానికి ఈరమ్మవ్వ తపించేది.

'ఈ ముసలితనంలో ఇదంతా నీకు ఎందుకమ్మా?' అంటే–

వెంటనే ఆమె నోటి నుంచి వచ్చే మాట–"అవ్వా, నీవు పాడుతున్న పాట నీతోటే వెళ్ళిపోకూడదు. అది రాబోయే తరాల వారినీ పెంచాలి. వాళ్ళు నీ కథ నేర్చుకోవాలి అని పెద్దపెద్ద సమావేశాలలో అందరూ చెప్పేవారే. అందుకే రోజూ నేను సాయంత్రం పిల్లలను కూర్చోబెట్టుకుని ఈ బుర్రకథలను ఎలా పాడాలో నేర్పిస్తున్నాను. ఈ తంబూర, దుముకి, గగ్గరి వాయించటం చూస్తే పిల్లలు, యువకులు సంతోషంతో పొంగిపోతారు. వారి సంతోషం చూస్తే నాకు సంతోషం. అదే ఉత్సాహంతో పాఠం చెబుతూ ఆనందం పొందుతున్నాను. నేను పాడుతున్నట్టు పాటలు పాడేవారిని చూడాలనే కోరిక నాకుంది. అదీ నేను బతికి ఉండగానే ఇదంతా చూడాలి" అని ముత్యాలు కూర్చినట్టు మాట్లాడుతుంది.

ఈరమ్మవ్వ ప్రజల మనసులో నిలిచిపోయేటటువంటి, సమాజ సముదాయంలో సంస్కృతి కలను నాటే కాయకాన్ని చాలా సంవత్సరాలుగా చేస్తూనే ఉంది.

ఏడు వేల పుటల, రెండులక్షల పంక్తుల ఈ కథన కావ్యాలను గానం చేయడమంటే సామాన్యమైన సాధననా?

ఈరమ్మ సంగీతసాధన లోకమే ఆశ్చర్యపోయేటటువంటిది!

ఆమె జీవితంలో వెనుతిరిగి చూసే మనిషి కాదు.

మొండిగా మునుముందుకు సాగే మనిషి.

అలా వున్నందువల్లే ఈ రోజు కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, నాడోజ పురస్కారం, జానపదశ్రీ పురస్కారం –ఇలా వందలాది పురస్కారాలు, సన్మానాలు, పతకాలు, గౌరవ చిహ్నాలు తన సరస్వతి కొప్పులో ముడిచిందామె.

ఈరమ్మ గొంతు అలా ఎందుకు అయ్యిందని, మందులు వేసుకోలేదా? చికిత్స చేయించుకోలేదా? అని అశ్వ రామును అడిగితే –"ఆమె ఎన్నడూ ఇంగ్లీషు మందులుకానీ, ఆయుర్వేద మందులు కానీ సేవించలేదు. వేప ఆకుల రసాన్నే తాగి జీవించింది. అలాంటి ఆమెకు ఏ రోగం వచ్చిందని అనుకుంటాం సార్? చనిపోయిన ఓ వృద్ధ ఆత్మ ఆమె దేహంలో చేరుకోవటంతో అలా అయ్యిందని అనాలా సార్?" అని అతనన్నాడుఈ

తన ఇంటి పెద్దలు మాట్లాడుకునే రీతిలోనే అశ్వ రాము మాట్లాడి వుండొచ్చని అనుకున్నాను.

పెద్దల ఆత్మ ఆమెలో చేరటం అంటే ఏమిటి?

ఈ మాటల అర్థాన్ని గ్రహిస్తే మహాకావ్యాల్లో కూర్చుని బయటికి రావటానికి ఎదురుచూసి లోలోపలే సతమతమ వుతున్న ట్టుంది.

ఏమైనాకానీ, వయస్సుకు సహజమైన కొన్ని బలహీనతలు మనుష్యులందరికి వచ్చినట్టే ఈరమ్మకూ వచ్చాయి.

ఏదో జబ్బు అంటూ బళ్ళారి ఆస్పత్రి చేరిన తరువాత కూడా ఈరమ్మ వార్డులోని మంచం మీదే పాడటానికి తపించింది.

డాక్టర్లకు ఎక్కడలేని ఆశ్చర్యం !

'నేను పాడాలయ్యా మా ఊరికి వెళ్ళాలి' అని పరితపించే ఈ మనిషిని చూస్తే, ఈ కావ్యపు బతుకుకు ఆమె ఎంతగా హత్తుకునివుండాలి.

చివరి ఊపిరివరకూ ఆమె పాడే స్వరానికి ఊపిరైంది.

ఇప్పుడు లోకం దృష్టిలో కళాదేవత అయింది.

హళెదరోజికి వెళితే అందరూ ఈరమ్మ జ్ఞాపకాలను గుర్తు చేసుకునేవారే.

'నేను ఈ తంబూర పట్టుకున్నాను. పాడుతున్నప్పుడు ఎక్కడైనా స్వరం తప్పితే ఈ నా తండ్రి సరిదిద్దుతాడు' అని అంటుంది ఈరమ్మ తంబూరను ప్రేమగా తడుముతూ.

ఆమె ఇంటికి వెళ్ళినపుడు–

"మీకు ఏమి పెట్టాలి స్వామి, ఈ అడవిలో ఏమీ దొరకదు స్వామి, కొంచెం అన్నం, చట్నీ. ఇంతే మాఇంటి భోజనం. ఇదే తిందురు రండి" అని ఆహ్వానిస్తుంది.

తల్లిబిడ్డలు వేరయ్యే కావ్యభాగాలను గానం చేసేటప్పుడు (బాలనాగమ్మ మహాకావ్యం) కన్నీరయ్యే ఈరమ్మ ఇప్పుడు మనకు జ్ఞాపకం మాత్రమే.

అయితే ఆమె వెలిగించిన కావ్యపు ప్రమిదలు వెలుగుతూనే ఉన్నాయి. ఒకటా? రెండా?

అనేక మహాకావ్యాలను పాడిన ఈరమ్మ అనేక తరాలను కలిపింది.

కన్నడ మహా విశ్వవిద్యాలయాలను, లోకపు జ్ఞాన పరం పరలను తన కావ్యం, కథల ద్వారా వెలిగించింది.

అందువల్లనే ఆమె గౌరవనీయమైన నాడోజ పదవిని పొందింది.


జానపదశ్రీగా మెరిసింది.

అనుభవాలగనిలా ఉన్న ఈరమ్మ జీవితమే ఒక మహా కావ్యకథనపు దారి. ఈ దారిలో నడిచే సౌభాగ్యం కన్నడిగులది. తల్లినాడు తెలుగువాళ్ళది కూడా. ఈ రెండు సంస్కృతుల కలయికగా భావసేతువుగా ఈరమ్మ బతికింది.

(అయిపోయింది)

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362


అలానే పుస్తకం నిలువుగా రావాలా, అడ్డంగా రావాలా అన్న విషయాన్ని ఎంచుకోవాలి. ఈ ప్రశ్నావళి పూర్తి చేసాక, బొమ్మలు, పాఠ్యం చేర్చుతూ మన పుస్తకాన్నిరూపొందించవచ్చు. మన పుస్తకానికి వాడుకొనదగిన బొమ్మలు వేలల్లో అందుబాటులో ఉన్నాయి, వెతికి సరైన బొమ్మలు ఎంచుకోవాలి.



ఇక అనువాదం, ఇంకా సులువైన పని. Translate అన్న లంకెను నొక్కి అనువాద పేజీకి చేరుకుంటాము. అక్కడ ఏ భాష నుండి ఏ భాషకు అనువాదం చేయాలనుకుంటున్నామో తెలిపితే, కొన్ని కథల పుస్తకాలు కింద దర్శనమిస్తాయి, వాటిలో నచ్చిన కథని ఎంచుకొని అనువదించండి.



కథ పుస్తకం తెరుచుకుని, ఒక్కో పేజీని మన ముందు ఉంచుతుంది, ఆంగ్ల పాఠ్యం నుండి తెలుగు అని ఇక్కడ ఎంచుకున్నాం గనుక ఆంగ్లంలో ఉన్న పాఠ్యం కనిపిస్తుంది, ఆ పాఠ్యంపై మౌస్‌తో రెండుసార్లు నొక్కితే, పాఠ్యం చొప్పించే పెట్టె ముందుంటుంది. అక్కడ తెలుగు అనువాదాన్ని చేర్చవచ్చు.



ఇలా మీరు ఒక కథకి ఒక భాషలో ఎన్ని అనువాదాలైనా చేర్చవచ్చు. అందుకని ఒకవేళ మీకు నచ్చిన కథని ఇంకెవరైనా అనువాదం చేసినా, మీ అనువాదాన్ని కూడా చేర్చవచ్చు. ఇది స్వచ్ఛందంగా మనం సమాజానికి అందిస్తున్న అపురూప కానుక. సహకరించి, అన్ని కథలు తెలుగులో అందుబాటులోకి వచ్చేలా తోడ్పడమని మనవి.

– రహ్మానుద్దీన్ షేక్

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
May 2019 Vol :5, Issue 3

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244